ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 455

వెల : రూ.25/-

ఫిబ్రవరి 2023



జనసాహితి ప్రచురణ

# చిలకమ్మ చదువు

*రవీంద్రనాథ్ టాగూర్*

అనువాదం : *పద్మా శేఖర్*

అనగనగా ఒక పక్షి వుంది. అది చాలా మూర్ఖురాలు. పాడుతుంది గాని, శాస్త్రాలు చదవలేదు. దుముకుతుంది, ఎగురుతుంది. కానీ దానికి నియమాలు, ఆచారాలు, చట్టం గురించి తెలియదు.

"అలాంటి పక్షి వల్ల ఏం పని జరుగుతుంది. అడవులలో దొరికే పళ్ళు తిని రాజులకు, రాజ్యంలో వున్న పండ్ల బజారుకు నష్టం తెస్తుంది" అని రాజు అన్నాడు.

మంత్రిని పిలిపించి "ఈ పక్షికి చదువు చెప్పండి" అని ఆజ్ఞాపించాడు.

ఆ పక్షికి విద్యను నేర్పే బాధ్యత రాజుగారి మేనల్లుడికి అప్పగించారు.

పండితుల సభ ఏర్పాటయింది. అందరూ కలిసి దీర్ఘంగా ఆలోచించారు. ఇదొక పెద్ద సమస్య. ఆ పక్షికి విద్య లేకపోవటానికి కారణం ఏమిటి? ఈ విషయం మీద చాలా చర్చ జరిగింది.

పెద్ద పెద్ద పండితులు ఆ చర్చలో పాల్గొన్నారు. అందరూ కలిసి ముక్తకంఠంతో చెప్పారు : "ఈ పక్షి ఒక చిన్న గూడు కట్టుకుంటుంది. అది ఎంత చిన్నగా వుంటుందంటే దాంట్లో విద్య అనే బరువైన వస్తువు పెట్టటానికి స్థలం ఉండదు. అందువల్ల అన్నిటికంటే ముందు ఈ పక్షి కోసం ఒక పంజరం నిర్మించాలి".

రాజపండితుల సలహా అద్భుతమైనది. వారికి దక్షిణ తాంబూలాలు ఇచ్చారు. వాళ్ళు ఎంతో సంతోషంతో తమ ఇళ్ళకు వెళ్ళారు.

వడ్రంగి పంజరం తయారుచేయటం ప్రారంభించాడు. పంజరాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించాడు. దానిని చూడటానికి దేశ విదేశాల నుండి ప్రజలు వచ్చారు. సౌందర్యాన్ని ఆరాధించేవారే కదా అందరూ. "విద్య నేర్చుకోవటానికి కూడా కొన్ని హద్దులు ఉన్నాయి" అని కొంతమంది అన్నారు. మరి కొంతమంది "విద్య లేకపోతే ఏమయింది, పంజరం అయితే తయారయింది. ఇదంతా పక్షి అదృష్టం" అన్నారు.

వడ్రంగికి సంచుల నిండా కానుకలు ఇచ్చారు.

పండితులందరూ పక్షికి విద్య నేర్పించటానికి కూర్చున్నారు. నశ్యం పీల్చుకుని యిలా అన్నారు : "కొన్ని పుస్తకాలతో పని జరగదు. పక్షిని చదివించటం అనేది ఏమయినా మామూలు విషయమా?"

ఆజ్ఞను పాలించే మేనల్లుళ్ళు ఆజ్ఞకోసమే నిరీక్షిస్తున్నారు. వెంటనే పుస్తకాలు రాసేవారిని పిలిపించారు. వారు కూడా ఆజ్ఞను పాటించటంలో తక్కువవాళ్ళేమీ కాదు. పుస్తకాలను అనుకరించే కార్యక్రమం వెంటనే ప్రారంభమయింది. మళ్ళీ అనుకరించిన వాటినే అనుకరించటం. అనుకరణే అనుకరణ. చూస్తుండగానే పుస్తకాల గుట్ట ఏర్పడింది. చూసినవారందరూ గొంతులు విప్పి పొగిడారు. "భలే! భలే! విద్యను పెట్టటానికి ఇప్పుడు స్థలం ఎక్కడ ఉంది?"

అనుకరణ చేసిన వారికి బండ్ల నిండుగా పారితోషికం లభించింది. ఎద్దులు యింటివైపుకి తిరిగి పరుగు లంకించుకున్నాయి. ఏ యింట్లో కూడా దేనికీ లోటు లేదు.

విలువైన పంజరం జాగ్రత్త గురించి మేనల్లుళ్ళకు చింత కలిగింది.

ఒకవైపు చింత, మరొకవైపు కలవరం. వారికి చాలా బాధ్యతలు వున్నాయి. శుభ్రపరిచే పని, బాగుచేసే పని. అంతూపొంతూ లేని పద్ధతిలో పనే పని. శుచీ శుభ్రతతో మెరిసిపోతున్న పంజరాన్ని చూసిన తరువాత ప్రజలు "అభివృద్ధి జరుగుతోంది" అని అన్నారు.

పెద్ద పెద్ద పనులు ఎక్కువమంది మనుషులతోనే అవుతాయి. అందువల్ల మనుషుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతూ ఉంది. మళ్ళీ మనుషుల పని చూడటానికి మరింతమంది మనుషులు పెరిగారు. వాళ్ళు ప్రతీనెలా పెద్ద పెద్ద జీతాలు తీసుకుని బరువైన రిజిష్టర్లు నింపుతున్నారు. రిజిష్టర్లు నిండుతూనే వున్నాయి.

ప్రతీవాళ్ళ అమ్మ తరఫు, నాన్న తరఫు బంధువులు రాజప్రసాదంలో విశ్రాంతిగా కూర్చున్నారు.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కదానికి లోటు ఉంది కానీ, గోరంతలు కొండంతలు చేసే విమర్శకులకు లోటులేదు. అవసరానికి మించి కూడా విమర్శకులు ఉన్నారు. పంజరం అయితే బాగా తయారయింది, కానీ పక్షి ఆలనాపాలనా చూసేవాళ్ళు ఎవరూ లేరని వాళ్ళన్నారు.

రాజు చెవుల వరకు ఆ విమర్శ వచ్చింది. అతను అందరికంటే ఎక్కువ బాధ్యతలు మోసే మేనల్లుడిని పిలిచి "కుమారా, నేనేమి వింటున్నాను" అన్నాడు.

మేనల్లుడు సహజమైన స్వరంతో విన్నవించాడు. "మహారాజా, మీకు భగవంతుడివలే ప్రతి విషయం తెలుసు. అయినప్పటికీ మీరు నిజం తెలుసుకోవాలంటే వడ్రంగులను, పండితులను పిలిపించండి. అనుకరణ చేసేవాళ్ళను, మరమ్మతు చేసేవాళ్ళను, దీన్ని జాగ్రత్తగా చూసేవాళ్ళను పిలిపించండి. సోమరిగా ఉండి నిందించేవాడి దగ్గర ఏం పని ఉంటుంది? వాళ్ళకు తింటానికి ఏమీ దొరక్క ఇలా విమర్శిస్తూ వుంటారు."

జవాబు విని రాజు పరిస్థితిని సమీక్షించాడు. లోతుగా ఆలోచించాడు. చివరకు మేనల్లుడి మెడలో ఎంతో అమూల్యమైన బంగారు హారాన్ని అలంకరించాడు.

చిలుకకు చదువు చెప్పడం ఎంత బాగా జరుగుతుందో తెలుసుకోవాలని రాజుకి కూడా కోరిక కలిగింది. స్వయంగా తన కళ్ళతో తనిఖీ చేయాలనుకున్నాడు.

అందువల్ల ఒకరోజు అతను, తనకు విశ్వాసపాత్రుడైన ఒక మంత్రి, దివాను, మిగతా మంత్రులతో కలసి పాఠశాల పనీపాటలు చూడటానికి వెళ్ళాడు.

ఆయన రావడంతో సింహద్వారం దగ్గర శంఖం, గంట, బాకా, డోలు, మృదంగం, చప్పట్లు మోగాయి. పండితులు గొంతు సవరించుకుని వేళ్ళు తిప్పుతూ మంత్రాలు చదువుతున్నారు. మేస్త్రీ, కూలీలు, వడ్రంగి, అనుకరణకర్తలు, కాపలాదారులు, అమ్మ తరఫు, నాన్న తరఫు బంధువులు పెద్ద స్వరంతో జయజయనాదాలు పలికారు.

పెద్ద మేనల్లుడు "మహారాజా సెలవివ్వండి. మొత్తం పని మీ కళ్ళెదుటే ఉంది. పుట్టలో దాగున్నదాన్ని కూడా చూడగల మీ కళ్ళ ముందు ఏదీ దాయటానికి లేదు" అని అన్నాడు.

మహారాజు ఎంతో సంతోషించి తిరిగి ప్రయాణమయ్యాడు. సింహద్వారం దాటిన తరువాత, ఏనుగు ఎక్కబోయేముందు విమర్శకుడు "మహారాజా మీరు అసలు పక్షిని చూడలేదు" అన్నాడు.

(తరువాయి 3వ అట్టలో....)

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

455

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 46
సంచిక : 7
ఫిబ్రవరి 2023

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


- ✦ ముఖచిత్రం : విస్థాపన – చిత్రం అంతర్జాలం నుండి ..... 01
- ✦ రెండవ అట్ట : చిలకమ్మ చదువు – రవీంద్రనాథ్ ఠాగూర్ అనువాదం : పద్మా శేఖర్ ..... 02
- ✦ మూడవ అట్ట : జోహార్లు! కొత్తపల్లి సుధాబాల ..... 43
- ✦ నాల్గవ అట్ట : కార్టూనిస్ట్ టీ.వీ. గీసిన చిత్రం ..... 44
- ✦ సంపాదకీయం–1 : భాషావిధానాలు – విద్యావ్యవస్థ విధ్వంసం ..... 05
- ✦ సంపాదకీయం–2 : విస్థాపనలో మరో విపరీతం ..... 07
- ✦ కథ : 'ఆఫీసరుకు విందు' హిందీమూలం : భీష్మ సాహ్ని అనువాదం : డా॥ వెన్నా వల్లభరావు ..... 09
- ✦ ధారావాహిక : దేశ విభజన వస్తువుగా సాహిత్యం (6) ఖుర్రతులైన్ హైదర్ రచనలు –2 – కొత్తపల్లి రవిబాబు ..... 14
- ✦ స్పందన : విశ్వవిద్యాలయాలను తన హిందుత్వవాద..... – హరిబాబు ..... 17
- ✦ వ్యాసాలు : సంఘటిత ప్రజాఉద్యమ శక్తుల నిరంతరాయ పోరాటమే.... – దివికుమార్ ..... 19
  - : భావవాదం – భౌతికవాదం – డా॥ ఆర్కే ..... 37
- ✦ డాక్యుమెంటరీ సమీక్ష : 'ఇండియా : ద మోదీ క్వశ్చన్' – బాలాజీ (కోల్‌కతా) ..... 24
- ✦ జాతీయ అక్షరయోధులు : డి. జయకాంతన్ – సింగంపల్లి అశోక్‌కుమార్ ..... 27
- ✦ పుస్తక పరిచయం : 'అజాద్‌నగర్' – లారా టి. మర్ఫీ – జి.వి. భద్రం ..... 28
  - : అమ్మనుడిపై నాలుగు తెలుగు పుస్తకాలు – కొత్తపల్లి రవిబాబు ..... 39
- ✦ కవితలు : సహచరి (08); రవి నన్నపనేని (13), దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (42)
- ✦ వివిధ : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (26); కార్టూన్‌లు – అంతర్జాలం నుండి వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (35, 36)
- ✦ సంతాపాలు : రావిపూడి వెంకటాద్రి (18); కాట్రగడ్డ వెంకటేశ్వర్లు, రేగులపాటి కిషన్‌రావు (23); నీలమని పుకాన్ (34)


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

**చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :**
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

**రచనలు పంపవలసిన చిరునామా :**
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

‘ప్రజాసాహితి’
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
“అకౌంట్ నెం.

***0680101004936***

***IFSC No. CNRB0000680***

**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**

మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం


# 33వ విజయవాడ పుస్తక ప్రదర్శన

**09-02-2023 నుండి**
**19-02-2023 వరకు**

**గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ**
రమేష్ హాస్పిటల్స్ ఎదురుగా,
విజయవాడ-520008.

మైత్రి బుక్ హౌస్
అభ్యుదయ, విప్లవ సాహిత్య కేంద్రం

**మా స్టాల్‌ను**
**తప్పక సందర్శించండి**

**వివరాలకు : 94901 96890**

సంపాదకీయం-1

మాతృభాషాదినోత్సవాల సాక్షిగా

# భాషా విధానాలు - విద్యావ్యవస్థ విధ్వంసం

**2023** జనవరి నెల మొదటివారం ఆంధ్రదేశంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి పిల్లలు ఇంగ్లీషు పరీక్ష రాస్తున్నారు. ప్రశ్నాపత్రం ఆశ్చర్యకరమైన రీతిలో 16 పేజీలు ఉంది. తమకు ఇంగ్లీషు బోధించే మేస్టారొచ్చి ప్రశ్నాపత్రంలో విషయాన్ని వివరిస్తే ఏ కొంచెమైనా జవాబులు రాయాలని కొందరు, గదిలోనే ఉన్న ఇన్విజిలేటర్‌గారు ఏమైనా చెప్పకపోతారా?!.. అని మరికొందరు.... ముందువాడు ఏమైనా రాస్తే కాపీ కొట్టేద్దామనుకుంటూ.... ఎంత సేపటికీ ఏమీ రాయడేమిటా అని ఎదురుచూసేవాళ్ళు.. ఇలా మూడుంపావు గంటలూ గడిపేసి ఏమీ రాయకుండా అయోమయంగా పేరు రాసి పేపరిచ్చేసారు పిల్లలందరు. ఇది ఏదో ఒక పాఠశాల పరిస్థితి కాదు. గ్రామీణ, పట్టణ, ఏజెన్సీ ప్రాంతాలన్నింటా దాదాపుగా యిదే పరిస్థితి. ఇది ఆ పరీక్షరోజున ఏర్పడిన అయోమయం కాదు. తెలుగు పిల్లలకు ఇంగ్లీషు బోధనా భాషగా రుద్దిన ఫలితమే ఇది. వేపకాయగా మొదలైన ఇంగ్లీషు మీడియం వెర్రి, తలకు రోకలి చుట్టుకునేంతగా ఎదిగించేందుకు పరాధీన పాలకవర్గం పన్నిన విషవలయమే ఈ పరిణామానికి కారణం. అట్లూరి పురుషోత్తంగారు తన 'మాతృభాషలో ప్రాథమిక విద్య' గ్రంథంలో చెప్పినట్టు.. పిల్లలకు మాతృభాషను కాక ఇంగ్లీషును బోధనా భాషగా చేసినప్పుడు మొదటి బలిపశువు తెలుగు కాగా, రెండవది గణితం, మూడవది ఇంగ్లీషే. వెరసి మన పిల్లలకు అసలైన అర్థంలో చదువు రాకుండా జాతిని నిర్వీర్యం చేయడంలో మన పాలకులు కృతకృత్యులౌతున్నారన్నమాట.

యునెస్కోవారి పూనికతో ప్రతిఏటా వచ్చి వెళ్ళిపోతున్న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాల నేపథ్యం నుండి మన చదువుల ఈ అస్తవ్యస్థ పరిస్థితులను తరచి చూస్తే, బావురుమంటూన్న భాషామతల్లుల రోదన, బెంగటిల్లి బిక్కచచ్చిపోతున్న బిడ్డల భవిష్యత్తు చిత్రపటం మన కళ్ళముందు కనిపిస్తుంది. నాటి తూర్పు పాకిస్తాన్, నేటి బంగ్లాదేశ్‌కు చెందిన అబ్దుల్ బర్కత్ రఫీకుద్దీన్ అహ్మద్, షాఫియర్ రెహ్మాన్, జబ్బార్ తదితర భాషోద్యమ కార్యకర్తలు ఉర్దూ పెత్తనాన్ని నిరసిస్తూ, 1952 ఫిబ్రవరి 21న పాకిస్థాన్ ప్రభుత్వం జరిపిన కాల్పులలో అమరులైన సంఘటన నుండి స్ఫూర్తిపొందుతూ ఏటేటా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో సంకల్పించింది. భూగోళమంతటా మానవులు తమ జీవన కార్యరంగంలో, శ్రమతో సామాజిక ఉత్పత్తి క్రమంలో నిర్మించుకొన్న భాషాసంపదను కాపాడుకుంటూ మరింత సంపద్వంతం చేసి భవిష్యత్తు తరాలకు అందించాలని, దోపిడీ ఆధిపత్య శక్తుల జాతుల అణచివేతకు అణగారిపోకుండా, అదృశ్యం కాకుండా కాపాడుకోవాలనే ప్రజాస్వామిక ఆకాంక్షకు ఊతమిచ్చింది. నిజానికి జాతీయోద్యమంతో పాటు పెనవేసుకు సాగిన సంఘసంస్కరణోద్యమాలకు మన తెలుగునేల బాసటగా నిలిచింది. మూఢనమ్మకాల నిర్మూలన కోసం, వితంతు పునర్వివాహాలకోసం, స్త్రీ విద్య వ్యాప్తి కోసం జరిగిన ఉద్యమాలు తెలుగునాట ప్రజాస్వామిక చైతన్యానికి ఊపిరులూదాయి. గిడుగు – గురజాడల త్యాగపూరిత కృషితో విజయం సాధించిన వ్యావహారిక భాషాఉద్యమం సారాంశంలో మాతృభాషా పరిరక్షణోద్యమమే. ప్రాణవాయువులందని గ్రాంథిక భాషా సంప్రదాయాల సంకెళ్ళను విరగ్గొట్టి జవజీవాలనందించే ప్రజాబాహుళ్యంలోకి భాషను తీసుకు రావడం అంటే పరిరక్షణే కదా?!.... తెలుగువారు విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలంటూ ఉద్యమించిన ఫలితంగా ఏర్పడ్డ భాషాప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు కూడా 'భాషే' ప్రధాన ఇరుసు.

అధికార మార్పిడి జరిగిన తర్వాత ఏర్పాటుచేయబడ్డ విద్యారంగపు కమీషన్లలో ప్రజాతంత్ర స్వభావం గల కొఠారీ కమీషన్ సిఫారసుల్లో కూడా, ఆయా ప్రాంతాల ప్రాంతీయ భాషలలోనే విద్యాబోధన జరగాలని ఉంది. ఇదే విషయం ఆ తర్వాత వచ్చిన జాతీయ విద్యావిధానం – 1968లో పొందుపరచబడింది. 1986 నూతన విద్యావిధానం, 2020 జాతీయ విద్యావిధానాలలో సైతం మాతృభాషను పరిరక్షించాలని, విద్యాబోధన మాతృభాషల్లోనే ఉండాలని రాసుకొస్తూనే ఉన్నారు. మన దేశ గత ఉపాధ్యక్షులైన వెంకయ్యనాయుడు పుంఖానుపుంఖాలుగా ఎడిట్ పేజీ వ్యాసాలు రాశారు. రాస్తూ ఉన్నారు. మా పిల్లలతో మేమసలు మమ్మీ.. డాడీ.. అని పిలిపించుకోము తెలుసా!!.. అనే నాయకులు, ఉయ్ స్పీకిన్ తెలుగు ఓన్లీ యూనో.... అంటూ డాబుసరిగా గప్పాలు కొట్టే నాయకులూ పెరిగిపోతున్నారు. తెలుగును మ్యూజియం భాషగా మార్చాలని రంగులు పూస్తున్న వీరి వికటాట్టహాసాలు ప్రజల మనసు వాకిళ్ళలో మారుమోగుతూ ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్టు.. తెలుగు భాషకు అందరూ హంగులద్దేవారే కదా! మరి తెలుగు రాష్ట్రంలో బోధనా మాధ్యమంగా తెలుగును ఎందుకు ఎత్తివేసినట్టు?!.. తెలుగు నుండి.., తెలుగు, ఇంగ్లీషు రెండుగా.. చివరికి నేడు ఓన్లీ ఇంగ్లీషే అంటూ బరితెగింపు ఎందుకు?!..

ఈ శతాబ్దపు సవాళ్ళను స్వీకరించే విద్యావ్యవస్థను నిర్మిద్దామంటూ 1986లో రాజీవ్‌గాంధీ, 1992లో పి.వి. నరసింహారావు, 2020లో మోదీలు గప్పాలు కొడుతూ విద్యారంగపు పాలసీలు ప్రకటించారు. కుల, మత, వర్ణ, వర్గ, లింగ వివక్షలకు అతీతమైన విద్య అని పైకి ప్రకటిస్తూ క్రమంగా విద్యలో క్రొత్త అంతరాలు సృష్టిస్తూ.. పాత అంతరాలు మరింత పెద్దవి చేసే విధానాలను పట్టాలెక్కించారు. అటు సామ్రాజ్యవాద పెట్టుబడులకు సాగిలపడే మేధోవర్గాన్ని, ఇటు ఇంగ్లీషు చిలుక పలుకులు పలుకుతూ దోపిడీ కోరల్లోకి తమను తామే బలిపెట్టుకునే శ్రమజీవులను సృష్టించే పనిలో విజయం సాధిస్తున్నారు. ప్రజల మధ్య ఏ చీలికలు, వివక్షలు లేకుండా పిల్లలందరినీ ఒకే గొడుగు క్రిందకు తేవాలనే కామన్‌స్కూలు విధానాన్ని ప్రజాతంత్ర మేధావులు, ఉపాధ్యాయ, విద్యార్థిసంఘాలు కోరుతున్నా, ఆ ప్రజాస్వామిక డిమాండును తుంగలోకి తొక్కుతున్నారు. మరోవైపు పీడిత బలహీన వర్గాలు ప్రజలు ఐక్యం కాకుండా చీల్చి ఉంచుతూ, ఎన్ని, చీలికలో అన్ని గొడుగులన్న ప్రాతిపదికన విద్యావ్యవస్థను యాజమాన్యవారీగా ముక్కలు చెక్కలు చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న కాషాయం పార్టీవారు ప్రజల విద్యావ్యవస్థను ఖండఖండాలుగా నరుకుతున్న సామ్రాజ్యవాద విధానాల గొడ్డలి అంచుకు మనువాదపు కంపును కూడా పులుముతున్నారు. జ్యోతిష్యం శాస్త్రమని, సంస్కృతం దేవుడి భాష అనీ.. ఇంకా ఇలాంటి అనేకానేక పిట్టీలు కొడుతూ చదువుల రథాన్ని వెనక్కి మధ్యయుగాలలోకి తిప్పి నడపాలని ఉబలాటపడుతున్నారు.

ప్రపంచబ్యాంకు విధానాలకు మన గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు జోహుకుం అంటూ నిలుస్తున్నారు. గత ముఖ్యమంత్రి విజన్ 2020 అంటూ విద్యలో విదేశీ పెట్టుబడులు మిళాయించి ప్రయివేటీకరణ దారులు వెడల్పు చేసి పెట్టారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఆ దారిలో నడవడం కాదు పరుగులు పెట్టాలి అంటున్నారు. భాషంటే ఇంగ్లీషేనంటూ, చదువనేది ఇంగ్లీషులోనే జరగాలని.... ఈ విషయంలో మడమ త్రిప్పేదే లేదంటున్నారు. 2019 నవంబరు నెలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. 44,512 ప్రభుత్వ పాఠశాలలున్న ఆంధ్ర రాష్ట్రంలో గతంలో 4,000 పాఠశాలలను సక్సెస్ స్కూళ్ళు పేరిట ఇంగ్లీషు, తెలుగు రెండు మాధ్యమాలనూ ఉంచారు. గౌరవ ముఖ్యమంత్రిగారిచ్చిన ఆ ఉత్తర్వు దెబ్బకు అన్ని పాఠశాలలలోనూ మాధ్యమంగా తెలుగు చావుదెబ్బ తిని, కేవలం ఒక సబ్జెక్టుగా కొన ఊపిరితో మిగిలింది. కాగా, ఈ విషయమై ఉన్న ఫలానా తెలుగు మీడియం తీసేస్తే గ్రామీణ, నిరుపేద పిల్లలు చదువుకు దూరమౌతారని తద్వారా ఆర్టికల్ 21-ఎ విస్మరణకు గురౌతుందని ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేయగా కోర్టులు 'తప్పనిసరి' ఇంగ్లీషు మీడియం నిర్ణయాన్ని నిలువరించాయి. కానీ ఘనత వహించిన మన ఏలికలవారు ఇంగ్లీషు, తెలుగు ద్విభాషా పాఠ్యపుస్తకాలను ఆగమేఘాల మీద ముద్రింపజేసి, ఎవరు చెప్పారు తెలుగు మీడియం ఎత్తివేశామని!!.. చూడండి ద్విభాషా పాఠ్యపుస్తకాలు.. పిల్లలు స్వేచ్ఛగా ఏది కావాలంటే అదే నేర్చుకుంటారు, అదే మా టీచర్లూ నేర్పుతున్నారు అంటూ బోధననే అపహాస్యం చేస్తున్నారు. నిజానికి పాఠశాలల్లో పిల్లలు ఇంగ్లీషు మీడియం బోధన అర్థంకాక ఉక్కిరిబిక్కిరౌతున్నారు. కానీ ప్రభుత్వంవారు మాత్రం 95%పైగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీషు మీడియంలోనే చదవాలని కోరుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అవకాశం లేక ప్రయివేటు పాఠశాలలకు తరలిపోయి ప్రభుత్వ పాఠశాలల ఎన్‌రోల్‌మెంటు తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితి మారాలంటే ఇంగ్లీషు మాధ్యమపు బోధన తప్పనిసరి అవసరమని వాదిస్తున్నారు. తెలుగు రాష్ట్రంలోని అధికారపార్టీవారు తమపై వస్తున్న విమర్శలకు సమాధానమిస్తూ.. ఇంగ్లీషు మీడియంను వ్యతిరేకించే వారంతా తమ తమ పిల్లలను ఎక్కడ ఏ మాధ్యమంలో చదివిస్తున్నారో సమాధానమివ్వాలని సమస్యను తప్పుదోవ పట్టించే సవాళ్ళు విసురుతున్నారు.

దేశ భవిష్యత్తు పౌరుడు తన బాల్య కౌమారాల ప్రాయంలో ఒక సరైన విద్య పొందడానికి ఇన్ని గందరగోళాలు అవసరమా?!.. విద్యార్థి జ్ఞాన ప్రపంచపు వికాసానికి మాతృభాషలో విద్య నేర్పడమే సరైన పద్ధతని ప్రపంచమంతా ఘోషిస్తుంటే,.. తల్లిపాల భాషా స్తన్యాన్ని బిడ్డ నోటికందకుండా ప్రభుత్వాలు, ప్రపంచబ్యాంకు ప్రైవేటీకరణ విధానాలూ, సామ్రాజ్యవాద పెట్టుబడులూ ఇంతలా అడ్డుపడాలా?!.. ఏ దోపిడీ ప్రయోజనాలు, ఇంకెన్ని శతాబ్దాలు కొనసాగడానికి జాతిని నిర్వీర్యపరిచే ఈ కుట్రలు కొనసాగిస్తారు?!.. విజ్ఞత కలిగిన ప్రజాతంత్ర వాదులంతా ఈ పరిణామాలను పట్టించుకోవాలి. మన భాష కోసం, మన మాతృభాష కోసం, మాతృభాషలో విద్యకోసం మనమంతా ఒక్కటై గొంతు కలపకపోతే వచ్చి వెళ్ళిపోతున్న మాతృభాషా దినోత్సవాల సాక్షిగా జాతి మూగదైపోతుంది. **24-1-2023**

## ఆహ్వానం

## 31వ జాతీయ నాస్తికమేళా

**2023 ఫిబ్రవరి 11, 12 చార్వాకాశ్రమం**

**ప్రత్యామ్నాయ** ప్రజాసంస్కృతిని, భౌతికవాద జీవన విధానాన్ని ప్రచారం చేస్తూ 1992 నుండి 31 సం॥లుగా ఫిబ్రవరి రెండవ శని, ఆదివారాలలో చార్వాకాశ్రమంలో నాస్తికమేళా జరుగుతూంది. బి. రామకృష్ణ స్థాపించిన ఈ చార్వాకాశ్రమం, గుంటూరు జిల్లా మంగళగిరి నుండి నిడమర్రుకు వెళ్ళేదారిలో వుంటుంది.

అసమాన సమాజాన్ని మార్చటానికి భౌతికవాద భావజాల తోడ్పాటునూ, అన్వయింపుల గురించి తెలియచేస్తూ వివిధరంగాల ప్రజాసంఘాల బాధ్యుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మేజిక్‌షోలు, మూఢనమ్మకాల గుట్టును రట్టు చేసే అనేక ఇతర కార్యక్రమాలు ఉంటాయి.

## సంపాదకీయం-2

# విస్థాపనలో మరో విపరీతం!

**పత్రికల** పరిభాషలో విస్థాపన అనే పదం పూర్వం పెద్దగా లేదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తదనంతర కాలంలో అది ప్రాచుర్యంలోకి వచ్చింది. కారణం ఏమీ లేదు, విస్థాపనలు విపరీతంగా పెరిగిన కాలం ఇదే కనుక!

ఒకచోట జీవించే ప్రజా సమూహాన్ని అక్కడ నుండి ఖాళీ చేయించడం, వెళ్ళగొట్టడం, తరిమివేయడం లాంటి చర్యలను విస్థాపన అంటున్నారు. మరొక చోట (ప్రత్యామ్నాయంగా) నివసించే ఏర్పాటు ఉంటే ఆ పదానికి పూర్తి అర్థం చేకూరవచ్చు.

భాజపావారి హయాంలో బుల్డోజింగ్ అనే కొత్తపదాన్ని నిఘంటువులకు అందించారు. తమకు నచ్చనివారి ఇళ్ళను అక్రమ కట్టడాలుగా ప్రకటించి, వాటిని బుల్డోజర్‌తో ధ్వంసం చేయడం ఒక పద్ధతిగా అమలు జరుగుతున్నందువల్ల ఆ పదం పుట్టింది.

జోషి మఠంగా పేరుపొందిన జ్యోతిర్మయి మఠం గురించి ఇటీవల ప్రతిరోజు మీడియాలో వార్తలు వెలువడ్డాయి, కానీ హల్ద్వానీ అనే పేరు పెద్దగా కనిపించలేదు. ఆ ప్రాంతం కూడా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోదే!

50 వేలమంది పైగా జనాభా నివసించే హల్ద్వానీ ప్రాంత ప్రజలను రైల్వేస్టేషన్ విస్తరణ నెపంతో, పారా సైనిక దళాలను వినియోగించి అయినా సరే రైల్వేశాఖవారి స్థలాన్ని ఖాళీ చేయించవలసిందిగా ఉత్తరాఖండ్ హైకోర్టు గత డిసెంబర్ 20న ఆదేశం జారీ చేసింది. అయితే ఈనెల 5న సుప్రీంకోర్టు పై ఆదేశం అమలుని నిలుపుదల చేసింది. ప్రత్యామ్నాయం చూపకుండా వేలాది కుటుంబాలను ఉన్నట్టుండి ఖాళీ చేయమనడం అమానవీయమని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

సాధారణంగా విస్థాపనల బాధితులు పేదవారు అయ్యుంటారు. ముఖ్యంగా కొండ కోనల్లో నివసించే ఆదివాసీలు, నగరాలలోని మురికివాడల వాసులు ఇందుకు గురవుతూ ఉంటారు. అభివృద్ధి పేరిట విస్థాపనను పాలకవర్గాలు వారి మీడియా సమర్థిస్తూ ఉంటుంది.

దేశం మొత్తంలో ఆదివాసీల జనాభా నూటికి ఎనిమిది వంతులు అయితే వివిధ ప్రాజెక్టుల పేరిట జరిగిన విస్థాపనలకు గురైన వారిలో నూటికి నలభై వంతులు ఆదివాసీలే! అంటే పాలకులు చెప్పే అభివృద్ధి చాటున ఆదివాసీల జీవన విధ్వంసం దాగి ఉందన్నమాట ! పట్టణాలు నగరాలలోని మురికివాడలలో జీవించేవారు కూడా ఎక్కడో ఒకచోట ముఖ్యంగా గ్రామాల నుండి విస్థాపన(వలస)కు గురై వచ్చిన వారయి ఉంటారు.

వలస అంటే ఒక రకమైన సామాజిక విస్థాపన.

నగరాల సుందరీకరణ పేరిట మురికివాడల వాసులను విస్థాపనకు గురి చేయటం కద్దు.

ప్రస్తుతం భాజపా వారి పరిపాలనలో కక్ష సాధింపు విస్థాపనలు కూడా చేరాయి. దానికి కారణం మతం కావటమన్నది కొట్ట వచ్చినట్లు కనిపించే మరో విపరీతం!! అలా చెప్పడానికి మనకైనా సంకోచం ఉన్నదేమో కానీ వారికి ఇసుమంత వెరపు కూడా లేదు.

పైన పేర్కొన్న హల్ద్వానీలో పరిస్థితి అదే! ఈశాన్య రైల్వే జోన్‌లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో హల్ద్వాని ప్రాంతంలో రైల్వే ట్రాక్ పొడవునా ఇరవై కిలోమీటర్ల మేర సుమారు 100 ఏళ్లకు పైగా పేద ప్రజలు నివసిస్తున్నారు. 22 ఏళ్ల క్రితం ఏర్పడిన రాష్ట్రంలో హల్ద్వాని ఒక డివిజన్‌గా ఉంది. ప్రస్తుతం అక్కడి మునిసిపాలిటీ భాజపా చేతుల్లోనూ, అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకత్వంలోనూ ఉంది.

హల్ద్వాని ప్రాంతంలో సుమారు 22 మురికివాడలు ఉన్నాయి. 2016లో వాటిని రెగ్యులరైజ్ చేసే ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది.

ప్రస్తుత వివాద ప్రదేశాన్ని బంభుల్‌పుర అంటారు. దాన్ని ఖాళీ చేయించమని హైకోర్టు తీర్పు ఇస్తే సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది.

ఉత్తరాఖండ్ భాజపా ప్రభుత్వం రైల్వే అధికారుల భుజం మీద తుపాకీ పెట్టి బంభుల్ పురవాసులపైన కాల్పులు జరుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తినా భాజపేయులు లక్ష్య పెట్టడం లేదు.

హైకోర్టు ఆదేశించిన ప్రకారం 4500 ఇళ్లలో నివసించే వారిని ఖాళీ చేయించటానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం పూనుకున్న బంభుల్ పుర ప్రాంతంలో... 4 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రైవేటు పాఠశాలలు, ఒక కమర్షియల్ బ్యాంకు, రెండు వాటర్ ట్యాంకులు, పది మసీదులు, నాలుగు దేవాలయాలు ఇంకా అనేక దుకాణాలు ఉన్నాయి. కూల్చివేత ప్రయత్నాలు సాగుతున్న దశలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఇది మానవీయ సమస్య అని, దానికి ఆచరణాత్మక పరిష్కారం తప్పనిసరి అని కూల్చివేతను నిలిపివేసింది.

అయితే ఉత్తరాఖండ్‌లోని భాజపా అనుయాయులు గత కొంతకాలంగా ఈ ప్రాంత ముస్లింలది ల్యాండ్ జిహాద్ అనే ప్రచారం చేయడమే కాక ఉత్తరాఖండ్ అంటే 'దేవభూమి' అనే పేరు ఉన్నది కనుక అందులో హిందూయేతరులు నివసించడానికి వీల్లేదు అనేదాకా ఉన్మాద ప్రచారాలు చేస్తున్నారు.

సాధారణంగా అన్ని మురికివాడలలో నివసించే వారిలాగా ఇక్కడి వారు కూడా చాలా నిరుపేదలు, కష్టజీవులు. రోజువారి కూలి పనులు చేసుకుంటే తప్ప బతుకులేనివారు. ఒకేచోట హిందూ–ముస్లిం ప్రజానీకం మతపరమైన ఎలాంటి ఘర్షణలు లేకుండా సహజీవనం కొనసాగిస్తున్నారు.

ఒకసారి సామూహిక విస్థాపన జరిగింది అంటే ఎన్నో ఆర్థిక సాంఘిక సమస్యలతో పాటు, మాటలలో వర్ణించలేని ఒక పెద్ద సాంస్కృతిక జీవన విధ్వంసం కూడా దాని వెనక ఉంటుంది. కుటుంబాలు, వ్యక్తులు కకావికలయి, విడివిడిగా జీవిస్తూ కొన్ని తరాలపాటు విధ్వంసానికి గురికాక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

కొద్దిమంది ధనస్వామ్య గుంపుల ఆర్థిక రాజకీయ ప్రయోజనాలే సర్వస్వంగా నడుస్తున్న దోపిడీ రాజకీయ వ్యవస్థకు బుల్డోజర్ పద్ధతులే అనుసరణీయమా అన్నట్లు పాలకవర్గాలు వ్యవహరిస్తున్నాయి. అనుసరిస్తున్నాయి.

ప్రస్తుత వ్యవస్థలో ఈ తరహా జీవన విధ్వంసానికి ప్రత్యామ్నాయంగా ప్రజా ఉద్యమమే తప్పనిసరి అవుతుంది. అలాంటి ఒక ఉద్యమం ద్వారా మెరుగైన జీవన స్థితిని సాధించుకున్న ఇటీవల కాలపు ఉదాహరణగా కొండమొదలు ప్రాంత ఆదివాసీలను మనం చెప్పుకోవచ్చు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక ఆదివాసి గ్రామాలను ఖాళీ చేయించారు. గిరిజన ఉద్యమ అనుభవాలతో పోరాట సంస్కృతిని నిరంతరం కాపాడుకుంటూ వస్తున్న కొండమొదలు ప్రాంత గిరిజన సంఘం అడవికి అడవి, భూమికి భూమి, ఇళ్లకు ఇళ్లుతో పాటు ఉమ్మడి గ్రామాలను కూడా సంఘటితంగా పోరాడి సాధించుకున్నారు.

విస్థాపనకు గురయ్యే బడుగు జీవులకు ఉద్యమం ద్వారా ప్రత్యామ్నాయాలను సాధించుకోవడం తప్ప మరొక మార్గం లేదు.

**26-1-2023**

కవిత

# మనిషిగ బతకనీయాలి!

– సహచరి

**అవును!** కుక్కలే నయంకదా
దొంగనుకుంటే మొరిగి మొరిగి
మనుషుల్ని మేల్కొలుపుతుంది
కాకులే మేలు కదా!
తోటి కాకి నేలకూలితే అరిచి అరిచి కాపాడుకుంటయ్
ఆశ్రిన్ అన్నట్లు ఎంత గలీజులోకం
కాకుంటే కాళ్ళావేళ్ళాపడి
కట్టుకున్న నాగరాజును కాపాడమంటే
కాలు నిలవని 'జాతీయ' జనారణ్యంలో
సంచరిస్తున్నా మర మనుషులకన్నా
మతపుఖడాలో కులపు రాడ్లకు పరువు
పరదాల్లోకి పరుగెడుతున్న వీళ్ళకన్నా
కుక్కలే నయం కదా!
ఎంత గలీజులోకం..
మనిషిని మనిషిగ బతకనీయదు
తను నచ్చినోణ్ణి మనసిచ్చినోణ్ణి
మతపు బురుజుల్ని కులం గోడల్ని
కూల్చి ఒక్కటై బతుకుతామంటే
బతకనివ్వని లోకం ఎంత గలీజులోకం!
చిచ్లం చెంచు బిడ్డను
పెళ్ళాడిన నిజాం రాజు వారసత్వపు
ప్రేమ నగరపు నడిబొడ్డున - చార్‌సౌసాల్‌కా
షవాద్ గంగాజమునా తెహజీబ్‌లో
నీరజ్‌పవార్ నెత్తురింకిపోయింది!
రామకృష్ణలు, ప్రణయ్‌ల పరంపరలో
వాళ్ళు తలలు తెగిపడిన నెత్తుర్లో

ప్రేమ పతాకాలను తడిపి
ప్రేమే మానవసమాజాన్ని
మానవీకరిస్తుందని నేలకొరిగిన
ప్రేమమూర్తులు వాళ్ళే కులనిర్మూలనా
సారథులు సమసమాజ స్వాప్నికులు

జననం తర్వాత మనిషి తొడుక్కున్న
వస్త్రంలాంటి మతాన్ని.. తన విశ్వాసాల మీద
మనువు పేర్చిన నిచ్చెనమెట్ల మేడల్ని
కూల్చకుండా ప్రేమలే కాదు మనుషులూ
మానవత్వం మనుగడ సాగలేదు
కుల మత కరుకు కర్కశపు పరువు
హత్యలతో హంతకులయ్యే అంధత్వానికి
మతమొక మత్తులా కులమొక 'ఖడ్గం'లా
మనిషిని మనిషిగా బతకనివ్వకుండా చంపుతున్నది.

స్వేచ్ఛా సమానత్వపు రాజ్యాంగపు
హక్కుల్ని ప్రేమించే మనుషుల్ని
మనసు కలిసినోళ్ళను కలిపి బతికేటోళ్ళను
నడిరోడ్డున నరికి చంపుతున్న
మనుషుల్నే కాదు. మానవ హక్కుల్ని
మానవీయ విలువల్ని
ఎంత గలీజు లోకం కాకుంటే మనుషుల్ని చంపి
కిరాతకాన్ని పరువనే మూర్ఖత్వపు
ఖడ్గాలకు మనిషిని బలికాకుండా
బతకడానికి చేయందిద్దాం!

(నగరంలో నాగరాజు, నీరజ్‌పవార్ హత్యల నేపథ్యంలో)

కథ

# ఆఫీసరుకు విందు

హిందీ మూలం : భీష్మ సాహ్నీ (1915-2003)

అనువాదం : డా॥ వెన్నా వల్లభరావు

**ఆరోజు** మిస్టర్ శ్యామనాథ్ ఇంటిలో ఆఫీసరుగారికి విందు.

శ్యామనాథ్‌కి, అతని భార్యకి చెమట తుడుచుకునే తీరిక కూడా లేదు. భార్య డ్రెస్సింగ్ గౌను వేసుకుని, చిక్కుపడిన జుట్టు ముడివేసుకుని, ముఖానికున్న క్రీము - పౌడరు చెమట చేతుల్తో చెరుపుకుని, శ్యామనాథేమో సిగరెట్టుపై సిగరెట్టు కాలుస్తూ అవసరమైన వస్తువుల జాబితా చేతిలో పట్టుకుని ఆదుర్దాగా ఒక గదిలోనుంచి మరొక గదిలోకి వస్తూ-పోతూ ఉన్నారు.

చివరికి ఐదు గంటలు అవుతూ అవుతూ ఉండగా ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. కుర్చీలు, బల్లలు, టీపాయిలు, నేప్కిన్లు, ఫ్లవర్స్- అన్నీ వరండాలోకి చేరాయి. డ్రింక్‌కి ఏర్పాటు సిటింగ్ రూమ్‌లో చేశారు. ఇంట్లోని పనికిరాని పాత సామాన్లని అల్మారాల వెనుక, మంచాల క్రింద దాచిపెడుతున్నారు. అప్పుడే ఉన్నట్టుండి శ్యామనాథ్‌కి పెద్ద సమస్య ఒకటి జ్ఞాపకమొచ్చింది, 'అమ్మ ఎలా?'

ఈ విషయం గురించి ఇప్పటివరకు తనకుగాని, తెలివిగలదైన తన భార్యకు గాని ధ్యాసే లేదు. మిస్టర్ శ్యామనాథ్ శ్రీమతి వైపు తిరిగి ఆంగ్లంలో 'అమ్మ ఎలా?' అని అడిగాడు.

పనిలో నిమగ్నమైపోయిన శ్రీమతి ఉన్నట్టుండి ఆగిపోయింది. కొంచెం ఆలోచించి "ఆవిడను వెనక ఇంట్లో ఉండే ఆమె స్నేహితురాలు ఇంటికి పంపుదాం, రాత్రి నిశ్చింతగా అక్కడే ఉండి రేపు ఉదయం రమ్మని చెప్పండి" అంది.

శ్యామనాథ్ సిగరెట్ నోట్లో పెట్టుకుని, చిట్లించిన కళ్ళతో శ్రీమతివైపు చూస్తూ క్షణమాలోచించి తల అడ్డంగా తిప్పి "వద్దొద్దు, ఈ మిషతో ఆ ముసలావిడ మళ్ళీ ఇక్కడికి రాకపోకలు మొదలెట్టటం నాకు సుతరాము ఇష్టం లేదు. గతంలోనే అతి కష్టం మీద మాన్పించాము.... ఒకపని చేద్దాం. అమ్మని ఈరోజు త్వరగా భోంచేసి సాయంత్రానికల్లా తన గదిలోకి వెళ్ళిపొమ్మని చెబుదాము. అతిథులు ఎప్పుడో ఎనిమిది గంటలకు కదా వచ్చేది. ఆలోపే తన పనులన్నీ ముగించుకుంటుంది" అన్నాడు.

ఆలోచన బాగుంది. ఇద్దరికీ నచ్చింది. కానీ వెంటనే శ్రీమతి "ఒకవేళ ఆవిడ త్వరగా నిద్రపోయి, నిద్రలో గురక పెడితేనో? పక్కన వరండాలోనే కదా వాళ్ళు భోజనాలు చేసేది!" అంది.

"అయితే అమ్మని తన గదిలోనే ఉండి లోపల గడియ పెట్టుకొమ్మని చెబుదాం. గదికి బయట తాళం వేస్తాను. లేకపోతే అమ్మని గది లోపలికి వెళ్ళి నిద్రపోవద్దని, మేల్కొనే ఉండమని చెపుతాను. ఎలా ఉంది?"

"ఒకవేళ ఆవిడ నిద్రపోతేనో? డిన్నర్ పూర్తయ్యేటప్పటికి ఏ వేళ అవుతుందో ఏమో! పడకొండు అయ్యేవరకు మీరు తాగుతూనే ఉంటారుగా!"

శ్యామనాథ్ శ్రీమతి మాటకి విసుక్కున్నాడు. "అమ్మ తమ్ముడి దగ్గరకు వెళతానంటే నువ్వే చాలా మంచిదానివనిపించుకోవాలని ఇక్కడే ఉండమన్నావు" అన్నాడు.

"బాగానే ఉంది. ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు మీ అమ్మ-కొడుకుల మధ్య నేను చెడ్డదాన్ని అవ్వాలా? ఎందుకెళ్ళలేదో మీకు తెలియాలి - ఆవిడకు తెలియాలి."

మిస్టర్ శ్యామనాథ్ ఏమీ మాట్లాడలేదు. వాదోపవాదాలకిది సమయం కాదు, సమస్యకి పరిష్కారం ఆలోచించటం ముఖ్యం. అతను పక్కకి తిరిగి అమ్మ గదివైపు చూశాడు. గది గుమ్మం వరండాలోనుంచి ఉంది. వరండా వైపు చూస్తూ వెంటనే 'నాకొక ఆలోచన తట్టింది' అనటం, తల్లి గది బయటకి వెళ్ళి నిలబడటం క్షణంలో జరిగిపోయాయి. ముసలి తల్లి గోడను అనుకొని పీటపై కూర్చొని ఉంది, తల - ముఖం కొంగుతో కప్పుకుని జపమాల తిప్పుకుంటోంది. ఉదయం నుంచి ఇంట్లో జరుగుతున్న ఏర్పాట్లుచూసి ఆమెకు గుండె గాబరాగా ఉంది. కొడుకు పనిచేసే ఆఫీసులోని పెద్ద ఆఫీసరు భోజనానికి వస్తున్నారట, అన్ని పనులు సవ్యంగా జరగాలి అని కోరుకుంటోంది.

"అమ్మా! ఈరోజు నువ్వు భోజనం త్వరగా చేసెయ్యి. అతిథులు ఏడున్నరకల్లా వస్తారు."

తల్లి నెమ్మదిగా ముఖంపైనుంచి కొంగు తొలగించి కొడుకుని చూస్తూ "ఇవ్వాళ నాకు ఏమీ తినాలని లేదు. మాంసము - చేపలు వండితే నేను ఏమీ తిననని నీకు తెలుసుగా నాయనా!" అంది.

"నీ ఇష్టం. నువ్వు మాత్రం నీ పనులు త్వరగా పూర్తిచేసుకో"

"అలాగే నాయనా!"

"చూడమ్మా! ముందు మేము వరండాలో కూర్చుంటాము. అప్పటివరకు నువ్వు ఇక్కడ వరండాలో కూర్చో. మేము లేచి ఇక్కడికి వచ్చేటప్పుడు బాత్రూం గుండా హాల్లోకి వెళ్ళిపో"

అవాక్కురాలై తల్లి కొడుకు ముఖం చూడసాగింది. నెమ్మదిగా 'అలాగే నాయనా' అంది.

"అమ్మా! నువ్వు ఇవ్వాళ మాత్రం త్వరగా నిద్రపోవద్దు. నువ్వు గురకపెట్టే చప్పుడు చాలా దూరం వరకు వినపడుతుంది"

తల్లి ఏదో అపరాధం చేసినదానిలా "ఏమి చెయ్యను నాయనా? జబ్బుపడి కోలుకున్న దగ్గరనుంచి ముక్కుతో ఉపిరి తీసుకోలేక పోతున్నాను" అంది.

మిస్టర్ శ్యామనాథ్ తనకు తోచిన ఏర్పాటేదో చేశాడు కానీ అతని మనసులో ఇంకా ఏదో అనుమానం తొంగిచూస్తూనే ఉంది. ఒకవేళ ఆఫీసరుగారు అకస్మాత్తుగా ఇటువైపు వస్తేనో! తొమ్మిది – పదిమంది అతిథుల్లో స్వదేశపు అధికారులు, వాళ్ళ భార్యలు కూడా ఉంటారు. వాళ్ళలో ఎవరో ఒకరు బాత్రూం వైపు వెళ్ళే అవకాశం ఉంది. ఆ ఆలోచన రావటంతోనే అతనికి ఒక్కసారే భయం, బాధ, కోపం కలిగాయి. ఒక కుర్చీ తీసుకెళ్ళి వరండాలో తల్లి గది బయట ఉంచుతూ "ఇటురా అమ్మా! ఒక్కసారి దీనిపై కూర్చో" అన్నాడు.

తల్లి జపమాల చేతపట్టుకుని, తలపైన కప్పుకున్న కొంగు సరిచేసుకుంటూ నెమ్మదిగా వచ్చి కుర్చీలో కూర్చుంది.

"అలా కాదమ్మా! కాళ్ళు పైన పెట్టి కూర్చోకూడదు. ఇది మంచం కాదుగదా!"

వెంటనే తల్లి కాళ్లు కిందకి దించింది.

"అమ్మా! దయచేసి నువ్వు చెప్పులు లేకుండా ఒట్టి కాళ్ళతో తిరగొద్దు. అలా అని పావుకోళ్లు వేసుకుని అస్సలు కనపడవద్దు, తెలిసిందా? ఏదోరోజు ఆ పావుకోళ్ళను బయటకు విసిరేస్తాను"

తల్లి ఏమీ మాట్లాడలేదు.

"అది సరే, బట్టలు ఏమి కట్టుకుంటావు?"

"ఉన్నవేవో కట్టుకుంటాలే నాయనా! నువ్వు చెప్పినవే కట్టుకుంటాలే"

మిస్టర్ శ్యామనాథ్ సిగరెట్ నోట్లో పెట్టుకొని సగం తెరిచిన కళ్లతో తల్లి వైపు పరిశీలనగా చూశాడు. తల్లికి ఏ దుస్తులు బాగుంటాయో ఆలోచించసాగాడు. శ్యామనాథ్ ప్రతి విషయం పద్ధతిగా ఉండాలని కోరుకుంటాడు. ఇంటి అమరిక అంతా స్వయంగా తానే చూసుకుంటాడు. మేకులు ఎక్కడ కొట్టాలి, మంచాలు ఎక్కడ వెయ్యాలి, గుమ్మాలకి ఏ రంగు కర్టెన్లు వెయ్యాలి, శ్రీమతి ఏ కలర్ చీర కట్టుకోవాలి, టేబుల్ ఏ సైజుది ఉండాలి.... సమస్తం అయన ఇష్టమే.

శ్యామనాథ్ దిగులు ఏమిటంటే తన తల్లి ఆఫీసరుకి ఎదుట పడితే తాను సిగ్గుపడాల్సి వస్తుందే అని. తల్లిని తలనుంచి కాళ్ల వరకు చూస్తూ–"అమ్మా నువ్వు తెల్ల కమీజు, సల్వారు వేసుకో. ఒక్కసారి వేసుకొచ్చి చూపించు. ఎలా ఉంటుందో చూస్తాను"

అమ్మ నెమ్మదిగా లేచింది. కొడుకు చెప్పిన బట్టలు వేసుకోవటానికి తన గదిలోకి వెళ్లింది.

ఏదిఏమైనా అమ్మతో జంజాటమే. శ్రీమతితో ఇంగ్లీషులో "అన్నీ సవ్యంగా ఉంటేనే ఎవరో ఒకరు ఏదో పేరు పెడతారు. ఇంకా ఏదైనా అనుకోనిది జరిగి ఆఫీసరుకి చెడ్డగా అనిపిస్తే డిన్నర్‌లో మజా అంతా హుష్ కాకి" అన్నాడు.

ఇంతలో తల్లి తెల్ల కమీజు సల్వారు వేసుకొని బయటకొచ్చింది. వృద్ధాప్యంతో కుంగిపోయిన ఆమె శరీరం, తెల్లని దుస్తుల్లో చుట్టబడ్డ వడిలిన దేహం, మసకబారిన కళ్ళు. తలపైన సగం రాలిపోగా మిగిలిన జుట్టు ఆమె కప్పుకున్న ముసుగు మాటున దాగగలిగాయి. ఇప్పుడు అమ్మ ఇందాకటికంటే కొంత మెరుగ్గా కనిపిస్తోంది.

"సరే, బాగానే ఉందిలే. గాజులు అవీ ఉంటే వేసుకో. ఎవ్వరూ ఏమీ అనుకోరు"

"గాజులు ఎక్కడి నుండి తీసుకురాను నాయనా? నీకు తెలుసుగా, నగలన్నీ నీ చదువుకోసం అమ్మేశాముకదా!"

ఆ మాట శ్యామనాథ్‌కి బాణంలా గుచ్చుకుంది. కోపంగా – "మళ్ళీ అదే రాగం మొదలెట్టావుగా! సూటిగా చెప్పొచ్చుగా నగలు లేవని. నా చదువు ప్రస్తావన ఎందుకు? నగలు అమ్మితే మాత్రం నేను ప్రయోజకుణ్ణి అయ్యే వచ్చానుగా! పనికిమాలినవాణ్ణేమీ అవ్వలేదే! ఎంత ఇచ్చావో అంతకు రెండు రెట్లు తీసుకో కావాలంటే" అన్నాడు.

"నా నోట్లో నిప్పులు పడా! నీ దగ్గర బదులు తీసుకుంటానా నాయనా? పొరపాటున నోరు జారాను. నగానట్రా ఉంటే వేసుకోనూ?"

సాయంత్రం ఐదున్నర అయింది. ఇంకా శ్యామనాథ్ స్నానం చేసి సిద్ధమవ్వాలి. శ్రీమతి అప్పటికే తన గదికి వెళ్లిపోయింది. శ్యామనాథ్ లోనికి వెళ్తూ మళ్ళీ ఒకసారి తల్లిని హెచ్చరించాడు – "అమ్మా! నువ్వు రోజూలా ఏదో పోగొట్టుకున్న దానిలాగా కూర్చుని ఉండొద్దు. ఆఫీసర్‌గారు ఇటువైపు వచ్చి నిన్నేమైనా అడిగితే తిన్నగా సమాధానం చెప్పు"

"నేనా చదువుకున్నదాన్ని కాదుగా నాయనా! నేనేం మాట్లాడతాను? అందుకే నువ్వే చెప్పెయ్యి వాళ్ళకి మా అమ్మ చదువుకున్నది కాదు, ఆవిడకు ఏమీ తెలియదు అని. అప్పుడిక వాళ్ళేమీ అడగరు."

ఏడుగంటలు అవుతుందనగా ముసలి తల్లి గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఒకవేళ పెద్దాఫీసరు తనని ఏమైనా అడిగితే ఏం సమాధానం చెప్పగలను? ఆంగ్లభాషనైతే, దూరం నుంచి వింటేనే తాను కంగారు పడిపోతుంది. అయన చూస్తే అమెరికావాడట! ఏం అడుగుతాడో ఏమో? నేనేం మాట్లాడాలి? తనకైతే ఇంటి వెనుక ఉన్న విధవరాలైన స్నేహితురాలు దగ్గరికి వెళ్లాలనుంది. కానీ కొడుకు ఆదేశాన్ని ఎలా కాదనగలదు? అందుకే మారు మాట్లాడకుండా కాళ్లు వేలాడేసుకుని కుర్చీలోనే కూర్చుని ఉండిపోయింది.

అది ఒక పర్పస్ఫుల్ పార్టీ. అందులో డ్రింక్ సక్సెస్ఫుల్ గా ప్రవహిస్తోంది. శ్యామనాథ్ ఇచ్చే పార్టీ సఫలత్వపు శిఖరాన్ని చేరుకోబోతోంది. గ్లాసులు నిండుతున్న స్థాయిలోనే సంభాషణలు సాగుతున్నాయి. హద్దు అదుపు ఏమీ లేదు. ఆఫీసరుకి విస్కీ నచ్చింది. ఆయన భార్యకి కర్టెన్లు నచ్చాయి, సోఫా కవర్స్ డిజైన్స్ నచ్చాయి. గది అలంకరణ బాగా నచ్చింది. అంతకంటే కావాల్సిందేముంది? ఆఫీసర్ అయితే డ్రింకింగ్ మొదలెట్టిన రెండో రౌండ్లోనే జోకులు, కథలు చెప్పటం మొదలెట్టేశారు. ఆఫీసులో ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటారో ఇక్కడ అంత ఫ్రెండ్లీగా ఉన్నారు. ఆయన భార్య అయితే బ్లాక్ కలర్ గౌన్ వేసుకొని, మెడలో ముత్యాల హారంతో, సెంటు–పౌడరు పరిమళాల్ని వ్యాపింపజేస్తూ స్వదేశీ స్త్రీలకి ఆకర్షణా కేంద్రంగా మసులుతోంది. మాటిమాటికి నవ్వుతోంది, మాటిమాటికి తల ఆడిస్తోంది. శ్యామనాథ్ శ్రీమతితో అయితే పాత

స్నేహితురాలితో మాట్లాడుతున్నట్టే ఎంతో కలివిడిగా మాట్లాడసాగింది.

గ్లాసులు నిండటం, ఖాళీ అవ్వడం పూర్తయ్యేసరికి పదిన్నరయింది. అసలు టైం గడిచినట్టే అనిపించలేదు.

చివరికి అందరూ తమతమ గ్లాసుల్లోని చివరి గుటక తాగేసి భోజనాలు చెయ్యటానికి సిటింగ్ రూమ్ బయటకి వచ్చారు. ముందు శ్యామనాథ్ వారికి దారి చూపిస్తూ, వెనుక ఆఫీసర్ ఇతర అతిథులు ఆయన్ని అనుసరించారు.

వరండాలోకి చేరారో లేదో శ్యామనాథ్ నిర్ఘాంతపోయి అకస్మాత్తుగా ఆగిపోయాడు. ఎదుటపడిన దృశ్యం చూసి అతని కాళ్ళు వణికాయి. తాగిన మత్తంతా ఒక్క క్షణంలో దిగిపోయింది. వరండాలో తన గది బయట తల్లి కుర్చీలో కూర్చునే ఉంది, కానీ రెండు కాళ్ళు పైన పెట్టుకుంది. తల ఒకవైపునుంచి మరోవైపుకి ఊగుతోంది. కునికిపాట్లు పడుతుండగా ఏకధాటిగా గురక పెట్టే ధ్వని వస్తోంది. తల కొంచెం సేపు ఒంకరగా ఒకే వైపు ఉండిపోతే గురక మరింత తీవ్రతరమౌతోంది. ఉలికిపడి నిద్రాభంగమైతే తల మరల రెండో వైపుకి ఊగుతోంది. తలపై కప్పుకున్న కొంగుముసుగు జారిపోయింది. తలపై ఊడినవి ఊడిపోగా మిగిలిన కొద్దిపాటి వెంట్రుకలు సగం బట్టదైపోయినతలపై అస్తవ్యస్తంగా ఎగుతున్నాయి.

ఆ స్థితిలో తల్లిని చూడగానే శ్యామనాథ్ కోపోద్రిక్తుదయ్యాడు. తల్లిని గట్టిగా కుదిపి నిద్రలేపి ఆమె గదిలోకి నెట్టెయ్యాలనిపించింది. కానీ అది సాధ్యం కాదు. ఆఫీసర్, ఇంకా ఇతర అతిథులు దగ్గరే నిల్చొని ఉన్నారు.

తల్లిని చూసి స్వదేశీ ఆఫీసర్ల భార్యలు పక్కున నవ్వారు. ఇంతలో ఆఫీసర్‌గారు నెమ్మదిగా 'పూర్ డియర్' అన్నారు.

అలికిడికి తల్లి ఉలిక్కిపడి నిద్రలేచింది. అంతమంది ఎదురుగా నిలబడటం చూసి కంగారుపడి అవాక్కైపోయింది. తలపై ముసుగు సరిచేసుకుంటూ నిలబడి తలవంచుకుని నేలనే చూడసాగింది.

"అమ్మా, నువ్వెళ్ళి పడుకో. ఇప్పటిదాకా మేల్కొని ఉండటం ఎందుకు?" అని, ఆఫీసర్ ముఖంలోని భావాలను చదవసాగాడు శ్యామనాథ్.

ఆఫీసర్ ముఖంలో చిరునవ్వు కనిపించింది. ఆయన అక్కడే నిల్చుని తల్లికి వినయంగా నమస్కరించారు.

తల్లి సంకోచిస్తూ బిడియంగానే చేతులు జోడించబోయింది, కానీ ఒక చెయ్యి కొంగు లోపల జపమాల పట్టుకుని ఉంది, రెండవది బయట. అందువల్ల సరిగ్గా నమస్కారం కూడా చేయలేకపోయింది. అది చూసి శ్యామనాథ్ మనసులో తల్లిపై కోపగించుకున్నాడు.

ఇంతలో ఆఫీసర్ ఆమెకు షేక్ హేండ్ ఇవ్వడం కోసంకుడి చేయి చాచారు. అది చూసి ఆమె మరింత కంగారు పడిపోయింది.

"అమ్మా! చెయ్యి చాచు"

కానీ తల్లి చెయ్యి ఎలా చాచగలదు? ఆమె కుడి చేతిలో జపమాల ఉందయ్యే. కంగారులో ఎడమచేతినే ఆఫీసర్‌గారి కుడిచేతికి అందించింది. శ్యామనాథ్ మనసులోనే తల్లిపైన కోపగించుకున్నాడు. "అలా కాదమ్మా, కుడి చెయ్యి ఇవ్వాలి" అన్నాడు.

కానీ అప్పటికే ఆఫీసర్ గారు తల్లి ఎడమ చేతినే పట్టుకుని ఉపుతూ "హౌ దు యు దు?" అని అడిగారు.

"చెప్పమ్మా! బాగున్నానని చెప్పు"

అమ్మ ఏదో గొణిగింది.

"అమ్మబాగానే ఉన్నానని చెబుతున్నది"

"అమ్మా! హౌ దు యు దు అని అడుగు"

తల్లి సంకోచిస్తూ నెమ్మదిగా – "హౌ దు దు ..." అంది.

మళ్ళీ ఒకసారి పకపకలు.

వాతావరణం కొంత తేలికపడింది. ఆఫీసర్‌గారు పరిస్థితిని చల్లబరిచారు. అతిథులు నవ్వుతూ మాట్లాడసాగారు. శ్యామనాథ్ మనసులోని దిగులు కూడా కొద్దికొద్దిగా నెమ్మదించింది.

ఇంకా ఆఫీసర్‌గారు తల్లి చెయ్యి తన చేత్తో పట్టుకునే ఉన్నారు. తల్లి సిగ్గుతో ముడుచుకుపోతోంది. అయన నోటినుంచి త్రాగుడు వాసన కూడా వస్తోంది.

శ్యామనాథ్ ఇంగ్లీష్‌లో "మా అమ్మ పల్లెటూరావిడ. జీవితమంతా గ్రామంలోనే గడిపింది. అందుకే మిమ్మల్ని చూసి సిగ్గు పడుతోంది" అన్నాడు.

ఆ విషయం విని ఆఫీసర్ చాలా సంతోష పడ్డట్టు కనిపించారు. "నిజంగానా! నాకు గ్రామస్తులంటే చాలా ఇష్టం. అయితే మీ తల్లిగారికిగ్రామాల్లో పాడుకునే పాటలు, చేసే నృత్యాలు వచ్చే ఉంటాయిగా!" అని ఆయన ఆనందంగా తలూపుతూ తల్లి వైపు చూడసాగారు.

"అమ్మా! ఆఫీసర్‌గారు నిన్ను ఏదైనా పాట పాడమంటున్నారు. నీకు పాత పాటలు చాలా వచ్చుగా!"

తల్లి నెమ్మదిగా "నేనేమి పాడతాను నాయనా? ఎప్పుడన్నా పాడానా చేశానా?" అంది.

"భలేదానివమ్మా! అతిథులు అడుగుతుంటే ఎవరైనా కాదంటారా చెప్పు?"

"ఆఫీసర్ గారు ఎంతో ఇష్టంగా అడిగారు. నువ్వు పాడకపోతే నొచ్చుకుంటారు"

"నేనేం పాడతాను నాయనా? నాకేం వచ్చని..?"

"ఏదైనా మంచి ఉత్సాహంగా పాడే పెళ్లిపాట పాడమ్మా!"

స్వదేశీ ఆఫీసర్లు, వాళ్ళ భార్యలు ఆ ప్రతిపాదన విని చప్పట్లు కొట్టారు. తల్లయితే దీనంగా ఒకప్పుడుకొడుకువైపు, మరొకసారి కోడలువైపుచూస్తోంది.

ఇంతలో కొడుకు గంభీరంగా అదేశించే స్వరంతో – "అమ్మా!" అన్నాడు.

ఇక ఆ తర్వాత 'అవును–కాదు' అనే ప్రశ్నే ఉండదు. తల్లి మారుమాట్లాడకుండా కూర్చొని నెమ్మదైన సిగ్గు పడుతున్న స్వరంతో పాత పెళ్లి పాట ఒకటి పాడసాగింది.

స్వదేశీ మహిళలు పగలబడి నవ్వటం మొదలెట్టారు. మూడు పంక్తులు మాత్రం పాడి ఆగిపోయింది తల్లి.

వరండా అంతా చప్పట్లతో మారుమోగి పోయింది. ఆఫీసర్ గారయితే చప్పట్లు అపనే ఆపటం లేదు. శ్యామనాథ్ కోపం, విచారం అంతా ఆనందం, గర్వంగా మారిపోయాయి. తన తల్లి పార్టీకి వన్నె తెచ్చింది.

చప్పట్లుఆగిన తర్వాత ఆఫీసర్‌గారు – "పంజాబ్ గ్రామాల్లోని ప్రత్యేకమైన హస్తకళ ఏమిటి?" అని అడిగారు.

శ్యామనాథ్ మనసు ఆనందంతోఉరకలు వేస్తోంది. "చాలా ఉన్నాయి. సర్! నేను ఆ వస్తువుల సెట్ ఒకటి మీకు ప్రెజెంట్ చేస్తాను. వాటిని చూస్తే మీరెంతో సంతోషిస్తారు" అన్నాడు.

కానీ ఆఫీసర్ అలా అడ్డంగా ఊపి ఇంగ్లిష్‌లో –"వద్దు, నేను షాపుల్లో దొరికే వస్తువుల గురించి అడగటం లేదు. పంజాబీలు తమ ఇళ్ళల్లో ఏమి తయారుచేస్తారు? ముఖ్యంగా స్త్రీలు?" అని అడిగారు.

కొంచెం ఆలోచించి శ్యామనాథ్ "ఆడపిల్లలు ఆట బొమ్మలు చేస్తారు. ఇంకా స్త్రీలు వస్త్రాలపై కుట్టుపూలు అల్లుతారు. దాన్ని ఫుల్కారి అంటారు" అన్నాడు.

కుట్టుపూలంటే ఏమిటో ఆఫీసర్‌కు తెలియజెప్పే విఫల ప్రయత్నం చేసి, సాధ్యంకాక చివరికి తన తల్లిని – "అమ్మా! ఏదైనా కుట్టుపూలు అల్లినది పాతదేదైనా ఇంట్లో ఉందా?" అడిగాడు.

తల్లి ఏమీ మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్లి పాత ఫుల్కారి తీసుకువచ్చింది.

ఆఫీసర్ చాలా ఆసక్తిగా ఫుల్కారిని చూడసాగారు. పాతది అయిన కారణంగా దారాలు తెగిపోయాయి, వస్త్రానికి చిల్లులు కూడా పడ్డాయి. ఆఫీసర్‌గారి ఆసక్తిని గమనించి శ్యామనాథ్ – "ఇది చిరిగిపోయింది సర్! మీ కోసం కొత్తది తయారు చేపిస్తాను. మా అమ్మ అల్లుతుంది. ఏమ్మా? ఆఫీసర్‌గారికి ఫుల్కారి చాలా ఇష్టమట. ఆయనకోసం ఒక ఫుల్కారి అల్లిపెడతావుగా?" అడిగాడు.

తల్లి ఏమీ మాట్లాడలేదు. భయపడుతూ – భయపడుతూ నెమ్మదిగా – "ఇప్పుడు నాకు చూపు ఎక్కడుందయ్యా? ముసలి కళ్ళు ఏమి చూడగలుగుతాయి చెప్పు?" అంది.

కానీ తల్లి మాటల్ని లక్ష్యపెట్టకుండా మధ్యలోనే ఖండిస్తూ ఆఫీసర్ గారితో శ్యామనాథ్ – "అమ్మ తప్పకుండా అల్లిపెడుతుంది సర్. దాన్ని చూసి మీరెంతో ముచ్చట పడతారు" అన్నాడు.

ఆఫీసర్‌గారు తలాడించారు. ధన్యవాదాలు చెప్పారు. కొద్ది కొద్దిగా తూలుతూ డైనింగ్ టేబుల్‌వైపు దారితీసారు. మిగతా అతిథులందరూ ఆయన్ని అనుసరించారు.

అతిథులందరూ కూర్చున్న తర్వాత అందరి దృష్టి తల్లిపైనుంచి మరలగానే ఆమె నెమ్మదిగా కుర్చీపై నుంచి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

గదిలోకి వెళ్ళి కూర్చున్నదే తడవుగా ఆమె కళ్ళనుంచి కన్నీరు పొంగిపొర్లాయి. ఎన్నోసార్లు కళ్ళు తుడుచుకుంది, ఎన్నో సంవత్సరాల నుంచి ఆపుకున్న కన్నీరు ఆనకట్ట తెంచుకుని ప్రవహించినట్టుగా పొంగుకొస్తూనే ఉన్నాయి. ఎన్నోసార్లు మనసుకు నచ్చజెప్పుకుంది. చేతులు జోడించింది. దేవుడిని తలుచుకుంది. కొడుకు చిరంజీవి కావాలని ప్రార్థించింది. ఎన్నోమార్లు కళ్ళు మూసుకుంది. కానీ కన్నీళ్ళు వర్షపు నీరులాగా ఆగనే ఆగటం లేదు.

సుమారు అర్ధరాత్రిఅయ్యుంటుందేమో. భోజనాలు ముగించుకుని అతిథులందరూ వెళ్లిపోయారు. తల్లి గోడను అనుకుని కూర్చుని కళ్ళు చిట్లించి ఎదురుగా ఉన్న గోడను చూడసాగింది. ఇంటి వాతావరణంలో ఏర్పడిన ఒత్తిడి కొద్దిగా నెమ్మదించింది. వీధిలో ఎప్పుడో ఏర్పడిన నిశ్శబ్దం శ్యామనాథ్ ఇంట్లో కూడా వ్యాపించింది, కేవలం వంటింట్లో ప్లేట్ల చప్పుడు మాత్రమే వినపడుతోంది. అప్పుడే ఉన్నట్టుండి తన గది తలుపు కొట్టిన శబ్దం వినిపించింది తల్లికి.

"అమ్మా! తలుపు తెరువు"

తల్లికి భయమేసింది. కంగారుపడుతూ లేచింది. తనవల్ల తప్పేమైనా జరిగిందా? ఆమె ఎన్నోసార్లు తనను తాను నిందించుకుంది. ఇంతలోనే తనకు నిద్ర ముంచుకు రావాలా? ఎందుకు కునికిపాట్లు పడ్డాను? కొడుకు ఇప్పటివరకు నన్ను క్షమించలేదా? భయపడుతూనే లేచి వణుకుతున్న చేతుల్తో తలుపు తెరిచింది.

తలుపు తెరుచుకున్నదే తడవుగా శ్యామనాథ్ తూలుతూ వచ్చి తల్లిని కౌగలించుకున్నాడు.

"అమ్మా! అమ్మా! నువ్వు ఈరోజు పార్టీకి వన్నె తెచ్చావు. ఆఫీసరుగారు నిన్ను చూసి ఎంత సంతోషపడ్డారో చెప్పటానికి వీల్లేదు. అంతా నీవల్లే అమ్మా!"

కృశించిన తల్లి దేహం ముడుచుకుపోయి కుమారుని కౌగిట్లో కనిపించకుండా ఉంది. ఎన్నేళ్ళయిందో కొడుకు తనని ఇంత ఆప్యాయంగా కౌగలించుకుని! తల్లి కళ్ళనుంచి మరల కన్నీళ్ళు పొంగుకొచ్చాయి. వాటిని తుడుచుకుంటూ "నాయనా! నన్ను హరిద్వార్ పంపించయ్యా! ఎప్పటినుంచి అడుగుతున్నాను నాయనా?"

శ్యామనాథ్ తూలటం అకస్మాత్తుగా ఆగిపోయింది. అతని భృకుటి ముడుచుకుంది. అతని చేతులు ఒక్కపళాన తల్లిని ఒదిలేశాయి. "ఏమిటమ్మా నువ్వనేది? మళ్ళీ పాత పాటే మొదలెట్టావా?"

శ్యామనాథ్ కోపం పెరిగిపోయింది. "నువ్వు నాకు చెడ్డ పేరు తెచ్చి పెడదామను కుంటున్నావా? కొడుకు తల్లిని సరిగా చూసుకోలేక ఎక్కడకో పంపేశాడని లోకులు అనుకోవాలనా?"

"లేదు నాయనా! నువ్వు నీ భార్యతో సుఖంగా ఉండాలనే నా కోరిక. నేను తినాలనుకున్నవి తిన్నాను, కట్టుకోవాలనుకున్నవి కట్టుకున్నాను. ఇప్పుడిక ఇక్కడుండి ఏం చెయ్యాలి? శేషజీవితం భగవంతుడి ధ్యానంలో గడపాలని ఉందయ్యా. నన్ను హరిద్వార్ పంపించు."

"నువ్వు వెళ్ళిపోతే ఫుల్కారి ఎవరు తయారుచేస్తారు? నీ ముందేగా ఆఫీసర్ గారికి ఫుల్కారి అల్లించి ఇస్తానని మాటిచ్చాను."

"ఫుల్కారి అల్లగల చూపు నాకు ఎక్కడుందయ్యా ఇప్పుడు? నువ్వు ఇంకెక్కడైనా చేయించుకో, లేదా తయారుచేసి సిద్ధంగా ఉన్నదే తీసుకుని ఇచ్చెయ్యి."

"అమ్మా నువ్వు నన్ను మోసం చేసి అలా వెళ్లిపోతావా? అయిపోతుందనుకున్న పనిని కాకుండా చేస్తావా? నీకు తెల్సా, మా ఆఫీసర్‌గారు సంతోషిస్తే నాకు ప్రమోషన్ వస్తుంది."

తల్లి మౌనం దాల్చింది. క్షణం ఆగి కుమారుడు ముఖాన్నే చూస్తూ "నీకు ప్రమోషన్ వస్తుందా నాయనా? ఆఫీసర్‌గారు నీకు ప్రమోషన్ ఇస్తారా? అలా అని చెప్పారా?"

"నోటితోఅయితే చెప్పలేదు, కానీ చూశాం కదా ఆయనెంత సంతోషించారో. 'మీ అమ్మగారు ఫుల్కారి తయారు చేయడం మొదలుపెట్టిన తర్వాత వస్తాన'ని చెప్పారు. ఫుల్కారి ఎలా అల్లుతారో చూడాలని ఆయన చాలా ఉబలాట పడుతున్నారు. అమ్మా! అయన సంతోషిస్తే నాకు ఇంతకంటే మంచి ఉద్యోగం వస్తుంది. నేను ఆఫీసరును కూడా అవ్వగలను."

తల్లి ముఖం ఒక్కసారిగా రంగు మారింది. నెమ్మది నెమ్మదిగా ముడతలు పడిన ఆమె ముఖం వికసించసాగింది. కళ్ళల్లో సనసన్నని వెలుగు ప్రసరించింది.

"అయితే నీకు ప్రమోషన్ వస్తుందా నాయనా?"

"ప్రమోషన్ అసలు పెద్ద విషయమేమీ కాదమ్మా! ఇట్టే అయిపోతుంది. ఆఫీసర్‌గారిని ప్రసన్నుణ్ణి చేసుకుంటేనే ఏదైనా సాధ్యమౌతుంది. లేకపోతే అసలు ఆయన దగ్గర ఎవరైనా పని చెయ్యగలరా ఏమిటి?"

"అయితే నేను చేస్తానులే నాయనా! నా వల్ల అయినట్టు ఫుల్కారి అల్లిపెడతాను."

తల్లి మనసులోనే తన కుమారుడికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉండాలని కోరుకో సాగింది. మిస్టర్ శ్యామనాథ్ "ఇక నిద్రపోలే అమ్మా" అని కొంచెం తూలుతూ తడబడుతున్న కాళ్ళతో తన గది వైపు దారితీశాడు. ●

కవిత

# సూర్య నమస్కారం

- రవి నన్నపనేని

**అక్కడేదో** కట్టాలంట !
పెద్ద పెద్ద చెట్లు అడ్డమని
పచ్చని చెట్లని
పొద్దున్నే పొట్టన బెట్టుకోడం మొదలుబెట్టారు
ఒక్కొక్కటిగా కొట్టేస్తున్నారు
చెట్ల వేళ్లని మొదళ్లతో సహా మట్టిలోనించి పెకలిస్తున్నారు
విశాలమైన కొమ్మల్ని
మిషన్ రంపంతో ముక్కలు ముక్కలుగా నరికేస్తున్నారు
ఎక్కడికో ఏ అడితీకో ట్రక్కులు ట్రక్కులు తరలిస్తున్నారు

అక్కడ, ఏదో గది కట్టాలంట
ఎక్కడా సరిపడే
సరైన మరో తావులేదంట
ఇది సర్కారు వారి ఆజ్ఞంట.....
ఇదుగో ! ఇక్కడ ఇంత ఖాళీ ఉందే
ఇక్కడ, ఇదంతా ఏ చెట్లు అడ్డులేని
ఇంత నేల ఉందే
ఇక్కడ, ఇదే ప్రాంగణంలో
ఏదైన నిర్మించడానికి
అనువైన, అవసరమైన స్థలం ఉందే...
అడిగిన మనిషి వైపు అసహనపు చూపు
'పోరా! పోయి పన్జూసుకో' మనే హూంకరింపు
అంతా కుళ్లిన రాజకీయపు కంపు ....

క్షుద్రునికి స్వార్థమూ సంపదా
రెండు కళ్లై పోయాక
ఇక చెట్టులేదు, పుట్టలేదు, పిట్టలేదు,
కొండ లేదు అన్నీ అమ్మకమే
ఎక్కడ నిలదీస్తే అక్కడ జైలు
ఎక్కడ నోరెత్తి ప్రశ్నిస్తే అక్కడ ఖైదు -
తెల్లారేసరికి
సెంటు వాసనల చలువ బట్టలన్నీ పచ్చ సంతకాల్తో
పచ్చని చెట్లని చంపేశారు
రావి, మర్రి, బూరుగ, నేరేడు
చెట్లన్నీ
రాక్షస యంత్రంతో రాత్రీ పగలూ తొవ్వేశారు
నేలంతా కుళ్లగించి, శూన్య ప్రదేశం చేసి వెళ్లిపోయారు
ఇన్ని నీడల్నీ
ఇన్ని ప్రాణ ధాతువుల్నీ
ఎన్నో యేండ్ల ఈ ఆకు పచ్చని లోకాల్నీ
కడు నిర్దయగా కూల్చి పారేశారు
చెట్ల స్మశానంలో శంకుస్థాపన చేసి
ఖద్దరు దుస్తులన్నీ
కార్ల మీద ఊరంతా ఊరేగి పోయారు

పసి మొక్క విలువ
ఇంకా తెలియని
చిగురులు తుంచే చిన్న పిల్లల నుంచి
పోతూ పోతూ తల కొరికి పోయే పశువులు నుంచి
ఋతు కాల గతులన్నీ దాటి, దాటి
ఒక చిన్న మొక్క ఇలా పెరిగి పెద్దదై
ఇంతటి వృక్షమో మహా వృక్షమో కావడం
అంత సులువు కాదే !
మనిషినైనా మానునైనా లేకుండా చేయడం
ఇంత తేలికై పోయే!

చెట్లని పడదోసి పోయారు కానీ
ఆ చెట్ల బీజాలు
ఇప్పుడు భూమి గర్భంలోనే కాదు
మానవులు అడ్డ దిడ్డంగా కట్టే మందపు గోడల
పక్కనే రాలి పడుంటాయి
అవి రేపో మాపో
రాతి కట్టడంలోనుంచి
రెండాకుల్తో సూర్య నమస్కారం చేస్తాయి. ●

దేశ విభజన వస్తువుగా సాహిత్యం-6



# ఖుర్రుతులైన్ హైదర్ రచనలు - 2

- కొత్తపల్లి రవిబాబు

**(గత సంచిక తరువాయి)**

**4. ఆగ్ కా దర్యా (River of Fire – అగ్ని ప్రవాహం)**

ఇది ఉర్దూలో 1959లో 'ఆగ్ కా దర్యా'గా లాహోర్‌లో వెలువడింది. దీనిని రచయిత్రి ఇంగ్లీషులోకి 1998లో 'రివర్ ఆఫ్ ఫైర్' పేరుతో అనుసృజించారు. ఉర్దూ నవల 650 పుటలుండగా, 40 ఏళ్ళ తర్వాత ఇంగ్లీషులోకి చేసిన అనుసృజన 420 పేజీలు మాత్రమే వుంది. ఉర్దూలో నవలకు 101 అధ్యాయాలుండగా ఇంగ్లీషులో 73 అధ్యాయాలు శీర్షికలతో సహా వున్నాయి. దీనిని వేమూరి రాధాకృష్ణమూర్తి 'అగ్నిధార' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇండియా, పాకిస్తాన్ దేశాలవారి అత్యున్నత సాహితీ అవార్డు పొందిన రచయిత్రి ఖుర్రుతులైన్ హైదర్. ఉపఖండంలో ఇటువంటి గౌరవం అందుకున్న ఏకైక రచయిత్రి ఆమె. 1987లో పాకిస్తాన్ ఆమెకు ఇక్బాల్ అవార్డు ఇచ్చి సత్కరించగా, 1989లో భారతదేశం ఆమెకు జ్ఞానపీఠ అవార్డునిచ్చి గౌరవించింది.

ఇది ఒక చారిత్రక నవల. వేలాది సంవత్సరాల భారతదేశ చరిత్రను స్థూలంగా పరిచయం చేస్తుంది. లక్నో, బెంగాల్ ప్రాంతాల్లో జరిగిన కథ. 20వ శతాబ్దం వరకూ సాగిన కథ దేశ విభజన వరకు వుంటుంది. కొంత కథ ఇంగ్లండ్‌లో జరుగుతుంది. దీనిని నాలుగు భాగాలుగా విభజించి రాశారు. 1. బౌద్ధమత కాలం; 2. కబీరు కాలం; 3. బ్రిటీషు వలసపాలన కాలం; 4. స్వాతంత్రోద్యమ పోరాట కాలం. నవల చివరిభాగంలో విభజన గాయాలను భరిస్తూ జీవిస్తున్న వారి గురించి వుంటుంది కాని, విభజన సమయంలో చెలరేగిన హింస చిత్రీకరణ వుండదు. ఈ భాగంలో కథ ప్రధానంగా ఔథ్‌లో జరుగుతుంది. ఔథ్‌ను ఎన్నుకోవడంలో ఒక అంతరార్థం వుంది. బ్రిటీషువారి పాలనకు ముందు ముస్లిముల పాలనలో ఢిల్లీ, ఔథ్ రెండూ ప్రధానమైన సాంస్కృతిక కేంద్రాలుగా వుండేవి. వీటినే రాజకీయ కేంద్రాలుగా కూడా పరిగణించారు. ఔథ్ రాజ్యంలోని లక్నోలో ముస్లిములు, హిందువులు మతేతర, భాషేతర సంస్కృతిని అభివృద్ధి చేశారు. హనుమంతుడు హిందువుల దేవుడు కనుక ఔథ్ నవాబు నవాబ్ వజీర్ తన రాజ్యంలో కోతులను చంపడం నిషేధించారు. ఢిల్లీలోని ఎర్రకోటలో మొగల్‌రాజులు దసరా, హోలీ, వసంత పంచమి పండుగలను అధికారికంగా చేసేవారు.

అసఫద్దౌలా తల్లి నవాబ్ బిహుబేగం ఫైజాబాద్ నుండి లక్నోకు హోలీ పండుగ జరుపుకోడానికి వచ్చేవారు. ఐదవ నవాబ్ వజీర్ సాదత్ ఆలీఖాన్ తల్లి రాజమాత ఛత్తార్ కున్వార్ లక్నోలోని ఆలీగంజ్‌లో ప్రసిద్ధ హనుమాన్ దేవాలయాన్ని నిర్మించారు. గుడిపైన చంద్రవంకను ఏర్పాటుచేశారు.

ఇరాన్, ఇండియా నాగరికతల సమ్మేళనం జరిగింది. భారతదేశంలో ముస్లిములు, హిందువులు కలిసి మెలిసి వున్న చరిత్రను మరచిపోవడం పెద్ద నష్టమని రచయిత్రి చెప్పారు.

హజరత్ మహల్ రాణిగారికి చెందిన హిందూరాజులు ఆమెకు ఎంత విశ్వాసపాత్రులుగా వుండేవారో తెలియచేసే ఉదంతం ఒకటి వుంది. శంకరాపూర్‌లోని రాజావేణి మధోసింగ్ లార్డ్ క్లైవ్ (Lord Clyve)తో తన కోటను బ్రిటిష్‌వారికి అప్పచెప్తాను కాని తాను మాత్రం రాణిగారికి చెందినవాడిని కనుక మీకు లొంగిపోను అని చెప్పాడు.

2500 ఏళ్ళ క్రితం నుంచి విభజనానంతర కాలం వరకూ సాగిన ఈ నవలలో నాలుగు ప్రధాన పాత్రలున్నాయి. బౌద్ధుడైన గౌతమ్, హిందువైన చంప, ఇస్లాంకు చెందిన కమల్, క్రైస్తవుడైన సిరిల్ ఈ పాత్రలు. ఇంకా నిర్మల, హరిశంకర్ మొదలగువారు వున్నారు. చంద్రగుప్తుడి నుంచి ప్రారంభమై విభజనానంతరం వరకు శతాబ్దాల తరబడి హిందూ ముస్లిములను కలసి వుంచిన సాంస్కృతిక బంధాలను ఈ నవలలో ప్రస్తావించారు. భారత ఉపఖండం విభిన్న సంస్కృతుల సమ్మేళనమని సుదీర్ఘమైన, సంక్లిష్టమైన కథనం ద్వారా రచయిత్రి పాఠకులకు అందించారు. పైన పేర్కొన్న పాత్రలే వివిధ కాలాలలో జన్మిస్తూ వుంటాయి. గౌతమ్, గౌతమ్ నీలాంబర్‌దత్‌గానూ, గౌతమ్ నీలాంబరంగానూ మారుతుంటాడు. చంప పాత్ర చంపక్‌గానూ, చంపావతి, చంపాజైన్, చంపా అహ్మద్‌గానూ మారుతుంటుంది. చారిత్రక వాస్తవాలతో పాటు తన కల్పనను జోడిస్తూ నవలను నడిపారు. చరిత్ర ద్వారా భారతీయ సమ్మిళిత సంస్కృతిని అధ్యయనం చేశారు. రచయిత్రి చరిత్రకారిణి అవతారం ఎత్తారు.

భారతదేశంపై విదేశీయుల దాడులు, సంపద దోపిడీ, వివిధ జాతులు వచ్చి స్థిరపడటం, ఆర్యులు, ఇరానియన్లు, గ్రీకులు, ఆఫ్గన్లు, మంగోలులు, అరబ్బులు, ఇంగ్లీషువారు రావడం – వారి వారి

సంస్కృతులు, భాషలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల ప్రభావం – విభిన్న మతాలు, అవి అనుసరించే ఆలోచనా విధానాలు, అద్భుతాలు, మూఢనమ్మకాలు, సాధువులు, భక్తులు, జోగినులు, ముస్లిం సాధువులు, క్రిస్టియన్ మత ప్రచారకులు – ఇలా అనేకానేక అంశాలు నవలలో సందర్భానుసారం వస్తాయి. మొత్తం మీద ఒక మిశ్రమ సంస్కృతి గురించి అవగాహన కల్పిస్తారు.

వజీద్ ఆలీషా టుమ్రీలు, దాద్రాలు కట్టేవాడు. కథక్ నృత్యాన్ని శాస్త్రీయంగా తీర్చిదిద్దాడు. రాసలీల వస్తువుగా నృత్యగేయ రూపకం రూపొందించాడు. దానిలో కృష్ణుడిగా నటించాడు కూడా. జౌన్పూర్‌కు చెందిన హుసేన్‌షా హుసేనీ "కన్రా" అనే కొత్త రాగాన్ని సృష్టించాడు. రాణి కర్నావతి, దుర్గావతి, రజియా సుల్తానా, చాంద్ సుల్తానా కవచాలు ధరించి యుద్ధాలు చేశారు. రాచరిక రాజ్యాల్లో (Princely States) హిందూ ముస్లిం భేదాలు లేవు. ఎవరి మతాచారాలు వారు పాటిస్తూ కలసిమెలసి వుండేవారు. ఎవరి దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు వారికి వుండేవి. ఒక ఉమ్మడి సాంస్కృతిక వాతావరణం కొనసాగింది. జయపూర్, గ్వాలియర్ హిందూ సంస్థానాలలో మొహర్రం పండుగను ఘనంగా జరిపేవారు. ముస్లిములు దేవుళ్ళకు మొక్కుకొని హిందూ దేవాలయాలను సందర్శించేవారు. ఆర్థిక దోపిడీ, దేశ విభజన సాధారణ హిందూ, ముస్లిములలో ఒక సాంస్కృతిక అగాధాన్ని సృష్టించింది. హిందూ మహాసభ, ముస్లింలీగులు అవతరించాయి.

కమల్ (అబ్దుల్ మన్సూర్ కమలుద్దీన్) పాత్ర ద్వారా రచయిత్రి – శతాబ్దాల తరబడి నిర్మింపబడిన ఒక మిశ్రమ సంకీర్ణ సంస్కృతి ఏవిధంగా విఫలమైందో చిత్రించారు. అతడు జాతీయవాది. ఇల్లు లేనివాడు. ఇండియాలో ఉద్యోగ అవకాశం ముస్లిములకు తక్కువ. అతని తల్లి పాకిస్తాన్‌కు వెళ్ళమని బ్రతిమాలుతుంది. ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో కూడా ఖాళీలు లేవు. కోర్టు కేసులో కుటుంబం ఓడిపోతుంది. దేశ విభజనను వ్యతిరేకించిన ముస్లిములకు ఇండియాలో భవిష్యత్తు లేదని అర్థమైంది. పాకిస్తాన్‌కు వలసపోతారు. ఆయేషా జలీల్ ప్రకారం 35 మిలియన్ల ముస్లిములు పాకిస్తాన్‌కు వెళ్ళకుండా ఇండియాలోనే వున్నారు. ఒక ముస్లిమేతర దేశంలో అత్యధిక ముస్లిములున్న దేశం ఇండియా!

లక్నోలో వున్న గుల్ఫిషాన్ ఈ మిత్ర బృందానికి కేంద్ర స్థానం. అక్కడే తలర్, కమల్, తెహిమినా తమ బాల్యం గడిపారు. వారి కజిన్ అమీర్ రెజా. ఆ కుటుంబాన్ని దత్తత తీసుకున్న హరి హిందూ మతస్థుడు. క్రింది మధ్యతరగతి ముస్లిం కుటుంబానికి చెందిన చంపా ఈ గ్రూపులో కలుస్తుంది. గౌతమ్ కలుస్తాడు. ఈ బృందంలో వారు కొందరు రకరకాల కారణాలతో పాకిస్తాన్ వెళ్తారు. అమీర్ రెజా వారిలో ఒకడు. ఇండియాలో ఆయన అభిరుచులు చంపా చెప్పిన దాని ప్రకారం గుర్రప్పందేలూ, కార్లపందేలూ, అందగత్తెలు. అతని ప్రస్తుత అభిరుచి కొత్తగా అవతరించిన దేశంలో లభించే ప్రమోషన్లు, కొత్త అవకాశాలు అందుకోవడం. పాకిస్తాన్‌లో నౌకాశాఖలో అధికారి అవుతాడు. లండన్‌లో పాక్ దౌత్యాధికారి అవుతాడు.

నవల మొదటి భాగంలో గౌతమ్ శ్రావస్తిలోని ఒక పురోహితుడి కొడుకు. అటవీ విశ్వవిద్యాలయంలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి. తండ్రిలా పౌరోహిత్యం చేయడానికి ఇష్టపడడు. లలితకళలపట్ల వల్లమాలిన అభిరుచి వున్నవాడు. అతని మిత్రుడు హరిశంకర్. ఇద్దరూ కలిసి తత్త్వశాస్త్రంపై లోతైన, గంభీరమైన చర్చ జరుపుతుంటారు. 24 ఏళ్ళకే గౌతమ్ శైవ, కపిల, బౌద్ధ సాహిత్యం చదువుతాడు. కాని ప్రశ్నలు అనంతంగా అతన్ని వేధిస్తూ వుంటాయి.

కమల్ (అబూ మన్సూర్ కమాలుద్దీన్) ఒక భాషావేత్త. చరిత్రకారుడు. తన పరిమితులు అర్థం చేసుకుని ప్రవర్తించే పాత్ర. గౌతమ్, చంపా నవల మొదటి నుండి చివరివరకు కనిపిస్తారు. కమల్, సిప్ నవల ఆఖరి భాగాలలో కనిపిస్తారు.

విభజనానంతర కాలంలో నవలలోని ఈ పాత్రలు లక్నోలో పుట్టి పెరుగుతారు. ఈ కథనంతా చెప్పే తలిత్ అనే అమ్మాయి. దేశం వదలివెళ్ళిన స్నేహితులతో తన బాల్య జ్ఞాపకాలను లండన్‌లోని సెయింట్ జాన్స్‌వుడ్‌లో చలినెగడు ముందుకూర్చొని 1954లో చెబుతుంది.

గతమంతా ఇద్దరూ (హిందూ – ముస్లిం) కలసి వున్నారు. ఇప్పుడు విడిపోయారు. వర్తమానంతో ఎలా రాజీపడతారు? ఈ అంశాన్ని ప్రధానంగా తీసుకొని ఒక సంక్లిష్టమైన నిర్మాణంతో ఈ నవలను హైదర్ రాశారు. ఉర్దూ నవలలోని కొన్ని భాగాలు అబ్దుల్లా హుసేన్ తన నవల 'ఉదాస్ నస్లీన్' (The Weary Generations)లో గ్రంథ చౌర్యం చేశారని ఆరోపించారు. 'అగ్నిధార' తెలుగు అనువాద నవలను 2004 ఆగస్టు 'ప్రజాసాహితి' ఉపఖండ ఉమ్మడి సాహిత్య ప్రత్యేక సంచికలో అద్దేపల్లి రామమోహనరావు పరిచయం చేశారు.

### 5. Fireflies in the Mist పొగమంచులో మిణుగురులు అఖిర్ ఎ షబ్‌కి హమ్ సఫర్ (గత రాత్రి సహచర ప్రయాణీకులు)

బ్రిటీషువారికి వ్యతిరేకంగా తూర్పు బెంగాల్‌లో జరిగిన జాతీయోద్యమం నుండి తూర్పు పాకిస్తాన్ ఏర్పడేంత వరకు, ఆ తర్వాత బంగ్లాదేశ్‌గా ఏర్పడేవరకు గల చరిత్రను చిత్రించే నవల ఇది. ఉర్దూలో ఇది 1979లో విడుదలైంది. దీని ఇంగ్లీషు అనువాదం రచయిత్రే 1994లో చేశారు. 1939లో ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండీ 1971లో బంగ్లాదేశ్ ఏర్పడే వరకు ఈ నవల సాగుతుంది. ఢాకా కేంద్రంగా వుండి, కలకత్తా, శాంతినికేతన్, యూరప్, వెస్ట్ ఇండీస్‌లలో కథ జరుగుతుంది. రచయిత్రి బెంగాలీ కాదు – ఉత్తర భారతానికి చెందినవారు. జీవితమంతా ఢిల్లీ, ముంబాయి, పాకిస్తాన్, ఇంగ్లాండ్‌లలో గడిపారు. ఐనా 4 దశాబ్దాల కాలంలో తూర్పు బెంగాల్‌లో జరిగిన పరిణామాలను కథారూపంలో చిత్రించారు.

నాలుగుతరాల బెంగాలీ కుటుంబాల చరిత్రను మూడు భాగాలుగా రాశారు. మొదటి భాగంలో దీపాలి, రోజీ కుటుంబాల పరిచయం. వీరిద్దరూ కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై, ఆ పార్టీలో కార్యకర్తలుగా పనిచేయడం చిత్రించారు. రెండవ భాగంలో రోజీ అరెస్టు కావడం. మూడవభాగంలో విభజన తర్వాత పాత్ర పరిస్థితి చిత్రణ. కథ ప్రారంభంలో పాత్రలన్నీ ఒకే వూరిలో వున్నా చివరకు జహనారా ఢక్కాలో, రోజీ న్యూఢిల్లీలో, దీపాలి ట్రినిడాడ్‌లో, యాస్మిన్ ఇంగ్లండ్, జర్మనీలలో స్థిరపడతారు. దీపాలి, ఉమా హిందువులు; జహనారా, యాస్మిన్ ముస్లిములు; రోజీ క్రిస్టియన్, హిందూమతస్థుడిని వివాహం చేసుకుంటుంది. ఇతర విభజన నవలల్లోని స్త్రీ పాత్రలన్నీ బాధితులుగా వుంటే, దీనిలోని మహిళా పాత్రలు స్వేచ్ఛ, సాధికారకత కల్గినవారుగా, రాజకీయంగా క్రియాశీలురుగా వుంటారు.

దీపాలి సర్కార్ కళాశాల విద్యార్థినిగా జాతీయోద్యమంలో వామపక్షవాదిగా అజ్ఞాత కమ్యూనిస్టు గ్రూపులో కార్యకర్తగా పనిచేస్తుంది. దీపాలి, రోజీల రాజకీయ అభిప్రాయాలు మొదట్లో ఒకటే కాని తర్వాత వారిలో మార్పు వస్తుంది. రెహాన్ అనే కామ్రేడ్ ద్వారా దీపాలి కమ్యూనిస్టు ఉద్యమానికి పరిచయమౌతుంది. ఆమె మేనమామ దినేశచంద్ర సర్కార్ మాజీ విప్లవకారుడు. 1931లో అరెస్టయి 1933లో ఉరిశిక్ష అనుభవిస్తాడు. ఆయన గురించి వివరాలు సేకరించే పనిలో వున్న రెహాన్‌కు దీపాలి పరిచయమౌతుంది.

ముగ్గురు సోదరులు, మేనత్త, తండ్రితో కలసి నివసిస్తున్న దీపాలి ప్రముఖ గాయని, విద్యార్థిని. తల్లి మరణిస్తుంది. ఆమె కుటుంబసభ్యులకు ఆమె రహస్య రాజకీయ కార్యక్రమాలు తెలియవు. ఉమారాయ్ మరో కార్యకర్త. “తుపాను” ఆమె మారుపేరు. కమ్యూనిస్టు ఉద్యమంలోని యువతులందరికీ ఆదర్శప్రాయని సంపన్న హిందూ కుటుంబానికి చెందిన ఆమె ఇంగ్లండ్‌లో విద్యనభ్యసించి, వామపక్ష భావాలతో సంబంధమేర్పడి కమ్యూనిస్టుగా ఇండియాకు తిరిగి వస్తుంది. కమ్యూనిస్టుల సమావేశాలకు ఆతిథ్యం ఇస్తూ వుంటుంది.

దీపాలి ఒక బ్రిటిష్ అధికారి కుటుంబంలో ఆయాగా కుల్సుమ్ బానో పేరుతో, రోజీ సహాయంతో చేరి గూఢచర్యం చేస్తుంటుంది. ఆ అధికారి సంభాషణలు విని వివరాలు సేకరించి పార్టీకి అందిస్తూ వుంటుంది. అజ్ఞాతంగా వున్న కామ్రేడ్స్‌పై బ్రిటీషువారు చేయబోయే దాడుల గురించి తెలుసుకొని కామ్రేడ్లకు సమాచారం చేరవేస్తూ వుంది.

జహనారా తండ్రి విద్యావంతుడైన సంపన్న భూస్వామి. దీపాలి ఐక్య భారతదేశాన్ని సమర్థిస్తే ఆయన ముస్లిములకు వేరే దేశం కావాలంటారు. ఆడవారి పట్ల భూస్వామ్య సంస్కృతీ భావజాలంతో వుంటారాయన. ఆయన ప్రకారం యువతులు వార్తాపత్రిక, పుస్తకం పట్టుకోవడం సిగ్గుచేటైన పని. వారు చదువుకోకూడదు. చేతిలో కలం పట్టుకోకూడదు.

జహనారా స్నేహితురాలు యాస్మిన్ మజీదీ. ఈమె విప్లవకారిణి కాదు కాని ఆధునిక మహిళ. తన తల్లిదండ్రులతో సంబంధం లేకుండా తన జీవితాన్ని తానే తీర్చిదిద్దుకుంటుంది. పెద్దవారు చేసే తప్పులను సరిదిద్దాలి అనేది ఆమె దృక్పథం. ఒక నాట్యకత్తెగా పేరు తెచ్చుకోవాలనే ధ్యేయం గల పాత్ర. సంప్రదాయాలను ధిక్కరించి వ్యక్తిగత స్వేచ్ఛను సమర్థిస్తుంది. భావప్రకటనా స్వాతంత్ర్యం వుండాలంటుంది.

రోజీ షీలా బెనర్జీని దీపాలి రహస్య ఉద్యమంలోకి ప్రవేశపెడ్తుంది. రోజీ తండ్రి హిందువే ఐనా క్రిస్టియన్ మతంలోకి మారతాడు. రాజకీయాలపట్ల అభిరుచి లేదు. బ్రిటీషు క్రిస్టియన్ పాలకవర్గంలో ఒకడిగా వుంటాడు. రోజీ తల్లి గిరిబాల బ్రాహ్మణ కుటుంబానికి చెందినా, పెళ్ళిచేసుకునే సందర్భంగా క్రిస్టియన్‌గా మారి ఈస్టర్ గిరిబాల అయింది. ఆమెకు 4వ ఏట వివాహం, 6వ ఏట వైధవ్యం ప్రాప్తించింది. వరదలో కుటుంబం అంతా కొట్టుకుపోగా, అత్తగారి తరఫువారు ఈమెను సరిగా పట్టించుకోకపోతే ఒక భూస్వామి జనానాలో పనిమనిషిగా చేరుతుంది. ఆమెను లైంగికంగా కొందరు ఇబ్బంది పెడుతుంటే, హిందూ వితంతువుగా మళ్ళీ పెళ్ళి చేసుకోవడం నిషిద్ధం. ఆమెను ముస్లిముగా మారనీయరు. కనుక క్రిస్టియన్‌గా మారి వివాహం చేసుకుంటుంది.

దేశ విభజన తర్వాత యాస్మిన్ లండన్‌లో స్థిరపడుతుంది. రోజీ ఒక సంపన్న హిందువును పెళ్ళిచేసుకొని – స్వతంత్ర భారతదేశంలో స్థిరపడినా, చనిపోయేవరకూ ఆమె తల్లిదండ్రులతో సంబంధం పెట్టుకోలేదు. వెస్ట్ఇండీస్‌లో స్థిరపడిన దీపాలి భర్తతోపాటు కొన్ని దశాబ్దాలు అక్కడే వుంటుంది. అప్పుడప్పుడు తన పూర్వపు మాతృదేశాన్ని – బంగ్లాదేశ్‌ను సందర్శించి, బాల్య స్నేహితులను కలుసుకుంటూ కాలక్షేపం చేస్తుంది. ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వాల పాలనను తప్పుపడుతూ వుంటుంది.

దేశ విభజనకు ముందూ, విభజనకాలంలోనూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన మహిళల విప్లవాత్మక రాజకీయ కార్యక్రమాలను ప్రధానంగా చిత్రించిన నవల ‘పొగమంచులో మెరిసే మిణుగురులు’.

**6. ది ఎగ్జైల్స్ (The Exiles – బహిష్కృతులు) : ఏడు కథల సంపుటి**

విభజనకు ముందూ, తర్వాత ఇండియా, పాకిస్తాన్ దేశాలలో సంభవించిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మారిన పరిస్థితులను, సంక్షుభిత కాలంలో ఈ రెండు దేశాలలోని స్త్రీల అనుభవాలు చిత్రించిన ఏడు కథల సంపుటి ఇది.

నదీం అస్లాం, అమర్ హుస్సేన్‌లు ముందుమాటలు రాశారు.●

వచ్చే సంచికలో :

**అత్తియా హుసేన్ నవల –**

**‘సన్‌లైట్ ఆన్ ఎ బ్రోకెన్ కాలమ్’**

స్పందన

# విశ్వవిద్యాలయాలను తన హిందుత్వవాద జాతీయవాదాన్ని ప్రచారం చేసుకొనేందుకు సాధనాలుగా వాడుకొంటున్న బిజెపి ప్రభుత్వం

- హరిబాబు

**యూనివర్శిటీల** (విశ్వవిద్యాలయాల) చట్టం ప్రకారం ప్రభుత్వాలు యూనివర్శిటీల పని విషయంలో కల్పించుకోకూడదు. యూనివర్శిటీలు స్వతంత్రమైన సంస్థలు. వాటికి తమ విద్యాకోర్సులను ఏరకంగా రూపొందించాలి, విద్యార్థులను ఏ రకంగా, ఏ పద్ధతిపై చేర్చుకోవాలి, అధ్యాపకులను ఏ రకంగా నియమించుకోవాలి, ఏ రకమైన విద్యాసంబంధమైన విశ్వవిద్యాలయేతర కార్యకలాపాలను నిర్వహించాలి అనే విషయాలపై పూర్తి స్వతంత్రత వుంది. అంతేకాక ఏ రకమైన సభలు సమావేశాలు నిర్వహించాలి, ఏ రకమైన సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి అనే విషయంలో కూడా యూనివర్శిటీలకు పూర్తి స్వతంత్రత వుంది. యూనివర్శిటీలు అన్నవి అంతర్జాతీయ విజ్ఞానాన్ని అందించే జ్ఞానబోధనా సంస్థలలో భాగంగా వున్నాయి.

కానీ 2014లో మోడీ ప్రధానమంత్రిగా ఏర్పడిన బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండీ, ఉన్నత విద్యాసంస్థలను, తన హిందుత్వవాద జాతీయవాదాన్ని ప్రచారం చేసుకోవటానికి సాధనాలుగా వాడే ప్రయత్నం ప్రారంభమయింది. విద్యార్థుల మెదళ్ళలో సంకుచిత, హిందూ మతతత్త్వవాద జాతీయతావాదాన్ని ప్రేరేపించి, ఆ వాదపు అభివృద్ధి నిరోధక భావజాల ప్రభావంలో వారిని కట్టిపడవేసే యత్నాలు మొదలయ్యాయి.

యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ అన్నది ఉన్నత విద్యను ప్రోత్సహించటం, ఉన్నత విద్యాక్షేత్రాన్ని సమన్వయపరచటం, ఉన్నతవిద్యలో నాణ్యత, ప్రమాణాలు కొనసాగేటట్లు చూడటం కోసం ఏర్పాటు చేసిన సంస్థ. కానీ బి.జె.పి. పాలకులు గత 8 సంవత్సరాల నుండీ యు.జి.సి.ని, భారత ప్రభుత్వం చేపట్టే పలు కార్యక్రమాలను, అంటే అధికార పాలక పార్టీవారి సైద్ధాంతిక (ఆర్.ఎస్.ఎస్.) భావజాలపు ప్రచారకర్తగా, కార్యక్రమాల ప్రచారకర్తగా వాడుకొంటున్నారు.

2014 అక్టోబర్ 2నాటి స్వచ్ఛభారత్ దినాన్ని జరుపుకోవాలనే ఉత్తర్వుతో మొదలుపెట్టిన యుజిసి తదుపరి కాలంలో అక్టోబర్ - 11ను జాతీయ ఐక్యతాదినంగా, సర్దార్ వల్లభాయ్‌పటేల్ పుట్టినరోజు వుత్సవాలను జరపాలనీ, డిసెంబరు 25న సుపరిపాలనాదినంగా, అటల్‌బిహారీ వాజ్‌పేయ్ పుట్టినరోజు ఉత్సవాలను జరపాలనీ, యూనివర్శిటీలకు ఆదేశాలను, ఉత్తర్వులను పంపింది. జూన్ 21నాడు యోగా దినం జరపాలని కూడా యు.జి.సి. ఉత్తర్వులు పంపింది.

అంతేకాక, భారత సైన్యంపట్ల గౌరవాన్ని విద్యార్థులలో నింపటం కోసం యూనివర్శిటీలలో శౌర్య గోడలను ఏర్పాటుచేయాలని, ఆ గోడలపై శౌర్యానికి బహుమతులు, పరమవీరచక్ర, మహావీరచక్ర లాంటి బిరుదులను పొందిన సైన్యానికి చెందిన వివిధ వ్యక్తుల బొమ్మలు చిత్రించాలనీ ప్రభుత్వం ఉత్తర్వులు పంపించింది. ఆపైన, ప్రతి యూనివర్శిటీలోనూ జాతీయజెండా ఎగురవేయాలనీ, ఆ జండా 207 మీటర్ల ఎత్తున ఉండాలనే నిబంధనతో కూడిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం జారీచేసింది. ఆరకంగా దేశభక్తినీ, భారతసైన్యంపట్ల గౌరవాన్నీ యూనివర్శిటీలు నెలకొల్పాలనే ఆదేశాలను ప్రభుత్వం జారీచేసింది.

యు.జి.సి. విద్యాసంస్థలన్నింటికీ నవంబర్ 26ను "భారతదేశం: ప్రజాస్వామ్యపు తల్లి" అనే రోజుగా (రాజ్యాంగదినం) జరపాలని ప్రభుత్వ ఉత్తర్వులను పంపింది.

మరోవైపు భారత చారిత్రక పరిశోధనామండలి తయారుచేసిన ఒక నోట్‌ను యు.జి.సి. పంపిణీ చేసింది. ఆ నోట్‌లో పేర్కొన్న సూచనలమేర చర్చలు నిర్వహించాలని తెలియజేసింది. ఆ నోట్‌లో 'భారతదేశం అతి పురాతన ప్రజాస్వామ్యం అనీ, ఆ ప్రజాస్వామ్య సంప్రదాయాలు ఖప్ పంచాయితీలలో కనబడుతుందనీ' చెప్పారు. ఆదర్శవంతమైన రాజును గురించి చర్చించాలని ఆ నోట్ తెలియజేసింది. అంతేకాక ప్రజాస్వామ్యానికి మూలం వేదకాలంలోనే వుందనీ, అత్యంత పురాతన కాలంనుండీ భూమిపై భారతదేశం ఉనికి వుందని ఆ నోట్ పేర్కొంది. భారత చారిత్రక పరిశోధనామండలి తయారుచేసిన ఆ నోట్‌లోని సూచనలను విధిగా యు.జి.సి. పాటించింది. ఆరకంగా విద్యార్థులను, బిజెపి యొక్క సైద్ధాంతికభావాలను అలవరచుకొనేటట్లు చేయటానికి యు.జి.సి. ఒక సాధనంగా మారింది.

యూనివర్శిటీల్లో విద్యార్థులు చేరేందుకు, అన్ని విశ్వవిద్యాలయాలకూ ఒకే రకమైన సాధారణ ప్రవేశ పరీక్షలు నిర్వహించటానికి, బోధకులను, వైస్‌ఛాన్సలర్‌లను ఒకే విధమైన ప్రమాణాలపై నియమించుకొనే కేంద్రీకృతమైన ప్రక్రియ చేపట్టడానికి ఒక కొత్త చట్టం చేయడం ద్వారా విశ్వవిద్యాలయాల 'పాలనా స్వతంత్రత' రద్దుచేశారు.

కోమాలో వున్న రోగులపై, మహా మృత్యుంజయ జపం ఎటువంటి ప్రభావం కలుగచేస్తుందని అంచనా వేసేందుకు అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రయోగాలు జరిపినప్పుడు, పంచగవ్య (ఆవుపేడ, ఆవు మూత్రము, ఆవుపాలు, ఆవు పెరుగుల మిశ్రమము)పై పరిశోధనలు

జరపాలని ఒక ఐ.ఐ.టి. శాస్త్రవేత్తలను ఆహ్వానించినప్పుడు, అయోధ్యలోని రామమందిరంలో విగ్రహంపై సూర్యకిరణాలు పడటం కోసం శాస్త్రజ్ఞులు కలిసికట్టుగా పనిచేస్తున్నప్పుడు, భారత సంస్కృతి 12,800 సంవత్సరాల పురాతనమైనదన్న విషయంపై భారత చారిత్రక విజ్ఞాన మండలి పరిశోధనలు జరిపి స్థాపించబూనుకొంటున్నప్పుడు – ఇదంతా కూడా నిజమైన వాస్తవ విజ్ఞానం, పరిశోధన అన్న భావాన్ని చులకనచేయటమనీ అప్రధానమైన అంశాలకు పాలక (అధికారంలో వున్న) బిజెపి పార్టీ ప్రాధాన్యతనిస్తోందని మనం అర్థం చేసుకోవలసివస్తోంది.

ఇటీవల కాలంలో ఢిల్లీ యూనివర్శిటీలో పనిచేస్తున్న అధ్యాపకులకు అవగాహనా – రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించారు. ఈ కోర్సులను బోధించే సందర్భంగా, ఆ అధ్యాపకులకు ఉపన్యాసం యిచ్చేందుకు ఆర్.ఎస్.ఎస్. యొక్క దాని అనుబంధసంస్థల యొక్క చిన్న, పెద్ద నాయకులలో ఒకరు, ఆ కోర్సులో పాల్గొన్న అధ్యాపకులందరినీ నిలబడమని వారిచేత "చైనా దేశపు వస్తువులు – 'తలాక్! తలాక్! తలాక్! లాంటి నినాదాలు చెప్పించారు.' అంతేకాక వారందరిచేతా సామూహికంగా "మరణం వస్తేరానీ, కానీ అఖండ్ భారత్ మాత్రమే కావాలి!" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఢిల్లీ యూనివర్శిటీలోని కాలేజీల్లో ఆర్.ఎస్.ఎస్. నాయకుల ఉపన్యాసాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ ఉపన్యాసాలను అధ్యాపకులు కూడా వినాలని ఆజ్ఞలు జారీచేస్తున్నారు.

దాంతో యిప్పుడు వైస్‌ఛాన్సలర్లు, డీన్‌లు, విభాగాధిపతులూ, ఉత్తర్వుల కోసం ఎదురు చూడకుండానే అటువంటి కార్యక్రమాలను తామే స్వయంగా నిర్వహించుతున్నారు. వాటిలో విధిగా అధ్యాపకులు బోధకులు తప్పనిసరిగా పాల్గొంటూ, ఆర్.ఎస్.ఎస్.కు తమ విధేయతను నిరూపించుకొంటున్నారు. ఆర్.ఎస్.ఎస్. నిర్వహించే కార్యక్రమాలకు విద్యార్థులను, అధ్యాపకులను సమీకరించి పెడ్తున్నారు.

ఇవన్నీ జరుగుతూ వుండగానే, నవంబరు 24న యు.జి.సి. ఉన్నత విద్యాసంస్థలన్నింటికీ ఒక సర్క్యులర్ జారీచేసింది. ఆ సర్క్యులర్‌లో ఉన్నత విద్యాసంస్థలన్నీ తమ విద్యార్థులకూ, అధ్యాపకులకూ ధ్యాన సెషన్స్‌ను నిర్వహించాలని ఆదేశించింది. ఆ 'ధ్యాన సెషన్స్' కూడా శ్రీశ్రీ రవిశంకర్‌గారి ఏజెన్సీ అయిన ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ రూపొందించిన ధ్యానవిధాన పద్ధతుల్లోనే నిర్వహించాలని, ఆ పద్ధతులనే అనుసరించాలని స్పష్టంగా నిర్దేశించింది. ఆ రకంగా యు.జి.సి, తమ కర్తవ్యాలను తాము నిర్ణయించుకోవటానికి బదులుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌కు ఒక అడ్వర్‌టయిజింగ్ ఏజెన్సీగా మారిపోయింది.

యు.జి.సి., యూనివర్శిటీలు యిటువంటి కార్యక్రమాలు చేపట్టడం, నిర్వహించటం ద్వారా విద్య, జ్ఞానం, పరిశోధన అన్న విషయాల యొక్క అవగాహన నుండి వైదొలుగుతున్నాయి. అంతేకాక హిందువులు కానివారికి ఈ విశ్వవిద్యాలయాలు, తమ హిందుత్వ ఆధార దార్శనికత వలన పరాయీకరణ చెందిన విద్యాలయాలుగా రూపొందుతున్నాయి.

చాపక్రింద నీరులా చుట్టుముడుతున్న యీ హిందుత్వవాద అభివృద్ధి నిరోధక సిద్ధాంతాల ప్రచారాన్ని కనిపెట్టి, బట్టబయలు చేసి, ప్రతిఘటించాల్సిన ఆవశ్యకత, నేడు పురోగామిశక్తులందరి ముందు వుంది.

**(అపూర్వానంద్ వ్రాసిన వ్యాసం ఆధారంగా)**



## ప్రముఖ హేతువాది, రచయిత, వక్త
# రావిపూడి వెంకటాద్రి మరణం

**భారత** హేతువాద సంఘం ఛైర్మన్, 'హేతువాది' పత్రిక సంపాదకుడు, హే మా (హేతువాద – మానవవాద) ప్రచురణల వ్యవస్థాపకులు రావిపూడి వెంకటాద్రి చీరాలలో 21-1-2023న తన 101వ యేట వృద్ధాప్య సమస్యలతో మరణించారు.

ఆయన ఇంకొల్లు సమీపాన గల నాగండ్ల గ్రామంలో 9-2-1922న ఒక మోతుబరి రైతు కుటుంబంలో జన్మించారు. ఒంగోలులో 7వ తరగతి, చీరాల పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. చదివారు. త్రిపురనేని రామస్వామి రచనల ప్రభావంతో హేతువాద ఉద్యమంలో ప్రవేశించారు. తన 21వ యేటనే నాగండ్లలో 1943 ఏప్రిల్ 5న కవిరాజ ఆశ్రమం స్థాపించి భావప్రచారం ప్రారంభించారు. కవిరాజ ఆశ్రమం మొదటి వార్షికోత్సవానికి మద్రాను నుంచి పెరియార్, అన్నాదురై వచ్చారు. రావిపూడి వెంకటాద్రి ఆ గ్రామానికి 40 ఏళ్ళపాటు సర్పంచ్‌గా పనిచేశారు.

ఎం.ఎన్. రాయ్ ప్రభావంతో ఆయన 1945లో రాడికల్ డెమొక్రటిక్ పార్టీలో చేరి, 1946లో బాపట్ల నియోజకవర్గం నుండి మద్రాసు అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. 1979 నుండి 1989 వరకు ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం అధ్యక్షులుగానూ, 1989 నుండి 2002 వరకు భారత హేతువాద సంఘం అధ్యక్షులుగానూ పనిచేశారు. గత 40 ఏళ్ళుగా 'హేతువాది' మాసపత్రిక సంపాదకులుగా కొనసాగుతున్నారు. హేతువాద – మానవవాద ప్రచురణలకై హే మా పబ్లికేషన్స్ ప్రారంభించి తాను రాసిన వందకు పైగా గ్రంథాలను ప్రచురించారు.

ఆయన ప్రకృతికి సంబంధించి, భౌతికవాదాన్ని తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేశారు. కాని దానిని సమాజ చరిత్రకు అన్వయించిన గతితార్కిక భౌతికవాదాన్ని అంగీకరించలేదు. ఆవిధంగా కమ్యూనిస్టు సిద్ధాంతానికి బద్ధ వ్యతిరేకి. ఎం.ఎన్.రాయ్ రాసిన 'ఫాసిజం' పుస్తకాన్ని ఆయన తెలుగులోకి అనువదించారు. అది ప్రస్తుతం కొనసాగుతున్న మతోన్మాద ఫాసిస్టుతరహా ధోరణులను అర్థం చేసుకోవడానికి, ఒక మేరకు ఉపయోగపడుతుంది.

వ్యాసం

# సంఘటిత ప్రజాఉద్యమశక్తుల నిరంతరాయ పోరాటమే ఫాసిస్టు శక్తులపై విజయానికి హామీ

**విరసం 23వ సాహిత్య పాఠశాల సందర్భంగా 2023 జనవరి 7న జరిగిన సదస్సులో ప్రసంగపాఠం**

సభాధ్యక్షులు, వేదిక మీద ఉన్న పెద్దలు, సదస్సుకు హాజరైన అనేకమంది మిత్రులు... కామ్రేడ్స్!

"ఫాసిజం సాంస్కృతిక ప్రతి వ్యూహం" గురించి చర్చించడానికై జరుగుతున్న విప్లవ రచయితల సంఘం 23వ సాహిత్య పాఠశాల సందర్భంగా ఏర్పాటుచేసిన "ఫాసిస్టు వ్యతిరేక ఐక్యవేదిక నిర్మాణ అవసరం" అనే అంశంపై సదస్సులో జనసాహితిని ఆహ్వానించినందుకు ముందుగా నిర్వాహకులకు విప్లవాభివందనాలు!

అత్యంత సంక్లిష్టమైన దేశకాల పరిస్థితుల నడుమ, మానవీయతను విధ్వంసం గావించే ఫాసిస్ట్ తరహా వాతావరణం దేశంలో నెలకొని ఉన్న అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల నడుమ మనం ఇక్కడ సమావేశమైనాము.

ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలిలోని ఒక స్కూల్లో జరిగిన చిన్న సంఘటనతో నా ప్రసంగం ప్రారంభిస్తాను. ప్రఖ్యాత దేశభక్తి గేయం "సారే జహాసే అచ్చా" రాసిన మహమ్మద్ ఇక్బాల్... బాలలు పాడుకునే ఒక ప్రార్థనాగీతం కూడా రాశారు. ఆ ప్రార్థనా గీతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో చదువుకున్న వారందరూ బాగా ఎరిగినదే. ఎందుకంటే చాలా స్కూళ్లలో దానిని పాడేవారు.

"లబ్ పే ఆతీహై దువా బన్ కే తమన్నా మేరి"

"నా పెదవులకు నిన్ను ఆరాధించాలనే కోరిక పుడుతోంది

ఓ దేవా! నన్ను జ్ఞాన జ్యోతిని ప్రేమించేటట్లు చెయ్...

నేను తప్పులు చేయకుండా నన్ను సదా రక్షించు దేవా!...."

ఇట్లా ఉంటుంది, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సర్వసాధారణమైన ఈ ప్రార్థన గీతం! అయితే ఇటీవల పిల్లల చేత ఈ గీతం ఆలాపింపజేసిన ఉపాధ్యాయుని పైన స్కూలు ప్రధానోపాధ్యాయురాలు పైన విశ్వహిందూ పరిషత్ వారు పోలీస్ కేసు పెట్టినట్లు నిన్న గాక మొన్న జనవరి ఐదున హిందూ పత్రికలో వచ్చింది.

అలాంటి ఎన్నో వార్తలు రోజు వస్తున్నాయి.

ఇంకా విడుదల కానీ షారుఖ్ ఖాన్ సినిమా "పఠాన్" వాల్‌పోస్టర్లను, బ్యానర్లను అహ్మదాబాద్‌లో చింపేయడం, ఇండోర్లో సినిమా హాల్ యజమానులపై ఆ సినిమాను ప్రదర్శించవద్దని ఒత్తిడి తేవడం లాంటివి సర్వసాధారణమవుతున్నాయి.

ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో బస్తర్‌లోని ఆదివాసీ ప్రాంత నారాయణపూర్‌లో బలవంతపు మతమార్పిడులు చేయిస్తున్నారనే పేరిట ఆదివాసులపై దాడుల వార్తలు కూడా అదే రోజు పత్రికల్లో చూశాను.

ఇంకా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకుండా సుమారు 50 వేలమంది పేదలు, ముఖ్యంగా ముస్లింలు, రైల్వే ట్రాక్‌ల దగ్గర 60-70 ఏళ్లుగా జీవిస్తున్న ఇళ్లను, వారి పిల్లలు చదువుకుంటున్న బళ్లను, ఒక బ్యాంకుతో సహా పది మసీదులు నాలుగు దేవాలయాలను తొలగించి వేయమని అవసరమైతే సాయుధ బలగాలను దింపమని హైకోర్టు ఆదేశం ఇచ్చింది. అయితే దానికి సుప్రీంకోర్టు స్టే ఇచ్చినట్లు నిన్న వార్తలలో వచ్చింది.

తమకు వినాయకచవితి చందా ఇవ్వనిరాకరించిన మల్లికార్జున్ అనే దళితుడైన తెలుగు ఉపాధ్యాయుడిపై నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల గ్రామంలో చాలా దౌర్జన్యపూరితంగా, అవమానకరంగా ప్రవర్తించారని ఈరోజే తెలిసిన వార్త.

ఇలా ఆదివాసీలు నివసించే కొండలు, కోనలు దగ్గర నుండి మహానగరాల దాకా ఫాసిస్టు తరహా భౌతిక సాంస్కృతిక అణచివేత సంఘటనలు దాడులు జరగని రోజు ఉండటం లేదు.

ఇలాంటివన్నీ మన దేశపు మతసామరస్య, లౌకిక ప్రజాస్వామ్య భావజాలాలను, అమలులో ఉన్న సహజీవన సంస్కృతిని విధ్వంసం చేసేవి. ఫాసిస్టు తరహా అణచివేతల కాలంలో మనం జీవిస్తున్నాం అనేదానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

అదే సమయంలో ఇలాంటి అనేక ఘోరాలపై నోరు విప్పే ప్రజా ఉద్యమ కార్యకర్తలను, హక్కుల సంఘం నాయకులను, మేధావులను, రచయితలను అబద్ధపు కేసులలో ఇరికించి ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్న వాతావరణం నడుమ మనం ఉన్నాము.

ఎక్కడోదాకా ఎందుకు? ఆ మధ్యన దేశ ప్రధాని విశాఖపట్నం వచ్చినప్పుడు శ్రోతలు బాగా సంతోషిస్తారని "దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు" అనే గురజాడవారి ప్రఖ్యాత కవితా వాక్కులను నరేంద్ర మోడీ తన ప్రసంగంలో భాగంగా చెప్పారు. ఆ మాత్రం దానికే "ఎవరో కమ్యూనిస్టులు లాంటివారు ప్రధానమంత్రికి గురజాడ వాక్కులను అందించారు చూశారా! ఎంత దుర్మార్గం!!" అంటూ ఒకాయన హైదరాబాదు నుండి వెలువడే ఒక దినపత్రికలో వాపోయారు.

పైన పేర్కొన్న నూట పది ఏళ్ల క్రితపు గురజాడ వాక్కులను

తిరస్కరిస్తూ 55 ఏళ్ల క్రితం 'మహాసర్గ' అనే కావ్యంలో ఒక తెలుగు కవి వాక్యాలు ఎలా ఉన్నాయో చూడండి...

"రాష్ట్రమన మానవులు కాదోయ్ రాష్ట్రమంటే ధర్మమోయ్!"

ఆయనే శ్రీ శ్రీ 'దేశ చరిత్ర' బాణీలో రాస్తూ...

"ప్రజాస్వామ్య యుగ పర్యవసానం

రాచరికానికి నాందీ గీతం" అని కూడా రాశారు.

తనలో ఉన్న ఫాసిస్ట్ భావనలను, మనుధర్మ ఊహలను, ఫ్యూడల్ పునరుద్ధరణ ఆశలను పైవిధంగా ఆయన ఏనాడో బయట పెట్టుకున్నారు.

ఒకరకంగా ఆయన ఊహే ఇప్పుడు వాస్తవం అవుతున్నట్లు అనిపిస్తోంది. ఆయన లాంటివారు కోరుకున్న రాచరిక తరహా ఫ్యూడల్ నిరంకుశ రాజ్యం, రూపాలు మార్చుకుని నేటి కాలపు ఫాసిస్టు సాంస్కృతిక అవతారంలో ఏలుబడిలోకొచ్చిన కాలంలోనే కదా మనం ఇపుడు జీవిస్తున్నది!!

మనదేశంలో ప్రస్తుత కాలంలో అమలులోకి వచ్చిన ఫాసిస్టు సంస్కృతి యొక్క మూలాలు ఏమిటి? లక్షణాలు ఏమిటి? దాని వ్యక్తీకరణ రూపాలు ఎట్టివి? దానిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన మెలుకువలు ఎలాంటివి? అనేవి చర్చించుకోవడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాము.

మొదటి రెండవ ప్రపంచ యుద్ధాల నడుమ ఐరోపాఖండంలో ముఖ్యంగా ఇటలీ జర్మనీ దేశాలలో పెరిగిన ఫాసిజం యొక్క లక్షణాలను లోతుగా విశ్లేషించి వివరించిన కామ్రేడ్ జార్జ్ డిమిట్రోవ్ దాని గురించి 1935లో ఒక మాట చెప్పాడు.

"ఫాసిజము, ఫాసిస్టు నిరంకుశత్వాల అభివృద్ధి అనేది ఆయా దేశాల చారిత్రక సాంఘిక ఆర్థిక పరిస్థితులు, జాతీయ ప్రత్యేకతలు, అంతర్జాతీయ స్థితిగతులపై ఆధారపడి, వివిధ దేశాలలో వివిధ రూపాలను తీసుకుంటుంది" అని!

మరికొంత కాలానికి 1943లో "చైనీయ ఫాసిజం : నూతన నిరంకుశత్వం" అనే వ్యాసంలో చౌ ఎన్ లై ఏమి రాశాడో చూద్దాం..

"చియాంగు కై షేక్ స్వాతంత్రం, స్వావలంబన గురించి నొక్కి చెబుతున్నాడు. వాస్తవానికి అతని దళారీ స్వభావం కారణంగా విదేశీ శక్తిపై అతను ఆధారపడుతున్నాడు. అతను స్వతంత్రుడు కాదు. అతనిలోని ఫ్యూడల్ స్వభావం జాతి విద్వేషతత్వం (xenophobia)కు దారితీస్తుంది. కానీ అది జాతీయ స్వావలంబన కాదు"

"చైనా అర్థవలస అర్ధ భూస్వామ్య స్థితిలో ఉన్నందువల్లనే బడా బూర్జువా భూస్వామ్య వర్గాలు తగినంత శక్తి లేనివిగా ఉన్నాయి."

మనకి ఇక్కడ అఖండ భారత్ నినాదంలాగా ఒకప్పుడు చైనా దేశంలోని కొమింగ్ టాంగ్ పార్టీ విశాల చైనా సమాఖ్య లాంటి ప్రతిపాదనలు, దానిపై కొన్ని నినాదాలు ముందుకు తెచ్చింది.

ఒకే సిద్ధాంతం, ఒకే పార్టీ, ఒకే రాజకీయ నాయకుడు అన్న భావనను కొమింగ్ టాంగ్ పార్టీ నాయకుడు చియాంగు కై షేక్ కలిగి ఉండేవాడని, దక్షిణాదిన థాయిలాండ్, బర్మాల నుండి ఉత్తరాదిన మంగోలియా తూర్పున గల కొరియాల దాకా అఖండ చైనా భావన ఒకటి అతనికి ఉండేదని కూడా చౌ ఎన్ లై చెప్పాడు.

ఇంకా ఇలా చెప్పాడు.

"చరిత్ర పట్ల చియాంగ్ అవగాహన, పురాతనమైనదంతా పునరుద్ధ రించాలన్న ఫ్యూడల్ భావజాలంతో నిండి ఉంది. సాంప్రదాయబద్ధమైన దోపిడీ వర్గాల సిద్ధాంతాలను అది ప్రతిబింబిస్తున్నది."

మనంత కాకున్నా చైనా దేశంలో కూడా జాతుల సమస్య కొంత ఉంది. దానిపై...

"జాతుల పట్ల చియాంగు అవగాహన కల్తీ లేని హాన్ జాతి దురహంకారంతో నిండి ఉంది. మన దేశంలోని మైనారిటీ జాతుల పట్ల చాలా చిన్న చూపుతో సరిహద్దులలో నివసించే వారుగా పేర్కొంటాడు. వాటిని జాతులుగా గుర్తించ నిరాకరిస్తున్నాడు. జాతి వివక్ష అణచివేత అతని ఆచరణగా ఉన్నాయి.

అతని ప్రవర్తన అంతా హాన్ జాతీయ దురహంకారంతో నిండి ఉన్నది."

ఇంకా చౌ యెన్ లై ఇలా చెప్పాడు .

"అన్ని రాజకీయ పార్టీలను గ్రూపులను కొమింగ్ టాంగ్‌లో కలిపి వేసుకోవడం, వాటిని రద్దు చేయడం రాజకీయ పార్టీల పట్ల చియాంగు అవగాహనగా ఉంది"

ఒకనాటి అర్థవలస అర్థఫ్యూడల్ చైనా సమాజంతో, నాటి చైనా పాలకుల స్వభావంతో, నేటి మన భారత సమాజానికి, భారతదేశీయ ఫాసిస్టు ధోరణులకు చాలా స్పష్టమైన పోలికలు ఉన్నందువల్ల పై చైనీయ ఫాసిజం అంశాన్ని మీ దృష్టికి తెచ్చాను.

"దేశమంటే మనుషులు కాదు, ధర్మము!" అని రాసిన కవిగారు కూడా ఆ ధర్మానికి నిలయంగా ఉండే ఫ్యూడల్ రాచరిక భౌతిక వ్యవస్థీకృత స్వభావాన్ని దాచుకోకుండా చెప్పాడు.

కనుక నేనిక్కడ నేటి భారతీయ ఫాసిజం ఏ లక్షణాలతో పుట్టిందో, కొనసాగుతోందో ముఖ్యంగా మూడు అంశాలను మీ దృష్టికి తేవాలను కుంటున్నాను.

1. అది నిచ్చెన మెట్ల కులవ్యవస్థకు మూలమైన ఫ్యూడలిజపు ముద్దుబిడ్డ

2. సామ్రాజ్యవాదపు పెంపుడు బిడ్డ

3. యూరోపియన్ ఫాసిజపు మానస పుత్రిక

అదే అనేక రూపాంతరాలతో వ్యక్తమవుతూ ఈనాడు ఫ్యూడల్ రాజసూయంగా, కార్పొరేట్ ఫాసిజంగా దేశవ్యాప్తంగా వికట వికృత మతోన్మాద విన్యాసాలు చేస్తోంది.

దాని ఆచరణ రూపాలు ఎలా వ్యక్తమయినాయో కూడా చూద్దాం.

ప్రతి రాజకీయ సమస్యను మత సమస్యగా, ప్రతి మత సమస్యను రాజకీయ సమస్యగా మలుచుకునే మతోన్మాద పూరిత విధానం ద్వారా అధికారాన్ని పొందడానికి వేసిన రాజకీయ వ్యూహమే బాబ్రీ మసీదు, రామ జన్మభూమి సమస్య.

దేశంలో ఆర్థిక రాజకీయ సంక్షోభం పెచ్చరిల్లుతున్న కాలంలో, భారత పాలకవర్గాలు 1991 నుండి సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు రహదారులు నిర్మించుకుంటున్న వేళ, ప్రజలను వాటికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలువనీయకుండా, సంఘటిత పడకుండా విభిన్న విశ్వాసాల భారత ప్రజలను హిందూ మతం పేరిట విభజించడానికి, సాధారణ హిందూ ప్రజానీకంలో ఉన్మాదాలు రెచ్చగొట్టి ప్రజలను ముఖ్యంగా యువతరాన్ని మతం పేరిట పక్కదారులు పట్టించడానికి, ఫాసిస్టు భౌతిక శక్తులుగా సంఘటిత పరుచుకోవడానికి అధికార పీఠాలను కైవసం చేసుకోవటానికి వేసిన రాజకీయ ఎత్తుగడలో భాగంగా బాబ్రీ మసీదు సమస్య సాగినది. నేటికీ కొనసాగుతున్న చరిత్ర ఇదే !

అప్పటికే పాకిస్తాన్లో ఇస్లామిక్ టెర్రరిజాన్ని సాకుతూ ఉండిన అమెరికా సామ్రాజ్యవాదం, సోవియట్ యూనియన్ కుప్పకూలి పోవడంతో, తన ప్రపంచవ్యాప్త కమ్యూనిస్టు వ్యతిరేక వ్యూహాన్ని మార్చుకుని శామ్యూల్ హటింగ్టన్ అనే ఒక అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త రూపొందించిన నాగరికతల నడుమ సంఘర్షణ అనే సిద్ధాంతాన్ని "ఇస్లామో ఫోబియా" దిశగా మరల్చి ప్రపంచ స్థాయిలో, ముఖ్యంగా తనకు సానుకూలంగా లేని ఆసియా, ఆఫ్రికా దేశాలకు వ్యతిరేకంగా "ఇస్లామో ఫోబియా"ను ప్రయోగించింది. సంఘపరివార శక్తులకు తమ మూల సిద్ధాంతమైన ముస్లింద్వేష అలాగే పాకిస్తాన్ ద్వేష రాజకీయాలకు తోడుగా ఒకవైపు ప్రపంచీకరణ శక్తుల "ఇస్లామో ఫోబియా" నుండి మరొకవైపు భారతీయ బడా కార్పొరేట్ల నుండి పూర్తిస్థాయి ప్రత్యక్ష పరోక్ష మద్దతును అందిపుచ్చుకున్నాయి. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అభివృద్ధి చెందిన దేశాలు తమ సంక్షోభ భారాలను వెనుకబడిన దేశాలపై రుద్దుతున్నాయి. ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులకు తేలికగా అందుబాటులో ఉన్న అతిపెద్ద మార్కెట్ వ్యవస్థ భారతదేశం. అసమానతలు ఘోరంగా పెరగటానికి, మానవ అభివృద్ధి సూచీలలో బాగా వెనకబడి ఉండటానికి, నిరంకుశ పాలనా పద్ధతులకు ఇది ఒక ముఖ్యకారణం.

ఈ పరిస్థితులకనువుగా ప్రపంచ కార్పొరేట్ల భారతీయ బడా బూర్జువావర్గాల సేవలో భారత పాలకవర్గాల ప్రతినిధిగా భాజపా ఫాసిస్టు పాలనా విధానాలను, బుల్డోజర్ రాజకీయాలను, నేడు అడ్డు అదుపు లేకుండా అన్నట్లు అమలు చేయగలుగుతోంది.

అది కేవలం భావజాలానికి పరిమితమైన సాంస్కృతిక శక్తి కాదని, భౌతిక రాజకీయ శక్తి అని మనం గుర్తుపెట్టుకోవాలి.

అదే సమయంలో ఈ ఫాసిస్టు శక్తుల బలహీనత ఎక్కడ ఉందో కూడా మనం తెలుసుకోవాలి.

అమెరికాతో సహా ప్రపంచ సామ్రాజ్యవాద దేశాల దోపిడీకి రంగస్థలంగా ఉన్న భారతదేశాన్ని, దాని సామాజిక వ్యవస్థను, కాంగ్రెస్ పాలకుల వలెనే నిరంతర సంక్షోభంలో నిర్వహించక తప్పని పరిస్థితులలో, కాంగ్రెస్‌వారికి మించిన నిరంకుశ పద్ధతులతో కొనసాగించడం తప్ప మరొక దిక్కులేని పాలకశక్తుల దుస్థితియే వారి అతి ముఖ్యమైన బలహీనత!

దేశ సహజ వనరులను, ఆదివాసుల అటవీ భూములను దోపిడీ వర్గాలకు కట్టబెడుతున్నారు. వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను చేస్తున్నారు. చిరకాలంగా సాధించుకున్న కార్మికుల హక్కులను రద్దు చేస్తున్నారు. ప్రజల ఉమ్మడి సంపద అయిన అనేక ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ స్వదేశీ బడా కార్పొరేట్లకు అతి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. ఇవన్నీ పాలకవర్గాల వ్యవస్థీకృత విధాన బలహీన లక్షణాలే. ప్రజల వ్యతిరేకతకు సంఘర్షణకు ఇవన్నీ కారణమవుతున్నాయి.

పై సంక్షోభం యొక్క మరికొన్ని వ్యక్తీకరణలే పెరిగిపోతున్న తీవ్ర సామాజిక అసమానతలు, వారికి తగ్గించడానికి సాధ్యం కాని అధిక ధరలు, పెరిగిపోతున్న నిరుద్యోగం, అవినీతి, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అనేక వికృత సాంస్కృతిక రూపాలు.

ఈ వ్యవస్థీకృత సంక్షోభాలకు బలి అవుతున్న అశేష శ్రామిక ప్రజానీకంలో ముస్లిం మైనారిటీలు, దళితులు, మహిళలు ప్రత్యేకంగా ఉన్నారు. దోపిడీ పీడనలకు అణచివేతలకు గురవుతున్న వివిధ వర్గాల ప్రజలు వాటికి వ్యతిరేకంగా తప్పక పోరాడతారని పాలక శక్తులకు తెలుసు. కనుక అశేష జనావళిని సంఘటిత పడనీయకుండా చేసే ప్రయత్నంలో భాగమే ప్రజల నడుమ మత విద్వేషాలను పెంచడం, ఉన్మాదపూరిత దాడులు జరపటం, విద్వేషపూరిత ఫాసిస్టు ప్రచారాలు సాగించడం మొదలైనవి. అందుకే ఒక విధానంగా వీటిని వారు అమలు పరుస్తున్నారు.

సరిగ్గా ఇక్కడే రచయితలం, కళాకారులం ఇంకా మేధావులం పాలకవర్గాల బలహీన క్షేత్రాలను పసిగట్టి ప్రజలను చైతన్యవంతం చేయడంలో, వారిని పట్టిపీడిస్తున్న నిత్యజీవిత సమస్యలకు మూల కారణమైన దోపిడీతత్త్వ విధానాలను అర్థమయ్యేట్లు వివరించటంలో భావజాల సాంఘిక, సాంస్కృతికరంగాలలో కీలక బాధ్యత పోషించవలసిన కర్తవ్యం మన పైన ఉంది. మనం సాగించవలసిన భావజాల పోరాటాన్ని, ప్రజల యొక్క భౌతిక పోరాట రంగాలతో, వారి నిత్యజీవిత లౌకిక సమస్యలతో సమన్వయించి సాగించటం చాలా ముఖ్యమైన విషయంగా మనమంతా తప్పనిసరిగా గుర్తించి స్వీకరించాలి. భావజాల రంగంలో మనం సాగించవలసిన కృషికి చాలా ప్రాముఖ్యత ఉన్న మాట నిజమే కానీ అదే అంతిమ విజయాన్ని సాధించలేదు. సంఘటిత ప్రజా ఉద్యమ శక్తుల నిరంతరాయ పోరాటమే ఫాసిస్టు శక్తులపై నిజమైన విజయానికి హామీ!

మతతత్త్వ రాజకీయ కేంద్రంగా నిరంతర ఉద్వేగాలను సృష్టిస్తున్న ఉన్మాద సంస్కృతికి వ్యతిరేకంగా లౌకిక జీవన సమస్యల కేంద్రం వైపుకి ప్రజల ఆలోచనలను మలచడం మన తక్షణ కర్తవ్యంగా ఉండాలి. అదే సమయంలో... భావజాల రంగంలో కృషి చేయవలసిన సాంస్కృతిక కార్యకర్తలంగా, మనం కొన్ని ముఖ్యమైన సామాజిక అవగాహనపరమైన హద్దులను అర్థం చేసుకుని మెలకువతో వ్యవహరించాల్సి ఉంటుంది.

1. మతము, మతతత్త్వము ఒకటి కావు. మతము సంస్కృతికి సంబంధించిన అంశమైతే, మతతత్త్వము రాజకీయ సంబంధమైనది.

2. హిందువులు, హిందుత్వ ఒకటి కావు.

అన్ని మతాలలోని సాధారణ ప్రజలు మతసామరస్యాన్ని కోరుకుంటారు. "మజ్ హబ్ నహీ సిఖాతా, అపాస్ మే బైర్ రఖనా" అన్నాడు మహమ్మద్ ఇక్బాల్, సారే జహాసే అచ్చా పాటలో! అంటే "మతం విద్వేషాన్ని రగిలించదు" అని కదా అర్థం. మతం పేరిట ద్వేషాన్ని రగిలించేవాళ్ళు ఉన్నప్పుడు ద్వేషించవలసింది మతాన్ని కాదు. దాన్ని ఆసరాగా తీసుకుని మతవిద్వేష కేంద్రంగా నడిచే వారి హిందుత్వ రాజకీయాన్ని.

3. మనం రాజకీయాలలోకి మతాన్ని చొప్పించే కుహనా లౌకికవాదాన్ని విమర్శించాలి. హిందుత్వవాదుల ద్వేష లౌకిక లక్ష్యాలను ఎండగట్టాలి.

4. మతతత్త్వానికే కాదు, ఉపఖండంలో టెర్రరిజానికి కూడా సామ్రాజ్యవాదశక్తుల ముఖ్యంగా నేడు అమెరికన్ సామ్రాజ్యవాదశక్తుల ప్రమేయం ఉంది. ఆ విధంగా మతతత్త్వం – టెర్రరిజం – సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెనవేసుకుని ఉన్నాయి.

5. "హిందువులు లేగ దూడలై ఏడ్చుచుండ"... అన్న చిలకమర్తివారి 1907 నాటి పద్యంలో, "జైహింద్" అన్న సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన నినాదంలో... హిందువులు అంటే మతస్తులు కాదు. సమస్త కులాల, మతాల, తెగల భారతీయులు అని అర్థం. బ్రిటిష్ పాలన ఏర్పడక పూర్వం హిందువులనే మాటకు అర్థం కూడా అదే. నేటి భారత పాకిస్తాన్ బంగ్లాదేశ్‌లున్న ప్రదేశంలో, నాడు జీవించిన వారందరూ హిందువులే! అంటే హిందూ అనే పేరు ప్రాదేశికంగా ఏర్పడినది. దానికి, క్రిస్టియన్లు ముస్లింలు మినహా, దళితులు ఆదివాసీలతో సహా సమస్త జనులందరూ హిందూమతస్తులే అనే చట్టబద్ధ రూపం కల్పించినది బ్రిటిష్ పాలకులు. అన్యమతస్తులను ద్వేషించేవాడే హిందువు అనే సరికొత్త నిర్వచనాన్ని రుద్దటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ధోరణి సంఘపరివార శక్తులది. ఒకే కేంద్రీకృత మత వ్యవస్థగా ఏనాడూ లేని హిందూ మతం పేరిట అన్యమత ద్వేష కేంద్ర రాజకీయమే హిందూత్వపు అర్థం లేక అంతరార్థం...

6. వలస పాలకులు హిందూ పదానికి అందించిన మతం అనే చారిత్రక భావనపై, మతోన్మాద శక్తులు చెలాయిస్తున్న గుత్తాధిపత్యానికి లౌకికవాదులు ఆమోదముద్రను అందించే వైపుగా వ్యవహరించకూడదు. వారు సాధారణ హిందూమత విశ్వాసుల జీవన ప్రయోజనాలకు వ్యతిరేకులనే అంశాన్ని మనం బలంగా చెప్పగలగాలి.

7. బ్రిటిష్ వలసవాదులు భారత గడ్డపైకి వచ్చేనాటికే కాదు వెళ్లిపోయే నాటికి కూడా వందలాది రాజ్యాలు ఉన్నట్లే, అనేక భాషలూ, కులాలు, ఉపకులాలు, శాఖలు, శాఖంతరాలు, వందలాది తెగలు, అనేకానేక ఆచారాలు సంస్కృతులు, దైవ విశ్వాసాలు ఉన్నట్లే విభిన్న మతాలు, మత శాఖలు కూడా ఉన్నాయి. ఏకీకృత మతం అనేది వ్యవస్థీకృత భౌతిక రూపంలో ఎప్పుడూ లేదు. దేశమంతా ఒకే మతం ఉన్నట్లు, అది హిందూమతమే అన్నట్లు, సంఘపరివార శక్తులు చేసే దుష్ప్రచారాన్ని నిజమేనని ప్రజలు నమ్మే విధంగా లౌకికవాదుల భావవ్యక్తీకరణ ఉండకూడదు.

8. మతం పట్ల కూడా మనం వర్గ దృక్పథం కలిగి ఉండాలి. అందులో ఒక ముఖ్యమైన అంశం : మతమన్నది కలిగిన వారి చేతిలో దుడ్డు కర్ర అయితే లేనివారికి అది ఒక ఊతకర్ర. సాధారణ ప్రజలు నమ్ముకునే ఆ చిరు ఆసరాను వ్యంగ్యాలు వెక్కిరింతలతో గాయపరిచే విధంగా కాకుండా చాలా సున్నితంగా హేతువాదులు, లౌకికవాదులు వ్యవహరించాలి.

9. బ్రిటిష్ వారి రాక తర్వాత ఆరంభమైన పారిశ్రామిక ఉత్పత్తి ప్రక్రియ వల్ల కొత్త కులాల పుట్టుక ఆగిపోయింది.

బ్రిటిష్ పరిపాలన భిన్న మతాలను, మత శాఖలను, ఆచార విశ్వాసాలను ఒకే హిందూ మతంగా చేసినట్లు, గడచిన 75 ఏళ్లుగా వివిధ పాలకవర్గ రాజకీయ పార్టీలు పార్లమెంటరీ ఎన్నికల ప్రక్రియ ఆసరాతో, తమ పాలనా విధానాలతో ఒకరితో మరొకరికి సజీవ సాంఘిక సంబంధం (Homogenety) లేని వివిధ కులాలలోని శాఖోప శాఖలను ఒకే కులం పేరిట సంఘటితపరుస్తున్నారు. ఆ విధంగా సంపన్నకులవర్గాలు, పేదబలహీన వర్గాల ప్రజలను కులం పేరుతో తమ వెనుక సమీకరించుకోగలుగుతున్నారు. అంతేకాక కొత్త రూపాలలో కుల వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. గిడస బారిపోయిన అర్థవలస అర్థఫ్యూడల్ వ్యవస్థకు పూర్వకాలపుదైన భారతీయ ఫ్యూడల్ వ్యవస్థ, కులవ్యవస్థకు మూల కారణమైనప్పటికీ ఆధునిక ఎన్నికల రాజకీయ వ్యవస్థ దాన్ని కొత్త రూపాలలో సంఘటిత పరిచేట్లు వ్యవహరిస్తోందని ప్రజాస్వామికవాదులు అర్థం చేసుకోవాలి. కుల వ్యవస్థను కాపాడే గ్రామీణ ఆర్థిక రాజకీయాలే నేటి భారతీయ ఫ్యూడల్ వ్యవస్థ. వీటిని కాపాడే సమస్త మత భావజాలాల వర్గ ప్రయోజనాలను బహిర్గతపరిచే సాంస్కృతికోద్యమ కృషి పట్ల మన దృష్టి కేంద్రీకృతమై ఉండాలి.

సంఘపరివార శక్తులు కూడా వక్రీకరింపబడిన పితృస్వామిక ఫ్యూడల్ రాచరిక గతం పట్ల ఆత్మవంచనాత్మక రూపాలలో కృత్రిమ ఆరాధన భావాన్ని సృష్టించగలరు తప్ప ఒకనాటి కులవ్యవస్థతో సహా గతాన్ని యథాతథంగా పునరుద్ధరించలేరు. కొత్త వృత్తులకు కొత్త కులాలను సృష్టించలేరు. మహా అయితే, మార్పులకు గురవుతూ నేటి స్థితికి చేరిన అర్థవలస అర్థఫ్యూడల్ వ్యవస్థను, దాని నేటి సంస్కృతిని ఫాసిస్టురూపాలలో మరి కొంతకాలం బతికించి కొనసాగించగలరు తప్ప చరిత్రను నిజంగా వెనుకకు తిప్పలేరు.

10. అనేక భాషలు, జాతులు, వివిధ తెగలు సంస్కృతులతో కూడిన వైవిధ్యపూరిత విశాల భారతదేశాన్ని, ఒకే భాష ఒకే జాతి ఒకే సంస్కృతి అనే ఫాసిస్టు ధోరణుల ప్రయోజనాలకు మూలం; సామ్రాజ్యవాదుల వారి తైనాతీలైన బడా బూర్జువా వర్గాల గుత్తాధిపత్య మార్కెట్ విస్తరణ అవసరాలను కాపాడటం! తమ తమ జాతుల అస్తిత్వాన్ని భాషల విశిష్టతను కాపాడుకోవాలని చేసే వివిధ ప్రాంతాల,

రాష్ట్రాల ప్రజల జీవన ఆకాంక్షలకు, ఆందోళనలకు మనం అండగా ఉండాలి. జాతుల స్వయం నిర్ణయ హక్కులకై సాగించే పోరాటాలకు మనం మద్దతుగా నిలవాలి. నిజమైన ఫెడరల్ వ్యవస్థను మనం డిమాండ్ చేయాలి.

***మిత్రులారా! కామ్రేడ్స్!!***

నాలుగు దశాబ్దాల క్రితం నుండీ రాజకీయ అధికార సాధనకు మతతత్వాన్ని ప్రధాన వాహకంగా తీవ్రతరం కావించిన భాజపా వర్గాలు, కాలక్రమంలో అధికారాన్ని కైవసం చేసుకుని, దానిని నిలబెట్టుకోవడానికి కూడా మత విద్వేషతత్త్వమే ఆసరా చేసుకోక తప్పని పరిస్థితికి చేరుకున్నారు. 2019 ఎన్నికల తదనంతరం రోజువారీగా మత విద్వేష లేక మతోన్మాద ఫాసిస్టుతరహా వాతావరణాన్ని ఎల్లవేళలా పోషిస్తూ కొనసాగిస్తున్నారు. పైకి ఎంత బలంగా కనిపిస్తున్నప్పటికీ నిజానికి ఇది వారి బలం కాదు. పతనాన్ని చేరువ చేసే బలహీనత.

అయినా నేటి వాస్తవ పరిస్థితి ప్రకారం సమస్త కులాల సాధారణ హిందూ ప్రజలు ఈ ఉన్మాద సంస్కృతికి బలికాకుండా సున్నితంగా వ్యవహరించవలసిన క్లిష్ట కాలంలో ఇప్పుడు మనం ఉన్నాము.

ఈ సందర్భంగా ప్రజల విశ్వాసాలతోనూ, సంస్కృతి విషయంలోనూ ఎడాపెడాగా చిత్తం వచ్చిన రీతిన వ్యవహరించకూడదని మనకు తెలుసు.

గుజరాత్ గాయం (2002) కాలం నుండి, ప్రొఫెసర్ కల్బుర్గి హత్య (2015) కాలం నుండి వివిధ సాహితీ సాంస్కృతిక సంస్థలు మేధో జీవులు పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా స్థూలంగా లౌకిక ప్రజాస్వామ్య సంస్కృతీ నిర్మాణానికై ఏకీభావం కలిగిన సాహిత్య సాంస్కృతిక సంస్థలు, మేధావులతో కూడిన ఉద్యమకృషి కొంత తెలుగు నాట సాగుతూ వస్తోంది.

వాటి అనుభవాలను మదింపు చేసుకోవడం అవసరం.

నిబద్ధ సంస్థలు లేకుండా ఈ కృషి విస్తృతం కాలేదు. అదే సమయంలో ఈ సంస్థల నడుమ ఆమోదయోగ్యమైన పరస్పర విశ్వాసం కలిగిన ఏకీభావమే ఒక సమస్యగా ఉంది. పై అడ్డంకులను అధిగమించటానికి ఓపికతో కూడిన ప్రత్యేక కృషి అవసరమవుతుంది.

అటువంటి ప్రయత్నానికి ఈనాటి విరసం పాఠశాల ఒక స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాము. దానిని విస్తృత పరచడానికి జనసాహితి సంస్థగా హృదయపూర్వకంగా కలిసి పని చేద్దామని, వేదిక మీదనున్న పెద్దల సాక్షిగా ఫాసిస్టు వ్యతిరేక లౌకిక ప్రజాస్వామ్య సాంస్కృతిక ఉద్యమ శక్తులన్నిటితో కలిసి పనిచేయడానికి, వీరి నడుమ ఏకీభావ సాధనకు మా సంసిద్ధతను తెలియపరుస్తున్నాము.

ఫాసిస్టు శక్తుల ఓటమి లౌకిక ప్రజాస్వామ్య సంస్కృతి విజయము తథ్యమని మీ అందరి సమక్షంలో మరోసారి ప్రకటిస్తున్నాను.

***...విప్లవాభివందనలతో,***

**7-1-2023**
**హైదరాబాదు**
**సుందరయ్య విజ్ఞాన కేంద్రం**

**దివికుమార్**
**అధ్యక్షుడు, జనసాహితి**

(పై సదస్సులో సమయాభావం చేత కొంత క్లుప్తంగా మాట్లాడవలసి వచ్చిందని గ్రహించగలరు)

## ఉత్తమ అధ్యాపకుడు, ప్రజాతంత్రవాది
# కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (కె.వి.) మరణం

**వామపక్ష** మేధావి, ప్రజాతంత్రవాది, రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు, కె.వి.గా ప్రసిద్ధులైన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు రాజమండ్రిలో 10.01.2023న మరణించారు.

గుంటూరుజిల్లాలోని పాములపాడు ఆయన స్వగ్రామం. కొన్నాళ్ళు కళాశాల ప్రిన్సిపల్‌గా చేసిన ఆయన ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో రాజనీతి శాస్త్ర శాఖలో ఆచార్యునిగా పనిచేశారు. 'మహాభారతంలో రాజనీతి' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ పొందారు. 'డెమొక్రసీ ఎట్ వర్క్' అనే ప్రసిద్ధ గ్రంథం రచించారు. తెలుగుభాష మూలాలు ద్రావిడ భాషకు చెందినవేననే మరొక గ్రంథం వారు రచించారు.

పేద, దళిత విద్యార్థులపై అభిమానంతో, వారి జ్ఞాన సముపార్జనకు అవకాశాలు కల్పించేవారు. ఆర్థిక సహాయం చేసేవారు. 'ప్రజాసాహితి' ప్రారంభించిన నాటినుండీ పాఠకులుగా తగు సూచనలిస్తూ ప్రోత్సహించారు. ఆర్థికంగా ఆదుకునేవారు.

## నవలా రచయిత
# రేగులపాటి కిషన్‌రావు మరణం

**1970లలో** రచనా వ్యాసంగంలో ప్రవేశించి, నాలుగు నవలలు, ఆరు కథాసంపుటాలు, 13 కవిత్వ సంపుటాలు, నాలుగు వ్యాస సంపుటులు రచించిన రేగులపాటి కిషన్‌రావు తన 77వ యేట 5-1-2023న మరణించారు. ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాక సమీపాన గల చింతలఠాణాలో 1-12-1946న జన్మించారు. 1970-2004లలో 34 ఏళ్ళు ఉపాధ్యాయునిగా పనిచేసి కరీంనగర్‌లో స్థిరపడ్డారు.

సంఘసంస్కరణ, అభ్యుదయ, నాస్తిక, హేతువాద భావాలతో ఆయన రచనలు చేశారు. ఎల్లారెడ్డి పేటలో 'నటరాజ కళానికేతన్' సంస్థను నిర్వహించారు. 1980లో రంగనాయకమ్మ ముందుమాట రాసిన 'భాగవత విషసర్పం' అనే విమర్శనా గ్రంథాన్ని రాశారు. కిషన్‌రావు భార్య విజయలక్ష్మి కూడా కథారచయితే. 1976లో ఆయన రాసిన నవల 'ఆమె వితంతువు కాదు'ను ఆనాటి స్త్రీవాద రచనల్లో మొదటిదానిగా విమర్శకులు పేర్కొన్నారు.

డాక్యుమెంటరీ సమీక్ష

బీబీసీ డాక్యుమెంటరీ

# 'ఇండియా : ద మోదీ క్వశ్చన్'

## (ఇండియా : మోదీ వివాదం)

– బాలాజీ (కోల్‌కతా)

**దాచేద్దామనుకున్నా** దాగని, మాయని గాయం గుజరాత్ 2002 నరమేధం. దీని గురించి తాజాగా బీబీసీ 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' (ఇండియా: మోదీ వివాదం) అనే డాక్యుమెంటరీని రెండు విడతలుగా ప్రసారం చేసింది. జనవరి 17, 24 తేదీల్లో వరుసగా ఒకటీ, రెండూ భాగాలు ప్రసారమయ్యాయి. సహజంగానే పెద్ద దుమారం చెలరేగింది. ప్రజలు వూహించిన ప్రతిస్పందనే కేంద్ర ప్రభుత్వం నుండి కనిపించింది. ఐటీ చట్టంలోని ఎమర్జెన్సీ అధికారాల్ని వినియోగించి ఈ డాక్యుమెంటరీని యూట్యూబుల్నుంచీ, ట్విట్టర్లనుంచీ నిషేధించారు. కానీ ఈ డిజిటల్ యుగంలో సమాచారాన్ని తొక్కిపెట్టడం సాధ్యం కాదు. బాయ్‌కాట్ పిలుపు తర్వాత 'పఠాన్' సినిమా సూపర్ హిట్ ఐనట్లు నిషేధం తర్వాత ఈ డాక్యుమెంటరీని ఎక్కువమంది ఏదోరకంగా ప్రయత్నించి చూసేస్తున్నారు. యూనివర్సిటీల్లో ప్రదర్శన చేస్తుంటే కొన్ని చోట్ల ఆర్గనైజర్లను అరెస్టు చేస్తున్నారు. కరెంట్ కోతనూ విధిస్తున్నారు.

'గుజరాత్ గతాన్ని గుర్తుకు తెస్తే ప్రస్తుత పాలకులు ఎందుకింత కలవరపడుతున్నారు?' ఇదే ప్రశ్నను 'ద వైర్' తరుపున ఆర్ఫా ఖానుమ్ మరో ప్రముఖ డాక్యుమెంటరీ నిర్మాత ఆనంద్ పట్వర్ధన్‌ను అడిగితే అతడు లేడీ మేక్బెత్ తన రక్తశిక్త హస్తాల్ని మళ్లీ మళ్లీ కడుక్కునే ఉదంతాన్ని గుర్తుచేశాడు. పాత నేరాన్ని గుర్తుచేస్తే ఇబ్బంది పడే వ్యక్తిత్వాలు అలానే ప్రవర్తిస్తాయని చెప్పాడు. అయితే లేడీ మేక్బెత్‌లో ఒక అపరాధ భావన ఉన్నట్టు మనకు తెలుసు. గుజరాత్ మారణకాండ నేరస్తుల్లో అలాంటిదేం కన్పించడం లేదు. ఈ డాక్యుమెంటరీ ఇండియాలో ప్రధానమంత్రి మోదీకి 'ముస్లింలతో ఉన్న సమస్యాత్మక సంబంధాలను' పరిశోధిస్తునట్టు చెబుతుంది. ప్రధానమంత్రి హోదాలో ఆయన ఈనాడు చేస్తున్నది ఒకప్పుడు ముఖ్యమంత్రి హోదాలో గుజరాత్‌లో చేసిన దానికి కొనసాగింపే అని వివరిస్తుంది. 'గుజరాత్ 2002' మొదటి భాగంలోని వస్తువు కాగా, '2014, 2019 ఎన్నికల విజయాల తర్వాత ముస్లింల ఊచకోత, అణిచివేతల గురించి' రెండో భాగం చెబుతుంది.

### డాక్యుమెంటరీ నేపథ్యం :

2002 ఫిబ్రవరి 27న గుజరాత్ గోద్రా స్టేషన్ వద్ద సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ఎస్–6 కోచ్‌లో ఒక భయంకరమైన అగ్ని ప్రమాదం జరిగింది. అయోధ్య నుండి తిరిగి వస్తున్న 58 మంది కరసేవకులు భయంకరంగా కాలి మరణించారు. ఏ అధ్యయనమూ జరపకమునుపే దీని వెనుక స్థానిక ముస్లింలతో పాటు, ఐఎస్ఐ కుట్ర దాగి ఉందని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. మృతదేహాలను అహ్మదాబాద్ స్టేషన్ బయట ప్రదర్శించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 28 నుండి మార్చి 2 వ తేదీ వరకూ ముస్లింలపై మానవత సిగ్గుపడేలా అత్యాచారాలు జరిగాయి. హత్యలూ, మానభంగాలూ, ముస్లింల దుకాణాలూ, వ్యాపార సంస్థల లూటీలూ, తగులబెట్టడాలూ నిర్దేశించుకున్న పథకం ప్రకారం జరిగాయి. హిందువుల ఇళ్లను ముస్లింల ఇళ్ల నుండి వేరు చేసి చూపడానికి నిర్దిష్టమైన బండగుర్తులు ఉపయోగించారు. 'చర్యకు ప్రతిచర్య' అన్న ముఖ్యమంత్రిగారి సూత్రం, 'రాజధర్మాన్ని పాటించాలి' అని అప్పటి ప్రధాని ఆగ్రహించడం ఇవన్నీ ఆ రోజుల్ని దాటుకుంటూ వచ్చిన మనలాంటి సీనియర్లకు తెలుసు. ఈ రోజు గోదీ మీడియాగా మారిపోయిన ఆనాటి చాలా మీడియా సంస్థలే ఈ సంగతులన్నీ కవర్ చేశాయి. ఈ మారణకాండ గురించి బ్రిటన్ రాయబారి నుండి ఒక నివేదికను కోరాడు ఆనాటి బ్రిటన్ విదేశాంగ మంత్రిగా ఉన్న జాక్ స్ట్రా. ఆ నివేదిక ఇన్నేళ్ల తర్వాత బీబీసీ చేతిలో పడింది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ పుంజుకుంటున్న తరుణంలో అప్పటి లేబర్ సర్కారు సంపాదించిన నివేదిక ప్రసారం కావడం విశేషమే. అయితే ఈ డాక్యుమెంటరీ ప్రసారం కాగానే 'ఇది వక్రీకరణలతో కూడినదనీ, బ్రిటన్ వలసవాద మనస్తత్వాన్ని వ్యక్తపరుస్తోందని' భారత అధికారిక ప్రకటనలు వచ్చాయి. కానీ ఆనాడు ఆ అల్లర్లలో టూర్‌కి వెళ్లిన బ్రిటీష్ పౌరులు కూడా ఈ ఊచకోతలో చనిపోయారనీ, వారు న్యాయం కోసం తమ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారనీ, అందుకే ఈ నివేదికను తయారుచేశామనీ ఇటీవల కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జాక్ స్ట్రా పేర్కొన్నాడు. బీబీసీ 1943 నాటి బెంగాలు క్షామంపై డాక్యుమెంటరీ తయారుచేసి దానికి బాధ్యుడు అప్పటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అని చెప్పినపుడు ఏ వలసవాద మనస్తత్వం పనిచేసినట్టూ అన్న ప్రశ్న కూడా మనకు కలగాలి.

### మొదటిభాగం :

ఇమ్రాన్ దావూద్, ఆయన బాబాయిలు అయిన షకీల్, సయీద్, ఆయన స్నేహితుడు మొహమ్మద్ అస్వత్ – వీరంతా బ్రిటీష్ పౌరులు. ఇండియాకు టూర్ కోసం వచ్చారు. తాజ్‌మహల్ చూసి కారులో తిరిగి వస్తున్నారు. గుజరాత్ అల్లరి మూక కంటపడ్డారు. ఆ గుంపు వారి మతాన్ని గురించి ప్రశ్నించింది. ముస్లింలు అని తెలియగానే మొదట డ్రైవర్‌ను చంపేసి, ఆ తర్వాత ఎంత వేడుకుంటున్నా వినకుండా షకీల్,

సయీద్‌లను చంపేశారు. ఇమ్రాన్, అస్వత్‌లను కత్తులతో పొడిచి చచ్చారనుకుని వదిలేశారు. కానీ ఇమ్రాన్ ప్రాణాలతో మిగిలాడు. బ్రిటన్ నుండి ఈనాటి వరకూ న్యాయపోరాటం చేస్తూనే వున్నాడు. 2005లో మోదీ బ్రిటన్ పర్యటనకు వెళ్లినపుడు సాక్షులు లేకపోవడం కారణంగా అక్కడి జడ్జి మోదీ అరెస్టుకు వారెంట్ ఇవ్వలేకపోయాడు. ఇమ్రాన్ కథనంతో ఈ డాక్యుమెంటరీ ఆరంభమౌతుంది.

అహ్మదాబాద్ చమన్‌పురా అనే హిందూ మెజారిటీ ప్రాంతంలో ముస్లింల గుల్బర్గ్ సొసైటీ ఉండేది. 29 బంగ్లాలు, 10 అపార్ట్‌మెంట్ భవనాల్లో ముస్లింల ఉన్నత-మధ్యతరగతి వ్యాపార కుటుంబాలు ఆ ఆవరణలో ఉండేవి. ఆ రోజు ఉదయం నుంచే ఆ ప్రాంతాన్ని హిందూ అల్లరి మూకలు చుట్టుముట్టారు. అందుకే భయంతో దాదాపు 70 మంది మాజీ కాంగ్రెస్ ఎంపీ ఎహ్సాన్ జాఫ్రీ ఇంట్లో ఆశ్రయం పొందారు. గుంపు జాఫ్రీ ఇంటి మీదికి దాడికి వచ్చింది. పోలీసులకూ, పోలీస్ కమీషనరుకూ, చివరికి ముఖ్యమంత్రికీ ఫోన్ చేశాడు జాఫ్రీ. ఎవరూ సహకరించలేదు. 'యే అందర్ కీ బాత్ హే, పులీస్ హమారే సాథ్ హే' (పోలీసులు మా పక్షం, ఇది లోగుట్టు విషయం) అన్నది అప్పటి అల్లరిమూకల నినాదం. చివరికి తనను ఏమైనా చేయండనీ, తన దగ్గర ఆశ్రయం పొందిన వారిని వదిలేయండనీ అల్లరిమూకను వేడుకున్నాడు జాఫ్రీ. కానీ వారు ఆయన్ను ముక్కలుగా నరికేసి, తగులబెట్టేయడమేకాక, మరో 69 మందిని చిత్రహింసలు పెట్టి చంపేశారు. ఈ మారణకాండ ఆరు గంటలపాటు సాగింది. అక్కడ డాబాపై దాక్కుని ప్రాణాలతో మిగిలిన ఒక సాక్షి ఆ కథనాన్ని ఈ డాక్యుమెంటరీలో చెబుతాడు. తీస్తా సెతల్వాడ్ సహాయంతో జాఫ్రీ భార్య ఈ కేసుతో న్యాయపోరాటం చేసిన విషయమూ, దాని ఫలితంగా తీస్తాను జైలుకు పంపడమూ మనకు తెలిసిందే. జాఫ్రీ కుమార్తె నిశ్రిన్ అమెరికా పౌరురాలు. ఆమె కథనూ, ఇమ్రాన్ కథనూ కలిపి *'ఈవెన్ ద క్రాస్: ఎ డివైడెడ్ గుజరాత్'* అనే డాక్యుమెంటరీ 2014లో వచ్చింది. గుజరాత్‌పై రాకేశ్ శర్మ నిర్మించిన 'ఫైనల్ సొల్యూషన్' ఈ అంశంపై మరో ముఖ్యమైన డాక్యుమెంటరీ. ఆసక్తి ఉన్నవారు సుభ్రదీప్ చక్రవర్తి నిర్మించిన *'గోద్రా తక్'*, గోపాల్ మెనన్ *'హే రాం: జెనోసైడ్ ఇన్ ద ల్యాండ్ ఆఫ్ గాంధీ'* సినిమాలు కూడా చూడొచ్చు.

కెమేరా ఎప్పుడూ అబద్ధం చెప్పదు. ఇల్లూ, భవనాలూ తగలబడి పోతుంటే పోలీసులు మరోవైపు చూస్తూ వుండటం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. 2002 ఫిబ్రవరి 27వ తారీఖున జరిగిన ఒక అధికారుల సమావేశంలో స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ – 'గోద్రా తర్వాత హిందూ ప్రతిచర్య ఉంటుంది, దాన్ని అడ్డుకోవద్దని' పోలీసులు అధికారులకు చెప్పాడట. ఆ విషయానికి సాక్ష్యం ఇవ్వడానికి స్వయంగా ముందుకు వచ్చిన హోంమంత్రి హరేన్ పాండ్యా 2003లో చాలా విచిత్రమైన పరిస్థితుల్లో చనిపోవడం అనుమానాస్పదంగా వుందని సెడ్రిక్ ప్రకాశ్ అనే మానవ హక్కుల కార్యకర్త ఈ డాక్యుమెంటరీలో అంటాడు. సంజీవ్ భట్ కూడా ఇటువంటి ఒక హైలెవెల్ మీటింగ్ ఒకటి జరిగిందని చెప్పాడు. ఆయనను ఏదో 30 యేళ్ల పాత కేసులో ఇరికించి జైలులో మగ్గిపోయేట్టు చేస్తున్న సంగతీ మనకు తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో సంజీవ్ భట్ కుమార్తె ఇంటర్వ్యూ ఉంది. 'తెహల్కా' పత్రిక జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో బాబూ బజరంగీ అనే బజరంగ దళ్ నాయకుడు రహస్య కెమేరా ముందు ఒప్పుకున్న అంశాలనూ, నరమేధం సమయంలో తనకు తాను రాణా ప్రతాప్‌లా ఫీలయ్యానని గొప్పగా చెప్పుకున్న విషయాలనూ ఈ డాక్యుమెంటరీలో పొందుపరిచారు. 'మాకు మూడు రోజుల టైం దొరికింది' అని బాబూ బజరంగీ చెబుతాడు. జనరల్ జమీరుద్దీన్ షా ఒక మిలటరీ ప్లాటూన్ ఇన్‌చార్జిగా 27 రాత్రే అహ్మదాబాద్ వెళ్లాడు. నగరం మండుతున్నట్టు అతడు విమానం నుండే చూశాడు. కానీ మిలటరీని ఎయిర్ ఫీల్డులోనే మూడు రోజులు ఆపేశారట. మోదీని కలవడానికి ఆయన ఇంటికి వెళ్తే అక్కడ ఆయన జార్జ్ ఫెర్నాండెజ్‌తో కలిసి భోంచేస్తున్నాడట! 'మీకు సకాలంలో పని కల్పిస్తాం' అని చెప్పేసి పంపించేశాడట ముఖ్యమంత్రి. ఆ సంగతిని ఆయన 'ద సర్కారీ ముసల్మాన్' అనే తన ఆత్మకథలో రాసుకున్నాడు. ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తగా అంచెలంచెలుగా మోదీ ఎదగడాన్ని ఈ డాక్యుమెంటరీ వివరించింది. ఆ భావజాలంతో ముఖ్యమంత్రి హోదాలో గుజరాత్‌లో చేసిన ప్రయోగాలను తదుపరి కాలంలో దేశ ప్రధాని అయ్యాక పెద్ద ఎత్తున ఆలిండియాలో ఎలా అమలుచేశాడో రెండో భాగంలో చూపించారు.

**రెండవ భాగం :**

గొడ్డు మాంసం అనే అనుమానంతో జార్ఖండ్‌లో అలీముద్దీన్ అన్సారీని కొట్టి చంపిన సంఘటనతో మొదలుకొని గోహత్యల రాజకీయాలను చూపుతారు ఈ భాగం మొదట్లో. 2014 మొదలుకుని నేటి వరకు చాలా పెద్ద కాలపరిధి కనుక సంఘటనలను టూకీగా స్పృశించక తప్పలేదు డాక్యుమెంటరీ నిర్మాతలకు. అన్సారీ హత్య విషయంలో మోదీ నిరసించిన వెంటనే నిందితుడు నిత్యానంద్ మహతోను అరెస్టు చేసినా, ఆ తర్వాత ఆయనను కేంద్ర మంత్రి జయంత్ సిన్హా బెయిల్‌పై విడిపించి పూలమాలలతో సత్కరిస్తాడు. ఢిల్లీ నిరసనల సందర్భంగా 23 ఏళ్ల ఫైజాన్‌ను పోలీసులు కొట్టిచంపుతారు. క్రమంగా పోలీసులు నేరంలో భాగస్వాములుగా మారడాన్ని మనం చూస్తాం.

అస్సాంలో నూర్ హుస్సేన్ అనే రిక్షావాడు తను బంగ్లాదేశీని కానని రుజువుచేసుకోలేక పోవడం వల్ల భార్యా బిడ్డలతో సహా 18 నెలలు నిర్బంధంలో గడిపాడు. అస్సాం ఎన్నార్సీ ప్రయోగంలో 8 లక్షల ముస్లింలు నాన్-సిటిజన్లుగా తేలితే అంతకంటే చాలా ఎక్కువగా 12 లక్షలమంది హిందువులు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోలేకపోయారు. దీని పరిష్కారం కోసమే కేంద్ర ప్రభుత్వం సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం) తీసుకువచ్చింది. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగాయి. మరీ ముఖ్యంగా ఢిల్లీ షాహీన్‌బాగ్‌లో చారిత్రాత్మక వ్యతిరేక వెల్లువ కనిపించింది. దీనికి ప్రతిచర్యే ఢిల్లీ అల్లర్లు. కానీ ఈసారి ట్రిక్ ఏమిటంటే బాధితుల్నే బాధ్యుల్ని చేసి వేధించడం! సిఏఏ పోరాటంలో చురుకుగా పాల్గొన్న జామియా మిలియా ఇస్లామియా విద్యార్థిని సఫూరా

జర్గర్‌ను గర్భిణీ ఐనా కూడా అరెస్టు చేశారు. "మనది ఎంత అసహ్యకరమైన సమాజం" అని ఒక ఇంటర్వ్యూలో వాపోతుంది రచయిత్రి అరుంధతీ రాయ్. జామీయా మిలియా, ఆలీగడ్ ముస్లిం విశ్వవిద్యాలయాల్లో పోలీసుల చర్యలను కూడా ఈ డాక్యుమెంటరీ చూపుతుంది. "దేశంలోని ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేలా ప్రయత్నిస్తున్నారు" అని అంటుంది సపూరా.

పొలిటికల్ సైంటిస్ట్ క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తాడు. "చైనాను బ్యాలెన్స్ చేయడానికి భారతదేశాన్ని పశ్చిమ దేశాలు ఉత్తమ మార్గంగా చూస్తున్నాయి. అందుకే వారు దేనినీ విమర్శించరు. కానీ ఈ దేశం మానవ హక్కుల జాబితాలో చాలా వెనకబడిపోతోంది. ఇక్కడ బాధితుల్నే దోషులుగా మార్చి జైళ్లలో కుక్కేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తారు.

"మోదీ రెండవసారి ప్రధానమంత్రి అయిన తర్వాత చేసిన మొదటి చర్య 'ఉపా' చట్టం సవరణ చేసి పౌరులను తీవ్రవాదులుగా ప్రకటించి కటకటాల వెనక్కి నెట్టడం. ఇక్కడ బెయిల్ పొందే అవకాశం కూడా ఉండదు" – అని చెబుతారు 'నరేంద్ర మోడీ – ది మ్యాన్, ది టైమ్స్' రచయిత, పాత్రికేయుడు నీలాంజన్ ముఖోపాధ్యాయ.

మొదటిభాగంలో మోదీని ఒక బ్రిటన్ జర్నలిస్టు చేస్తున్న ఇంటర్వ్యూ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అల్లర్లలో తన బాధ్యత లేదని నిరాకరిస్తున్నప్పుడు అతడి ముఖకవళికలు మాత్రం మనకు అసలు కథను వ్యక్తం చేస్తుంటాయి. ఆమె చివర్లో ఒక ప్రశ్న అడుగుతుంది. "మీకు మరోసారి అవకాశం దొరికితే ఏం చేసుండేవారు?" అన్న ప్రశ్నకు "మీడియాను సరిగా హ్యాండిల్ చేసుండేవాడిని" అని చెబుతాడు మోదీ. ఇప్పుడు మీడియాను 'భజన మీడియా'గా మార్చేసిన సంగతిని చూస్తున్నాం. ఇదే సంగతి జర్నలిస్ట్ సిద్ధార్థ్ వరదరాజన్ చెబుతాడు. "ఈరోజు రిపోర్టింగ్ చేయడం మరింత ప్రమాదకరంగా, కష్టతరంగా మారింది" అని అంటాడాయన. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా చైర్‌గా ఉన్న ఆకార్ పటేల్ ఎన్జీవోలను ఈ ప్రభుత్వం ఎలా అణచివేస్తున్నదీ వివరిస్తాడు.

కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితి గురించి చెబుతూ మానవ హక్కుల న్యాయవాది హబీల్ ఇక్బాల్ ఇలా అంటాడు. "ప్రజల్ని రాత్రిపూట ఇళ్ల నుండి ఎత్తుకుపోవడం, చిత్రవధ చేస్తున్నపుడు వారి ఆర్తనాదాలను ఇతరులు విని భయపడాలని ఆ అరుపులను పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా వినిపించడం చేస్తున్నారు."

డాక్యుమెంటరీని బ్యాలెన్స్‌డ్‌గా ఉంచాలని ప్రభుత్వం తరఫున రాజ్యసభ సభ్యుడు స్వపన్ దాస్‌గుప్తా మాట ద్వారా, మరో బీజేపీ ప్రతినిధి మాట ద్వారా వినిపించారు. బాగా రీసెర్చి చేయడమేకాక, నిష్పక్షపాతంగా ఉంటుంది ఈ డాక్యుమెంటరీ. ఐనప్పటికీ మోదీని బాధ్యుడ్ని చేసే అన్యాయమైన డాక్యుమెంటరీ అని ఆయన భక్తులు అరుస్తున్నారు. గుజరాత్ శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలో – భారతదేశ హోం మంత్రి (ప్రధానమంత్రికి అత్యంత సన్నిహితుడు) "2002 'అల్లర్లు' మతకలహాలు చేసే 'వారికి' 'మంచి పాఠం' నేర్పించాయనీ, నేడు 'శాశ్వత శాంతి' నెలకొందనీ" గర్వంగా చెప్పాడు. పరోక్షంగా చేసింది తామే అని చెబుతున్నాడు. వినేవారికి అర్థమౌతోంది కూడా! గాంధీ పటానికి తమ నాయకుడి దండవేసినా హృదయస్పందన గాడ్సే వైపే వుంటుందనీ వారికి తెలుసు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్ సింగ్ వాఘేలా ఓసారి మాట్లాడుతూ 'పుల్వామా సంఘటన కూడా గోద్రాలానే ముందే రూపొందించుకున్న కుట్ర' అని అన్నాడు. కాకపోతే, విద్యాధికులు కూడా విద్వేష రాజకీయాలకు తలొగ్గటం, సమర్థించడం నేటి విషాదం. అందుకే ప్రగతిశీల శక్తులకు నేడు పనిభారం ఎక్కువ! ●


## ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

### సంపుటి : 16 సంచిక : 4 ఫిబ్రవరి 1993

**సమాజంపట్ల,** జీవితంపట్ల భౌతికవాద దృక్పథం కలిగివున్న కవి చిత్రకారుడు, ఫొటోగ్రాఫర్ అయిన అలిశెట్టి ప్రభాకర్‌ను స్మరించుకుంటూ 'ప్రభాకర్ జీవితం వ్యవస్థకు మారణ శాసనం' అనే సంపాదకీయమూ, ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. సామ్రాజ్యవాద భూతా(త)ల స్వర్గం : (4) అనే ధారావాహికలో "అమెరికాలో నల్లజాతివారిపట్ల విచక్షణ"ను డా॥ కిరణ్మయి రాశారు. 1992 డిసెంబరు 6న అయోధ్యలో జరిగిన ఘటనలు ఆ తర్వాత దేశంలోని పరిస్థితులను విశ్లేషిస్తూ 'అయోధ్య ఘటనలు – లౌకికశక్తుల కర్తవ్యం' అనే వ్యాసంలో ప్రొ॥ వి. రామకృష్ణ చర్చించారు. గుగీవా థియాంగో రాసిన 'మట్టికాళ్ళ మహారాక్షసి' నవలను 'మట్టిమీద పుట్టిన మహానవల'గా గోపరాజు నారాయణరావు పుస్తక సమీక్ష చేశారు. అద్దేపల్లి రామ్మోహన్ రాసిన 'గోదావరి ప్రతిబింబం' కవిత్వం రచనని "మారుతున్న కాలానికి ప్రతిబింబం"గా డాక్టర్ అఫ్సర్ సమీక్ష చేశారు. మత విద్వేష గొడవలపై వ్యంగ్యంగా కత్తుల కాంతయ్య "ఏసురాజు పీరు పంతుల్నాయ్డు" అనే వ్యంగ్య రచననీ, ఎం.డి. మునీర్ రాసిన 'సారా మరకల ఖాకీ అంగీ' కథనూ, కామ్రేడ్ పి.కె. మూర్తి మాట్లాడగా ఉదయ్ అనువాదం చేసిన "శ్రామిక బొంబాయి – మతోన్మాద బొంబాయి" ఉపన్యాస భాగాన్నీ, కృష్ణ రాసిన 'గిరిజన సంక్షేమం' గల్పికనూ ప్రచురించారు. యం. నిరంజన్ రాసిన 'ప్రజలు ప్రతిహింసకు దిగాల్సిందే', బండ్ల మాధవరావు రాసిన 'చీకటి', ఎస్వీ రాసిన 'శవం' కవితలనూ, మిత్ర రాసిన 'ఢిల్లీ గద్దె కొరకు', తిరునగరి రామాంజనేయులు రాసిన 'మనమంతా మానవులం – మనదంతా ఒకే కులం', ప్రతిన్ రాసిన 'అస్తమించని సూర్యుడా' పాటలనూ ప్రచురించారు. అందిన పుస్తకాలు 'స్వీకారం' శీర్షికలోనూ జనసాహితి కార్యక్రమాల 'చైతన్యవాహిని'ని, రెండవ కవరు పేజీపైన చైతన్యప్రకాశ్ రాసిన 'వారెవరు' కవితనూ, కవర్‌పేజీపైన డా॥ మిరియాల రామకృష్ణ రాసిన కవిత 'నమ్మకం ముందు కాదు'నూ, నాల్గవ కవర్‌పేజీపై అలిశెట్టి ప్రభాకర్ రాసిన "సూర్యుడే నా ముఖచిత్రం" కవితనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : రూ. 5/- ●

## జాతీయ అక్షరయోధులు



# డి.జయకాంతన్

**( 1934 - 2015)**

**11**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# జయహో జయకాంతన్

సినిమాలకు జాతీయ అవార్డులు
రచనలకు అకాడమీ రివార్డులు
జయకాంతన్ విజయకాంతులు
సాహిత్య, చలనచిత్ర రికార్డులు

**"రచయితకు సమగ్ర దృక్పథం ఉండాలి. అతను ప్రస్తుతంవున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. అన్ని అంశాలను సమతుల్య పద్ధతిలో అంచనా వెయ్యాలి. సెలక్టివ్ వ్యూ తీసుకోవడం తప్పు అవుతుంది. వాస్తవిక విధానం అవసరమౌతుంది" అంటూ రచయిత గురించి రచన గురించి చెప్పిన ప్రముఖ తమిళ సాహితీవేత్త దండపాణి జయకాంతన్, పాత్రికేయుడు, వక్త, సినీ నిర్మాత, దర్శకుడు, సామాజిక కార్యకర్త. జె.కె.గా ప్రసిద్ధులు.**

ఐదవగ్రేడ్ వరకూ చదివారు. జీవన పోషణకోసం మద్రాసు చేరుకుని చిన్నచిన్న ఉద్యోగాలుచేసి కమ్యూనిస్టుపార్టీ ముద్రణాలయంలో కంపోజిటర్‌గా చేరారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరారు.

సిపిఐ సాన్నిహిత్యంతో కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టుపార్టీ ప్రోత్సాహంతో రచనలు ప్రారంభించారు. కమ్యూనిస్టుపార్టీ క్రియాశీల సభ్యుడయ్యాక ప్రపంచ సాహిత్యం, సంస్కృతి, ఆర్థిక విషయాలు, రాజకీయాలు, జర్నలిజం మొదలైన విషయాల అవగాహనతో ప్రముఖ రచయితగా ఎదిగారు. ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా మొదట్లో కమ్యూనిస్టు పత్రికలకు, కమ్యూనిస్టు అనుకూల పత్రికలకు, తరువాత అన్ని ప్రధాన పత్రికలకు ప్రగతిశీల రచనలు చేశారు. వీరిపై బాల్యదశలో సుబ్రహ్మణ్య భారతి ప్రభావం ఎక్కువగా ఉండేది.

వీరి పలుకథలను మధురాంతకం రాజారాం తెలుగులోకి అనువదించారు. 'స్వాతి' మాసపత్రికలో 'పంచవటి' పేరుతో బాపు బొమ్మలతో ధారావాహికగా అచ్చయ్యాయి. 60 ఏళ్ల సాహిత్య ప్రయాణం 40 నవలలు, 200 చిన్నకథలు, 2 స్వీయచరిత్రలు రాశారు.

1964లో సినిమాల్లోచేరి దర్శకత్వం, కోప్రొడక్షన్ రంగాలలో పనిచేశారు. 1965లో తన నవలను సహనిర్మాత, దర్శకుడిగా 'ఉనై పోల్ ఒరువన్' సినిమా పేరుతో మురికివాడ వాసుల కష్టాలను తెరకెక్కించారు. ఆ సినిమా ఆర్థికంగా ఫ్లాపైనా, ఉత్తమ ఫీచర్‌ఫిల్మ్ అవార్డు గెలుచుకుంది. రష్యాలో ప్రదర్శన పొందింది. 'యూరుక్కగ అరుదాన్' ఆధారంగా ప్రముఖ గుణచిత్ర నటుడు నగేష్ హీరోగా మరోచిత్రం తీశారు.

సాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'శిల నేరంగళిల్ శిల మణి తరగల్' నవల సినిమాగా జాతీయ అవార్డు అందుకుంది. ఇంకా జయకాంతన్ రచనలు 'నడిదై నాదగం పార్కిరల్', 'యారుక్కగ అజుదాన్' సినిమాలుగా వచ్చాయి.

సాహిత్యఅకాడమీ, జ్ఞానపీఠ, సోవియట్‌లాండ్ నెహ్రూ, ప్రభుత్వ పద్మవిభూషణ్, రష్యా ప్రభుత్వ 'ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్షిప్' వంటి పురస్కారాలు అందుకున్నారు.

తెలుగులో రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావుల వలె తమిళంలో విప్లవ నవలలూ, కథలూ రాసేవాడిగా శ్రీశ్రీ ప్రశంసించిన దండపాణి జయకాంతన్ 1934 ఏప్రిల్, 24న కడలూరు మంజకుప్పంలో జన్మించారు. 2015 ఏప్రిల్, 8న మద్రాసులో కన్నుమూశారు. ●

## పుస్తక పరిచయం


# 'అజాద్‌నగర్'

### (21వ శతాబ్దపు బానిస తిరుగుబాటు కథ)

పరిచయకర్త : జి.వి. భద్రం ఇంగ్లీషు మూలం : లారా టి. మర్ఫీ

*(రచయిత్రి లారా టి. మర్ఫీ ఇంగ్లాండ్‌లోని షెఫీల్డ్ హాలెం విశ్వవిద్యాలయంలో 'మానవహక్కులు – సమకాలీన బానిసత్వం' అనే శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. వివిధ దేశాలలో ఈనాటికీ రకరకాలుగా కొనసాగుతున్న బానిసత్వ వ్యవస్థపై తన పరిశోధనలను పుస్తకాలుగా ప్రచురించారు. ఈ పుస్తకం 2021 సెప్టెంబర్ 7న విడుదలైంది.)*

**గ్లోబల్** బానిసత్వసూచిక (2017) ప్రకారం ప్రపంచమంతటా 4 కోట్లమంది ప్రజలు బానిసత్వంలోకి బలవంతంగా త్రోసివేయబడి బానిసలుగా మగ్గుతున్నట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా వేసింది. కోవిడ్ మహమ్మారి సృష్టించిన విలయం, సంక్షోభాల ఫలితంగా ఆధునిక బానిసత్వంలోకి నెట్టబడిన వారి సంఖ్య మరింత గణనీయంగా పెరుగుతోంది.




ఈ బానిసత్వం పలు రూపాలలో సాగుతోంది. మారిషస్ దీవులలో హరాటిన్ జాతికి చెందిన ప్రజలను బానిసలుగా నిర్బంధించారు. వీరు గతకాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని తోటల్లో చరాస్థిగా పరిగణింపబడిన బానిసల్లాగా, బానిసత్వాన్ని అనుభవిస్తున్నారు. దక్షిణ ఆసియాకు చెందిన వలసలకు వెళ్ళే ప్రజల (వలస కార్మికులను)ను, కిడ్నాప్ చేసి వారిని బందీలుగా పట్టుకొని సంవత్సరాల తరబడి చేపల వేట నావలపై బానిసపని చేయించుకొంటున్నారు. వీరికి సముద్రంలో పడి చావటంకన్నా బానిసత్వం నుండి తప్పించుకొనే మార్గాంతరమేమీ లేదు. అల్బేనియా దేశంలోని నిరుద్యోగ మహిళలను, సంపన్నులయిన యూరోపియన్ల కుటుంబాలలో యింటిపని చేసే ఆయాలుగా నియమించుకొని, తర్వాత వారిని వేశ్యా వ్యాపారంలోకి త్రోసివేస్తున్నారు. కాంగోలో బాలలను (బాలురను, బాలికలను) బలవంతంగా సైన్యంలోకి నియమించి వారిని హింసాత్మక అంతర్యుద్ధాలలో బలిపశువులను చేస్తున్నారు. గని త్రవ్వకపు పనిలో నిర్బంధంగా ఎటువంటి కూలి చెల్లించకుండా పనిచేయించుకొంటున్నారు. అమెరికా దేశంలోని న్యూ ఓర్లియాన్సు పట్టణంలో అయితే, కత్రినా తుపాను అనంతరం చేపట్టబడిన పునర్నిర్మాణ పనులలో వలస కార్మికులను నిర్బంధించి – బందీలను చేత, ఎటువంటి కూలి చెల్లించకుండా పనిచేయించుకొన్నారు. చైనా దేశంలోని, క్సిన్ జియాంగ్ ప్రాంతంలో యుఘర్స్ చేసి పాశ్చాత్య దేశాల మార్కెట్లకు పంపేందుకు అవసరమైన చౌకదారు ఉత్పత్తులు ఎగుమతిచేసే బట్టల తయారీ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ, క్రీడాకారుల దుస్తులు, క్రీడాకారుల బూట్లు తయారీ కంపెనీలు అక్రమ నిర్బంధ శిబిరాలలో బలవంతంగా పనిచేయించుకోవటమన్నది గణనీయంగా పెరిగిపోయింది. ఈరకంగా వివిధ దేశాలలో, పలు రూపాలలో కొనసాగుతున్న బానిసత్వం యొక్క ఆచరణ ప్రధానంగా బలవంతంగా, దౌర్జన్యంగా ఎటువంటి కూలి చెల్లింపకుండా, ఎటువంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యివ్వకుండా నిర్బంధంగా పనిచేయించుకొనే రూపంలో కొనసాగుతూనే వుంది. ఈ పుస్తక రచయిత్రి పదిహేను సంవత్సరాలపాటు ఇండియా, నైజీరియా, ఘనా, అమెరికా, ఇంగ్లాండ్‌లలో పర్యటించి ఆయాదేశాల్లో బానిసలుగా వున్నవారి గురించీ, స్వేచ్ఛకోసం వారు చేసిన పోరాటం గురించి అధ్యయనం చేశారు.

ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పబడుతున్న మన భారతదేశంలో కూడా ఈ తరహా బానిసత్వం యధేచ్ఛగా కొనసాగుతూనే వుంది. రాళ్ళుకొట్టే క్వారీల్లో, ఇటుకబట్టీల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, నిర్మాణ రంగంలో, దుస్తుల తయారీరంగంలో, గాజులు – కార్పెట్లు తయారీ రంగాలలో, ఆధునికంగా తలెత్తుతున్న వివిధ ఉత్పత్తిరంగాల్లో, కార్మికులు ప్రధానంగా మహిళలు, బాలలు ఏవిధంగా నిర్బంధింపబడి, కట్టుబానిసలుగా పనిచేస్తున్నారో, అప్పుడప్పుడు

పరిపాలనాధికార శాఖలు వారిని ఏరకంగా ఆధునిక బానిసత్వం నుండి 'విముక్తి' చేస్తున్నారో అన్న ఘటనలను గురించిన వార్తలు మనం చదువుతూనే వున్నాం. అయినప్పటికీ, మనదేశపు గ్రామీణ ప్రాంతాల్లో పాతుకుపోయిన, తరతరాల నుండీ నిరాఘాటంగా సాగుతున్న కట్టుబానిస విధానం, దానియొక్క విస్తృతి, దుర్మార్గాలు, వ్యవస్థీకృతమైన అర్ధ-ఫ్యూడల్ ఆచరణల యొక్క స్వభావ, స్వరూపాలను వాటి లోతులను, వివిధ రూపాలను మనం అధ్యయనం (విస్తృతంగా) చేసి, తెలుసుకోవల్సింది ఎంతో వుంది.

ఈ వ్యవస్థీకృత బానిసత్వం గురించి లారా టి. మర్ఫీ ఇంగ్లీషుభాషలో వ్రాసిన - "అజాద్‌నగర్ - 21వ శతాబ్దపు బానిస తిరుగుబాటు కథ" అనే ఈ పుస్తకం, నేటి ఆధునిక శకంలో, మన 'పవిత్ర' భారతదేశంలో, 'సర్వేజనా సుఖినోభవంతు' అనే నినాదంతో, "వసుధైక కుటుంబపు" నిర్మాణ కార్యాచరణ పేరిట రాజ్యమేలుతున్న అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో, అమానుషంగా ఎటువంటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా కోట్లమంది అణగారిన ప్రజలు ఏవిధంగా నిర్బంధింపబడి బానిసలుగా బ్రతుకుతున్నారో, ఈ 'కట్టుబానిస' విధానం సజీవంగా సాగుతూ, వర్ధిల్లటానికి పాలకులు, పాలక ప్రభుత్వాలూ, పాలకవర్గాలూ ఏవిధంగా దోహదకారులుగా వున్నారో, అటువంటి నిర్బంధ పరిస్థితుల నుండి, బానిసత్వం నుండి, విముక్తిని, స్వేచ్ఛను కోరుకుంటూ, ఆయా ప్రజాసమూహాలు, ఏవిధంగా తిరుగుబాట్లు చేస్తున్నాయో అనే విషయాలను సునిశితంగా అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. తగు కార్యాచరణకు ప్రేరేపిస్తున్నది. మనదేశంలో కొనసాగుతున్న కట్టుబానిస విధానానికి కారణమైన మౌలిక సమస్యను, దాని పరిష్కార ఆవశ్యకతను స్పష్టం చేస్తుంది.

భారతదేశంలోని అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్. బి.జె.పి. నాయకుడు యోగి ఆదిత్యనాథ్ పరిపాలిస్తున్న రాష్ట్రం యిది. ఈ రాష్ట్రంలో దేశంలోని పేదలలో అత్యధిక సంఖ్యాకులు, ప్రపంచపు పేదలలో 8 శాతంమంది ప్రజలు నివసిస్తునారు. వీరిలో అత్యధికులు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనంతగా, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న ప్రజలు యీ రాష్ట్రంలోనే వున్నారు. దేశంలో ప్రజలు ఆరోగ్యంతో నివసించటానికి వీలులేని అతిపెద్ద అనారోగ్యకరమైన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ వుంది. ఇక్కడ ప్రజలు అనవసరంగా టైఫాయిడ్, క్షయ, డయేరియా లాంటి రోగాలవాతపడి చనిపోతూ వున్నారు. ఇక్కడి పేద ప్రజలు అన్ని రూపాలలోనూ దోపిడీకి గురి అవుతున్నారు. దేశమంతటా జరుగుతున్నట్లుగానే, ఈ రాష్ట్రంలో కూడా 'గిరిజనులు' దారుణమైన దోపిడీ, హింస, అవమానాలు, నిర్బంధ కట్టుబానిసత్వం, నిరాదరణలను అనుభవిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట తమ స్వస్థలాల నుండి వెళ్ళగొట్టబడుతున్నారు. వీరి స్వంత ఆస్థి అయిన అడవిభూముల నుండి వీరిని నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. వీరి ఆస్థులు బలవంతంగా లాక్కోవడంతో (దురాక్రమణపాలై), ఆస్థిలేని నిరుపేదలైన నిరాశ్రయులుగా మారుతున్నారు. వీరికి నిజమైన అర్థంలో చట్టరక్షణ, వీరి ఆస్థులకు చట్టపరమైన రక్షణ, చట్టపరమైన న్యాయకల్పన లేకపోవటంతో, అనాధలై అవమానాలకు నిరాదరణకు గురవుతూ పలు రూపాలలో దోపిడీకి గురవుతూ, నిర్బంధంగా కట్టుబానిసలుగా మారుతున్నారు. వేల సంవత్సరాలుగా భారత ఫ్యూడల్ - అర్ధఫ్యూడల్ సామాజిక వ్యవస్థలు వీరికి కనీసమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా అందకుండా చేస్తున్నాయి.

1947లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా 1950లోనే దళిత నాయకుడైన బి.ఆర్. అంబేద్కర్ చేతనే ప్రధానంగా రచింపబడిన 'భారత రాజ్యాంగం' కట్టుబానిస విధానం నిర్మూలించాలని సూచించినా 'గిరిజనుల' జీవన పరిస్థితులు నానాటికీ క్షీణిస్తూ, దుర్భరమైన కట్టుబానిసలుగా మారుతున్నారు. నేటికీ గిరిజనులకు స్వాతంత్ర్యం రానేరాలేదు.

ఈ కఠిన వాస్తవాలను, నిరూపించేదే యీ 'అజాద్‌నగర్' 21వ శతాబ్దపు బానిసల తిరుగుబాటుకు చెందిన యధార్ధ వృత్తాంతం. ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని, సోన్‌బర్సా ప్రాంతంలోని 'కోల్' జాతి గిరిజనులు, కట్టుబానిసత్వం అమలుచేస్తున్న 'బానిస యజమానుల' నుండి విముక్తిని పొందటానికి జరిపిన తిరుగుబాటుకు చెందిన వాస్తవ గాథ.

ఇక్కడ నివసించే 'కోల్' జాతి ప్రజలు, సాంప్రదాయకంగా అడవుల్లోనూ, ప్రధానంగా వ్యవసాయం జరిగే ప్రాంతాలలోనూ నివసిస్తారు. ఈ కోల్ జాతి గిరిజనుల యొక్క మూలం రామాయణకాలం (బహుశా 3,000 క్రీస్తుపూర్వపు కాలం) నుండే కనబడుతుంది. 1770 నుండి ప్రారంభమయిన తూర్పు ఇండియా కంపెనీ వారి బ్రిటీష్ పాలనాకాలం నుండీ 'భూమిసమస్య'పై 'అధికారిక పన్నులకు' వ్యతిరేకంగా యీ కోల్ జాతి ప్రజలు అనేకమైన ఆందోళనలు జరిపారు. 1831-32 కాలంలో, నాలుగు నెలలపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధంగా (సాంప్రదాయక ఆయుధాలతో) తిరుగుబాటు జరిపిన వీరోచితమైన చరిత్ర గలిగినవారు యీ కోల్‌జాతి గిరిజనులు. ఈ చారిత్రక తిరుగుబాటు, ప్రస్తుతం నేడు జార్ఖండ్ రాష్ట్రంలోని ఛోటా-నాగపూర్ ప్రాంతంలో జరిగింది.

వడ్డీ వ్యాపారస్తులు, భూ కౌలుదారులు, ప్రభుత్వ అధికారులూ తమపై సాగించే దోపిడీ, పెత్తనం, అణచివేత, అధిక పన్నులు, బలవంతపు వసూళ్ళకు వ్యతిరేకంగా గిరిజనులు తిరుగుబాటు చేశారు. తమకు అందుబాటులో వున్న వ్యవసాయ పనిముట్లు విల్లు - బాణాలు కాగడాలను చేపట్టి యీ తిరుగుబాటు జరిపారు. అయితే, తన సైనిక బలంతో బ్రిటిష్ ప్రభుత్వం వీరి తిరుగుబాటును అణచివేసింది. బ్రిటిష్ పాలకులు - ప్రభుత్వం అవలంబించి, అమలుపరచిన భూపంపక (పునర్) పథకం వలన (యీ పథకాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ అమలుపరచింది) రాజులు, ధనవంతులైన బ్రాహ్మణులు, ముస్లిం, సిక్కు వ్యాపారస్తులు భూములను పొందారు. అదేసమయంలో కోల్ జాతి గిరిజనులు వేల గ్రామాల్లో భూమిలేని నిర్వాసితులుగా చేయబడ్డారు. గిరిజనులకు తమ స్వంత భూమిని, తమదిగా నిరూపించుకొనే అధికారిక

పత్రాలు లేకపోవటంవలన, వీరి భూమిని సంపన్నులు బలవంతులు దురాక్రమించుకొన్నారు. 1951లోనే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జమిందారీల రద్దు – భూసంస్కరణల చట్టం చేసినా, ఇందిరాగాంధీ ప్రభుత్వ కాలంలో "కట్టుబానిస విధానం రద్దు చట్టం – 1976 చేసినా, ఆ తర్వాతి నలభై సంవత్సరాల అనంతరం, కేంద్ర ప్రభుత్వపు అటవీ హక్కుల చట్టం చేసినా, యివేవీ గిరిజనుల భూ యాజమాన్య హక్కులనూ పరిరక్షించలేకపోయాయి. గిరిజనులను 'కట్టుబానిసలు'గా నిర్బంధించే వ్యవస్థను రద్దు చేయలేకపోయాయి. కాకపోతే యీ చట్టాలన్నీ కేవలం, స్వల్ప భూ యాజమాన్యం గల, వ్యవసాయదారులైన పేద రైతాంగపు గిరిజనుల ఓట్లను దండుకోవటానికి చేసిన 'రాజకీయ హస్తలాఘవం'గా ఆచరణలోనూ, గిరిజనుల అనుభవంలోనూ రుజువైంది.

ఈ క్రమంలో జరిగినదే అజాద్‌నగర్, బానిసల (గిరిజన) తిరుగుబాటు ఘటన :

దక్షిణ ఉత్తరప్రదేశ్‌లోని సోంబర్సా ప్రాంతంలో వందల సంవత్సరాలుగా భూస్వాములే రాజ్యాన్ని ఏలుతూ, పెత్తనాన్ని చలాయిస్తున్నారు. ఈ భూస్వాములే వడ్డీ వ్యాపారులుగా వ్యవహరిస్తూ కోల్‌జాతి గిరిజన ప్రజలకు కొద్దిపాటి మొత్తాలు అప్పులు యిచ్చి, వారిని తరతరాలు కట్టుబానిసలుగా చేసుకొని, వారిచేత బలవంతంగా, నిర్బంధంగా ఎటువంటి కూలి చెల్లింపబడని దాసులుగా పని చేయించుకొంటున్నారు.

ఉదాహరణకు కోల్ జాతి గిరిజనుడైన రామ్‌ఫాల్ యొక్క తల్లిదండ్రులు ఎన్నో సంవత్సరాలుగా స్థానిక భూస్వామి యొక్క పొలాల్లో కూలిలేని పాలేర్లుగా పనిచేస్తూ, ఆ భూస్వామి పొలాల్లో పంటలు పండించి, భూస్వామికి అందజేస్తున్నారు. అందుకు బదులుగా ఆ భూస్వామి వారికి కేవలం ఒక కిలోగ్రాం బియ్యాన్ని, ఒక నెల కాలానికి పారితోషికంగా చెల్లించాడు. నెల్లాళ్ళపాటు, ఆ కిలోగ్రాం లేదా ఆపైన ఒక గుప్పెడు బియ్యంతోనే రాంఫాల్ తల్లిదండ్రులు, ఐదుగురు సంతానంతో కూడిన కుటుంబం బ్రతకాల్సిన పరిస్థితి. అందువలన వారు తమ యింటి గుడిసె పరిసరాల్లో పెరిగే పళ్ళూ, ధాన్యాలు అడవి నుండి పోగుచేసుకొని తెచ్చుకొన్న కాయలు, దుంపలు తింటూ కుటుంబాన్ని గడిపేవారు.

రాంఫాల్ చిన్నపిల్లవానిగా వున్నప్పుడు తీసుకొన్న కొద్ది మొత్తం – కొన్ని వందల రూపాయలు. ఆ అప్పు ఆ కుటుంబాన్ని కట్టుబానిసలుగా నిర్బంధించబడటానికి కారణమైంది. ఆ గిరిజనులు చదువుకోనివారు కావటంతో ఆ అప్పుకు అక్రమ వడ్డీ చేరి వందల రెట్లు పెరిగిపోయింది. వారు అప్పు తీర్చలేకపోవటంతో, భూస్వామి, ఆ అప్పుకుగాను, వారి మట్టిగోడల పూరిల్లును స్వాధీనం చేసుకొన్నాడు. దానితో వారు నిరాశ్రయులై, తిరిగి యిల్లు కట్టుకోవడానికి అప్పుచేసి, కొత్తగా కట్టుకొన్నారు. పొలాల్లో పని తగ్గిపోవటంతో, ఆ అప్పును తీర్చటం కోసం, భూస్వామికి చెందిన రాతి క్వారీల్లో కట్టుబానిసలుగా నిర్బంధింపబడ్డాడు. ఆ రకంగా అతడి కుటుంబం, తాత ముత్తాతల కాలం నుండి, తాత, తండ్రి తానూ తమ కుటుంబసభ్యులూ తరతరాలుగా కట్టుబానిసత్వంలో వున్నారు.

అదేవిధంగా ఛోటీ (చిన్నా) అనే మహిళ మొదట్లో కట్టుబానిస కాదు. ఆమె యవ్వనవతిగా వుండి పెళ్ళి చేసుకొంటూ పెళ్ళి ఖర్చుల కోసం స్థానిక భూస్వామి నుండి కొంత మొత్తం అప్పు తెచ్చుకొంది. ఆ మొత్తం వడ్డీలో కలిపి 5,000 తర్వాత 10,000 ఆ తర్వాత 20,000 ఆ తర్వాత 30,000 రూపాయలకు అనూహ్యంగా పెరిగిపోయింది. ఇంతటి భారీ మొత్తం చెల్లించలేని ఆమె ఆ భూస్వామికి చెందిన రాళ్ళు కొట్టే క్వారీలో కట్టుబానిసగా మారిపోవలసి వచ్చింది. 35 సంవత్సరాలు వయస్సు వచ్చేనాటికే ఆమె శరీరం వడలిపోయి వృద్ధురాలిగా మారిపోయింది. క్వారీలో పనిచేస్తున్నందుకుగాను, ఆ భూస్వామి ఆమెకు ఒకరోజు తినటానికి సరిపడే బియ్యం మాత్రమే కూలిగా యిస్తూ, యీ రకంగా ఆమె చావకుండా మర్నాడు పనిచేసేందుకు వీలుగా బ్రతికిస్తూ ఆమె చేత పనిచేయించుకొంటున్నాడు. ఇంతకు మించి ఆమెకు ఏమీ చెల్లించడు. కట్టుకోవటానికి బట్టలు యివ్వడు. ఉండటానికి ఆశ్రయం యివ్వడు.

ఆ ప్రాంతంలోని భూస్వాములు ప్రభుత్వాధికారులతోనూ, పోలీసు అధికారులతోనూ స్నేహం చేస్తూ, వారిని తమ ప్రభావంలో వుంచుకొంటారు. అందువలన, వారి నిర్బంధ కట్టుబానిస విధానానికి వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదులను వారు పట్టించుకోకపోగా, బాధితులైన ఫిర్యాదీదారులపైనే జులుం చూపిస్తారు. ఇంచుమించుగా ఆ ప్రాంతంలో నివసించే కోల్ జాతి గిరిజనులందరి విషాద జీవిత గాథలు యివే! వారంతా నిర్బంధంగా కట్టుబానిసలుగా మారినవారే!

అదేవిధంగా యీ ప్రాంతానికి చెందిన పరదేశ్ అనే వ్యక్తి కూడా భూస్వాముల దాష్టీకానికీ, దుర్మార్గానికి బలయినవాడే! అతడికి కొద్దిగా వున్న స్వంతభూమిని, భూస్వామి కుటుంబం, అతడి పొలంలోకి నీరు పారకుండా ఆపివేసి, పంట పండించటానికి వీలు లేకుండా చేసి ఆ భూమిని ఆక్రమించుకొంది. అన్యాక్రాంతం అయిన తన స్వంత భూమిని (చిన్న మడిచెక్క) అతడికి తిరిగి యిప్పించటానికి ఏ కోర్టులుగానీ, స్వయం న్యాయవాద సంస్థలు కానీ, సహాయంగా రాలేదు. అవి భూస్వాములతో సత్సంబంధాలు కలిగి వుండటం వలన, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడేవారికి తోడ్పడటానికి నిరాకరించాయి.

ఈ ప్రాంతంలో, ఒ.బి.సి. కులానికి చెందిన పటేల్ కులానికి చెందినవారు భూస్వాములుగా వుండటం అన్నది ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. పటేళ్ళను, అగ్రకులాలవారిని సంపన్నులు చేసి, భూస్వాములుగా మార్చే, అధికార వ్యవస్థ యిక్కడే వేళ్ళూనుకుపోయింది.

ఈ వ్యవస్థ స్వభావరీత్యా కట్టుబానిసలుగా నెట్టబడి, తమను నిర్బంధించిన బానిస యజమానులైన భూస్వాముల దౌర్జన్య, దుర్మార్గాల నుండి విముక్తి పొందటం కోసం, స్వాతంత్ర్యం పొందటం కోసం, కోల్‌జాతి గిరిజనులకు పోరాటం అనివార్యమయింది.

ఆ పరిస్థితుల్లో క్షత్రియ కులానికి చెందిన పేద రైతు కుటుంబం నుండి వచ్చిన కంచుకి అని పిలవబడే ఉదయ్, తాను యూనివర్శిటీ విద్యార్థిగా వున్న కాలంలో జయప్రకాష్ నారాయణ యొక్క "పరిపూర్ణ విప్లవ" ఉద్యమానికి ఆకర్షితుడై, ఆ ఉద్యమం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఆ అనుభవంతో అణచబడ్డ వర్గాలకు సేవ చేయాలని సంకల్పించాడు. 1994లో ఒ.బి.సి. కులాలకు చెందిన "సంకల్ప" అనే స్వచ్ఛంద సంస్థలో చేరాడు. ఆ క్రమంలో అతడు ఆ సంస్థ కార్యకర్తగా శంకరఘర్ బ్లాక్ ప్రాంతంలో కోల్ గిరిజనుల మధ్య పనిచేయటానికి వచ్చారు. సోన్‌బర్సా ప్రాంతం ఆ బ్లాక్ లోనిది.

అతడు తన కార్యకలాపాల వలన పటేల్ కులంవారికి ఏ విధమైన సమస్యా తలెత్తదని వారిని ఒప్పిస్తూనే, మరోవైపు భూస్వాముల భూముల్లోనూ, క్వారీల్లోనూ కట్టుబానిసలుగా పనిచేస్తున్నవారిని చైతన్యపరిచే కృషికి పూనుకొన్నాడు. అతడు వారి మధ్యనే తిరిగి, యింటింటికీ (గిరిజనుల) వెళ్ళి వారిని ప్రోగు చేసి అర్ధరాత్రి పూట సమావేశాలు నిర్వహించాడు. 1998లో సంకల్ప స్వచ్ఛంద సంస్థ, ఆ ప్రాంతాన్ని సందర్శించవలసిందిగా ప్రముఖ క్రిమినల్ డిఫెన్సు లాయరు అమరసేన్‌ను ఆహ్వానించింది. అతడు జిల్లా కట్టుబానిస నిర్మూలనా నిఘా కమిటీలో సభ్యుడు అంతవరకూ నిజంగా కట్టుబానిస విధానం కొనసాగుతోందని నమ్మని అమర్‌సేన్ సోల్‌బర్సా ప్రాంతాన్ని సందర్శించి, కోల్‌జాతి గిరిజనులతో (కట్టుబానిసలుగా బ్రతుకుతున్న) మాట్లాడాడు. కోల్ జాతి గిరిజనులు తమ సమస్యకు పరిష్కారంగా భూమిపై తమకు హక్కులు ఇవ్వాలని తెలియజేయటంతోపాటు, వారు తమ స్వేచ్ఛకు మార్గం రాతి క్వారీని తమ స్వంతం చేసుకోవటంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో 500 మంది కోల్ జాతి కట్టుబానిసలు పాల్గొన్నారు. వారిలో కొందరు తమ అప్పును తీర్చటానికి తాము 20 నుండి 30 సంవత్సరాలుగా కట్టుబానిసలుగా క్వారీల్లో పనిచేస్తున్నారు. కొంతమంది ఎన్నడో మరణించిన తమ తల్లితండ్రులు చేసిన అప్పులు తీర్చటానికి కట్టుబానిసలుగా పనిచేస్తున్నారు. చూపులేని గుడ్డివారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నవారు పనిచేస్తున్నారు. ఎనిమిది సంవత్సరాల వయస్సున్న బాలలూ పనిచేస్తున్నారు. ఇలా పనిచేస్తూ ఎందరో గాయాలపాలై, అనారోగ్యంపాలై చనిపోయారు.

ఈ విషయాలన్నీ లాయర్ అమర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు తెలియచేశాడు. యీ కట్టుబానిస విధాన సమస్యకు పరిష్కారం ఆ కోల్ జాతివారికి కొంత భూమిని కేటాయించటమే అవుతుందనే అభిప్రాయాన్ని అతడు ప్రకటించాడు.

దీని ఫలితంగా, ఆ జిల్లా జడ్జి, బర్గారీ ప్రాంతంలో కల 60 బీఘాల (24 ఎకరాల) ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, అది ఆ కోల్ జాతి ప్రజలకు కొంతకాలానికి కౌలుకు యిచ్చేందుకు ఏర్పాటుచేశాడు. అయితే అందుకుగాను వారు ముందుగా 14,000 రూపాయలు చెల్లించాల్సి వచ్చింది. అంత పెద్ద మొత్తం తమ వద్ద లేకపోవటంతో, కోల్ గిరిజనులు తమ స్వంత పశువులను, యితర వస్తువులను అమ్మి 10,000 రూపాయలు ప్రోగుచేశారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు అప్పులు యిచ్చేవిధంగా 'సంకల్ప' ఏర్పాటుచేసింది. ఇదేవిధంగా 5 ఇతర సమష్టి గ్రామాలకు ప్రభుత్వం భూమిని కౌలుకు (లీజ్‌కు) యిచ్చింది.

అయితే యిందుకు భూస్వాములు అంగీకరించక, ప్రతీకారచర్యలు చేపట్టారు. తమ పొలాల్లో పనిచేయటానికి నిరాకరించిన కోల్‌జాతి ప్రజలను, పిల్లలను తమ పొలాలగుండా మార్కెట్లకు, స్కూళ్ళకు లేదా తమ స్వంత క్వారీలకు వెళ్ళేవీలు లేకుండా నిషేధించారు. కోల్‌జాతి గిరిజనులు సమావేశాలు, సభలూ నిర్వహించుకోవడాన్ని వ్యతిరేకించారు. ఆ సమావేశాలకు హాజరయితే చంపేస్తామని బెదిరించారు. వారు సామూహిక చెరువుల్లో చేపలు పట్టకుండా, నీరు తెచ్చుకోకుండా ఆంక్షలు పెట్టారు.

అయినా యిప్పుడు "స్వేచ్ఛ" పొందిన గిరిజనులు వాటిని లక్ష్యపెట్టకుండా, గుంపులుగా వారి పొలాలగుండా ప్రయాణిస్తూ చెరువుల్లో నీళ్ళు తెచ్చుకొంటూ, చేపలు పడుతూ, భూస్వాముల గూండాలు తమపై భౌతికదాడులు జరపకుండా తమను, తాము రక్షించుకొన్నారు. వందలమంది బృందంగా ఏర్పడి తమను రోడ్లపై ఆపకుండా తప్పించుకొని సమావేశాలకు, సభలకు తరలివెళ్ళారు.

అయితే, భూమి లీజు కోసం, దరఖాస్తు చేసుకొన్న కొన్ని గ్రామల వారికి ప్రభుత్వం భూమిని కౌలుకు యివ్వలేదు. మరోవైపు ఆ దరఖాస్తుదారులను పనిలోకి తీసుకోకుండా భూస్వాములు ఆపివేశారు. అందువలన ఆ గ్రామాల గిరిజనులు పస్తులు వుండాల్సి వచ్చింది. అటువంటి సందర్భాలలో యితర గ్రామాల గిరిజనులు వారికి తిండిబెట్టి, ఆశ్రయం కల్పించి ఆదుకొన్నారు.

ఈ విజయాన్ని చూపిన అమర్ విదేశాలలోని స్వచ్ఛందసంస్థలకు ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థలకు తెలియపరచి, వారి నుండి నిధులను, ప్రచార సహాయాన్ని పొందే ఏర్పాట్లుచేశాడు. అంతర్జాతీయంగా యీ వివరాలు ప్రచారం జరగటానికి ఏర్పాట్లు చేశాడు.

శంకర్‌ఘర్‌లోనే, తమ హక్కులు సాధించుకొన్న ప్రజలతో కంచుకి వుండిపోయాడు. గిరిజనులతో కలసి, అధికసంఖ్యలో వున్న గిరిజనులు, భూస్వాముల అధికారాన్ని - ప్రాభవాన్ని తగ్గించే పథకాలను, ఉపాయాలను తయారుచేయటంలో మునిగిపోయాడు.

పోలీసుల సహాయం లేకుండా, ఒక "హల్లాబోల్" (గర్జన)ను - ఒక శాంతియుత ఆందోళనను - జరపటానికి నిర్ణయించారు. శంకర్‌ఘర్ ప్రాంతమంతటి కోల్‌జాతి గిరిజనులు, భూస్వాముల రాతిగనుల్లో పని మానివేసి, రాజాగారి స్వంతభూముల్లో గల రాతి క్వారీల్లో చట్టవిరుద్ధంగా త్రవ్వి, ఆ ఆదాయాన్ని తాము తీసుకోవటానికి తీర్మానం చేశారు. "ప్రభుత్వం యొక్క, రాజా యొక్క భూములలో తాము కోరుకున్న ప్లాట్లకు సమంజసమైన రేట్లు నిర్ణయించాలనీ, ప్రభుత్వం కొత్తగా సృష్టించిన వేలం విధానం వలన తమకు కౌలుకు భూములు దక్కే అవకాశం లేనందువలన, ఆ నూతన వేలం విధానం రద్దుచేయాలన్న "డిమాండ్లతో వారు ఆ నిరసనాందోళన చేయతలపెట్టారు. డిసెంబరు

10, 1999 అంతర్జాతీయ మానవహక్కుల దినంనాడు తమ ఆందోళనను ప్రారంభించారు.

అయితే, గిరిజనులు 'నిరసనాందోళన' నిర్వహించే ప్రదేశాలన్నింటిని సాయుధ పోలీసులు చుట్టుముట్టారు. మరోవైపు ప్రభుత్వ పాలనా యంత్రాంగం, యీ నిరసనకారులైన గిరిజన కార్మికులను ప్రసన్నం చేసుకొని శాంతపరిచే ఎత్తుగడలను అనుసరించింది. కోల్ గిరిజనుల ఫిర్యాదులు వింటామని, క్వారీల్లో నిర్బంధ – బాలకార్మిక విధానం జరగకుండా దాడులు జరుపుతామని ఆ ప్రాంతంలో రాతిగనులు లీజు యిచ్చేందుకు సంబంధించిన విషయాల్లో గిరిజనులతో సంప్రదిస్తామని హామీనిచ్చింది. దానితో వారు, ప్రభుత్వ హామీని నమ్మి తమ ఆందోళనను విరమించారు. అయితే నాలుగైదు నెలలు జరిగినా, ఎన్ని సంప్రదింపులు జరిగినా, గిరిజనులు ఎన్ని నిరసనలు జరిపినా ప్రభుత్వం తానిచ్చిన హామీలను అమలుపరచటానికి ముందుకు రాలేదు. అందువలన గిరిజనులు మరో ప్రభావవంతమైన, నిరసనాందోళనను – భారీ ఎత్తున గర్జనను – నిర్వహించటానికి పథకం వేసుకొన్నారు.

మరోవైపు భూయజమానులైన భూస్వాములు, భూమిలేని యీ కట్టుబానిస కార్మికులు సాధికారులై తమ డిమాండ్లను, తమ హక్కులను స్పష్టంగా వ్యక్తీకరించటాన్ని సహించలేదు. ఇది తమ అధికారాన్ని ధిక్కరించే ప్రమాదకరమైన బెదిరింపుగా వాళ్ళు పరిగణించారు. హింసతో ఈ ప్రమాదానికి బదులివ్వ పూనుకొన్నారు. వారి మరింత కర్కశంగా దాడులు జరిపారు. ఈ గిరిజనులను అణచిపెట్టారు. గిరిజన స్త్రీలపై లైంగిక అత్యాచారాలు జరపటాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించారు. అయితే ఈ భూస్వాముల హింసాపూర్వక దాడులకు వ్యతిరేకంగా గిరిజన కార్మికులు కూడా ఎదురుదాడులు జరిపారు. వారు తమ ఆత్మరక్షణ కోసం ఆయుధాలు ధరించారు. ఒక గ్రామంలో, తమ భూములను తిరిగి భూస్వాములు వెనక్కి తీసుకొంటున్న సందర్భంలో, ఒక గిరిజనుల బృందం, ఆ భూయజమాని ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, దానిని ఆ భూస్వామి పంట వేయకుండా వున్న భూమినంతటినీ దున్ని వేశారు.

మరోవైపు, ఏదో ఒక చెట్టుక్రింద కూర్చుని స్వయం సహాయ గ్రూపులు ఏర్పాటు విషయమై మాట్లాడుకొంటున్న, గిరిజన మహిళల వద్దకు, మోటర్‌సైకిల్స్‌పై వచ్చిన పటేలు మనుష్యులు వారిని, "మీ గురించి మీరేం అనుకొంటున్నారు? ముఖ్యమైన వ్యక్తుల్లా సమావేశాలు జరపుకొంటున్నారు?" అంటూ ప్రశ్నించి భయపెట్టడం, వారి చెంపలు వాయించటం లాంటి చర్యలు జరిపారు. మహిళలు మీటింగులు జరిపితే, వాళ్ళని కిడ్నాప్ చేసి, రేప్ చేయటానికి పటేళ్ళు పథకం వేశారు అని తెలియటంతో, వారు ఒక సమావేశాన్ని రద్దుచేసుకొన్నారు.

ఈ బానిస యజమానుల ముఖ్యుడైన వీరేంద్రపాల్ సింగ్ మరీ దుర్మార్గుడు. ఒకప్పుడు ఛోటీ అనే మహిళ పనిచేయ నిరాకరిస్తే, ఆమెను జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్ళి, బలవంతంగా ఆమెచేత క్వారీలో రాళ్ళుకొట్టించాడు. ఒకరోజున అతడు సాయంత్రంపూట, పొలాలగుండా యింటికి వెళ్తున్న మంటువా అనే బాలికను వెంబడించి, బలాత్కారం చేయబోయాడు. ఆమె అందుకు ప్రతిఘటించిందన్న కోపంతో, ఆమె దాక్కొన్న యింటికి నిప్పుపెట్టి ఆమెను ఆ మంటల్లో కాల్చి చంపివేశాడు.

ఆ రకంగా యిరువర్గాలవారూ వివాదాలు పడటం వలన, పరిస్థితి ఉద్రిక్తస్థాయికి చేరుకొంది. ఈ ఉద్రిక్తతలను గమనించిన అడ్వకేట్ అమర్, శంకర్‌ఘర్ జిల్లా ప్రేలిపోవటానికి సిద్ధంగా వున్న ఒక అగ్నిగోళంగా మారిందని హెచ్చరిస్తూ, పలు అంతర్జాతీయ సంస్థల అధిపతులకు ఉత్తరాలు రాశాడు.

జూన్ 1, 2000 నాడు వేలమంది గిరిజన రైతులు, గనికార్మికులు స్థానిక శివాలయ ప్రాంగణంలో వున్న రామఘర్ దేవాలయ ప్రాంగణం వైపుకు నడిచారు. వీరు తమతోపాటు తమ పిల్లలను, గనిని త్రవ్వే పరికరాలనూ కూడా తీసుకెళ్ళారు. ఇక్కడ వారు తమ గర్జనను ప్రారంభించారు. "ఇంకెంతమాత్రం దోపిడీ, చిత్రహింసలు కుదరవు! మేం పోరాడటానికి ఐక్యమయ్యాం! ఇప్పుడు మేము స్వేచ్ఛకోసం ఐక్యమయ్యాం!" అనే నినాదాల హోరుతో యీ నిరసనాందోళన కార్యక్రమం మొదలైంది. ఇక్కడి సమావేశంలో వారు తమ సమస్యలను చర్చించుకొన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు ఒక నూతన కార్యక్రమ పథకాన్ని సభికుల ముందుంచారు. ఎన్నికలు సమీపిస్తూ వుండటం వలన (స్థానిక పంచాయితీ) తాము యీ ప్రజాస్వామిక ప్రక్రియను, తమ స్వాతంత్ర్యం – స్వేచ్ఛలను పొందటానికి మార్గంగా ఉపయోగించు కోవచ్చునని భావించారు. ఎందుకంటే సోన్‌బర్సా జనాభాలో 40 శాతం మంది ఓటర్లు కోల్‌జాతి గిరిజనులే. అందువలన తాము ఎన్నికలలో పోటీచేసి ఓట్లు చీలకుండా ఐక్యంగా వుంటే, తర్వాతి గ్రామ ప్రధాన్ (గ్రామ ప్రెసిడెంటు)ను తామే ఎంపిక చేసుకోవచ్చుననే నిర్ణయానికి వచ్చారు. ఇప్పటివరకూ భూస్వాములే గ్రామ ముఖ్యులుగా ఎంపికవుతున్నారు. ప్రస్తుతం వున్న గ్రామ ముఖ్యుడు తమను (గిరిజన కార్మికులను) ప్రతీకారపూర్వకంగా తన సహచరుల ద్వారా బెదిరిస్తున్నాడు. ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను అందించటంలో గ్రామ ముఖ్యుడే ప్రముఖపాత్ర వహిస్తాడు.

ఈ ఆందోళన సాగుతున్న క్రమంలోనే కాశీ అనే చదువుకొన్న గిరిజన యువకుడు గ్రామ ముఖ్యునిగా పోటీ చేయటానికి తగిన అభ్యర్థిగా గిరిజనులు గుర్తించారు. అతడు తమ ప్రయోజనాలను పెంపొందించటంలోనూ తమ హక్కుల కోసం జరిపే పోరాటాలకు అధికార మార్గాల ద్వారా భూమికోసం జరిపే పోరాటాలకు నమ్మకంగా నాయకత్వం అందించగలడని భావించారు. ఈ సందర్భంలో కంచుకి యిక తమ సమావేశాన్ని పొడిగించకుండా ముగిద్దామని, లేకపోతే భూస్వాముల నుండి ప్రతీకారపూర్వక దాడులు జరిగే ప్రమాదం వుందని హెచ్చరించాడు. అయినా ఊరేగింపు ద్వారా ఉత్సాహం పొందినవారు, అతడ్ని తన గ్రామానికి వెళ్ళిపొమ్మని చెప్పి తమ సమావేశాన్ని కొనసాగించారు. పురుషులు పలు విషయాలు చర్చించుకొంటూ వుండగా గిరిజన మహిళలు విడిగా వివిధ దశలలో తమ యిళ్ళకు పయనమయ్యారు. అయితే హఠాత్తుగా మోటరుసైకిళ్ళపై వచ్చిన ఎనిమిదిమంది దుండగులు

వారి దారికి అడ్డుగా నుంచొన్నారు. దుండగులు, తమ మోటరుసైకిళ్ళపై గిరిజనుల సమావేశ ప్రదేశం చుట్టూ చక్కెరలు కొట్టడాన్ని ఆ మహిళలు ఆరోజు మధ్యాహ్నమే గమనించారు. వారు తమ యింటిదారి పట్టే సమయంలో, వీరేంద్రపాల్ అనే అతను ఒక బీడీలు అమ్ముకొనేవాడిపై దాడిచేసి, అతడి బీడీ కట్టలను మట్టిలోకి విసిరాడు. మోటరు బైకు నడిపే దుండగులు ఆ గిరిజన మహిళలను కొట్టడం మొదలెట్టారు. తమ మోటరుసైకిళ్ళను ఆ గిరిజన మహిళపైకి ఎక్కించబోయారు. ఇంతలో వీరేంద్రపాల్ గాలిలోకి తుపాకీ పేల్చాడు. ఈ కాల్పుల చప్పుడు విన్న గిరిజన పురుషులు పరిగెత్తుకువచ్చారు. వెంటనే దొమ్మీ మొదలైంది. ఈ కొట్లాటలో పటేళ్ళకు చెందిన అనేకమంది గాయపడ్డారు. ఒకరు చనిపోయారు ఆ చనిపోయిన మనిషి వీరేంద్రపాల్.

జనం అందరూ అక్కడకు వచ్చేసరికే కార్లలో పారిపోయిన భూస్వాముల మనుష్యులు గిరిజనులపై పోలీసు కేసు పెట్టారు. ఈ కొట్లాట, తమపై దాడికి కారణం రామ్‌ఫాల్, పరదేశి, గ్రామప్రధాన్ అభ్యర్థి కాశీ తదితరులు అంటూ ఎనిమిదిమందిపై కేసు పెట్టడం వారిని అరెస్టు చేయటం జైలుకు పంపటం జరిగింది. అయితే గిరిజనులు ఫిర్యాదు చేసినా, పోలీసులు పటేళ్ళనెవరిపైనా కేసు నమోదు చేయలేదు.

సోన్‌బర్సాలో గల చిరు గ్రామంలోని మట్టిగోడలతో కట్టిన గిరిజనుల యిళ్ళన్నీ కూల్చివేశారు. వారి సామానులు, దాచుకొన్న ధాన్యాలు దోచుకున్నారు.

అడ్వకేటు అమర్, అరెస్టయిన వారి కేసులు వాదించటానికి పూనుకొన్నాడు. విచిత్రంగా కంచుకి "సంకల్ప" స్వచ్ఛంద సంస్థలోని ఉద్యోగం నుండి తొలగింపబడ్డాడు.

ఈ ఘటన వలన, గ్రామాన్ని కోల్పోయిన గిరిజనులు, తమ కొత్త గ్రామాన్ని పంట ప్రాంతాలకు దూరంలో వున్న బంజరు భూముల్లో నిర్మించుకొన్నారు. ఈ గ్రామం భూస్వాముల యిండ్లకు రెండు కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరంలో వుంది. అయితే ఈ గ్రామానికి ఒక రోడ్డుగానీ, ఒక బాట కానీ ఏమీలేవు. ఈ గ్రామానికి వారు 'అజాద్‌నగర్' అనే పేరు పెట్టుకొన్నారు.

★ ★ ★

లారా టి.మర్ఫీ బ్రిటన్‌లోని షెఫీల్డు హల్లామ్ యూనివర్శిటీలోని హెలెనా కెన్నడీ సెంటర్ ఇంటర్నేషనల్ జస్టిస్‌లో "మానవ హక్కులు మరియు సమకాలీన బానిసత్వం" అనే విషయాన్ని బోధించే ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె యీ పుస్తకాన్ని నేషనల్ ఎండోమెంట్ ఫర్ హ్యూమనిటీస్ బ్రిటిష్ ఎకాడమీ, నేషనల్ హ్యూమనిటీస్ కేంద్రాలు యిచ్చిన నిధులతో వ్రాసి ముద్రించారు.

ప్రజాస్వామ్య సమాజాల్లో అట్టడుగు నిరుపేదల ఐక్యత అన్నది ఏవిధంగా బలమైన ఆయుధంగా వుంటుందో అన్న విషయాన్ని, తాను బోధించే విద్యార్థులచే గుర్తింపచేయటం కోసం ఆమె ఈ పుస్తకాన్ని రాశారు. ఈ అజాద్‌నగర్ తిరుగుబాటు అన్నది, జయప్రకాష్ నారాయణ ఊహించి పేర్కొన్న "పరిపూర్ణ విప్లవానికి" ఒక అంతర్జాతీయ నమూనా అని ఆమె నమ్మేరు.

అందువలన, ఆమె 2014లో, అజాద్‌నగర్ సందర్శించి, అక్కడి స్వాతంత్ర్యం పొందిన గిరిజనుల పరిస్థితులు ఎలా వున్నాయో? తెలుసుకోడానికి అక్కడకు వెళ్ళారు.

అప్పటికి స్వచ్ఛంద సంస్థ "సంకల్ప" రద్దుచేయబడింది. దాని స్థానంలో 'ప్రగతి గ్రామోద్యోగ ఏవం సమాజ్ కళ్యాణ్ సంస్థాన్' (పి.జి.ఎస్) అనే సంస్థ పనిచేస్తోంది. ఈ సంస్థ గ్రామీణ అభివృద్ధి – మానవహక్కుల సంస్థకు చెందినది. సంకల్ప్ సంస్థ యొక్క సిద్ధాంతం మీదనే పనిచేస్తోంది. ఈ సంస్థకు చెందిన ప్రతినిధి ఒకరు ఆమెకు తోడు వెళ్ళారు. ఆమె సోన్ బర్సా వెళ్ళాలనుకొంటే, విచిత్రంగా ఆ ప్రతినిధి అజాద్‌నగర్‌కు చెందని యితర గ్రామాలలో ఆమెను త్రిప్పుతున్నాడు. ఆమె కోపగించటంతో ఆమెను ఆ గ్రామానికి తీసుకెళ్ళారు. వారితో సంభాషణలు జరిపారు. అయితే వారు చెప్తున్న విషయాలను కానీ, తాను అడుగుతున్న ప్రశ్నలు కానీ, అనువాదకులు సరిగ్గా చెప్పక, తప్పుడు అనువాదాలతో గందరగోళపరిచారు. అయినా వారు చెప్పిన విషయాలలోని కొన్ని కీలక విషయాలను ఆమె అర్థం చేసుకొన్నారు.

వారు చెప్పిన దాని ప్రకారం, ఆనాడు తమపై దాడులు జరిపిన భూస్వాముల మనుష్యులపై జరిగిన ఘర్షణలో తాము అపర కీచకుడు వీరేంద్రపాల్‌ను, రాళ్ళుకొట్టే సుత్తులతో చితక్కొట్టి చంపేశామని, యితరులను గాయపరచామనీ ఆ గిరిజన స్త్రీలు ఎంతో గర్వంగా చెప్పారు.

అయితే వారు తమ స్వంత భూమికోసం, ఎటువంటి లీజు లేకుండా కేటాయింపు లేకుండా, ఎవ్వరినీ డిమాండు చేయాల్సిన అవసరం లేకుండా తమకు చెందాల్సిన సౌకర్యాలు పొందగలిగేందుకు ఆత్రుతతో ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఇప్పుడు తమకు భూమి లీజుకిచ్చిన కాలం పూర్తవటంతో, అది పునరుద్ధరింపబడుతుందని నమ్మకం లేకపోవటంతో తాము పొందామనుకొన్న 'స్వాతంత్ర్యం–స్వేచ్ఛలు' ప్రమాదంలో పడ్డాయనుకొంటున్నామని తమ స్వాతంత్ర్యం అన్నది సందేహాస్పదంగా మారిందని తెలియజేశారు. లీజు ముగిసిన క్వారీల్లో రాళ్ళు కొడితే, పోలీసులు తమ పరిసరాలను జప్తు చేస్తున్నారనీ వారు ఆమెకు చెప్పారు. ఇప్పుడు వారు తాము "ఏ స్వాతంత్ర్యం కోసం పోరాడామో, ఆ స్వాతంత్ర్యానికి గనులు లీజుగా పొందటమన్నది ప్రత్యామ్నాయం కానేకాదని" గుర్తించాము అన్న విషయాన్ని ఆవిడకు తెలిపారు.

అప్పటికే "నిశ్శబ్ద, శాంతియుత విప్లవం పేరిట" అ అజాద్‌నగర్ తిరుగుబాటు వీడియోల ద్వారా, అంతర్జాతీయ సంస్థలు విరివిగా ప్రచారం చేస్తున్నాయి. అంటే ఆ సంస్థలు ఆజాద్‌నగర్ బానిసల తిరుగుబాటుకు కారకులైన మౌలిక కారణాలను వక్రీకరిస్తున్నారని అర్థం చేసుకొన్నారు లారా టి.మర్ఫీ. అంతేకాక "అహింస అనేది సాంస్కృతికంగా ఉద్వేగాత్మకమైన కళావాదంగా (రొమాంటిసైజు) చేయటం వలన, సాయుధ తిరుగుబాట్ల పద్ధతిని తిరస్కరించటం వలన,

అణచబడుతున్నవర్గాల వారిని మరింత అసమానత్వ స్థాయికి దించివేయటం అవుతుందనీ, వారు మంచిగా మనుగడ సాగించే పరిస్థితులకు పొందేందుకు గల ఆఖరి అవకాశాన్ని నిరాకరించినట్టు అవుతుందనీ ఆమె గ్రహించారు.

"కోల్‌జాతి గిరిజనులు ఒక విజయవంతమైన బానిస తిరుగుబాటు నిర్వహించి వుండవచ్చును కానీ ఎంతోకాలం నుండీ వారిని బానిసత్వంలోకి నెట్టి, బానిసలుగానే అణచిపెట్టిన సామాజిక నిర్మాణాలు యింకా అదేవిధంగా మిగిలి వున్నాయని" ఆవిడ అర్థం చేసుకొన్నారు.

పదేపదే ఆ గిరిజనులు "భూమి సమస్య పరిష్కారమై, తమకు భూమి లభిస్తే తప్ప, తమ బానిసత్వ సమస్య పరిష్కారం కాదని" చెప్తున్న విషయం యొక్క లోతులను ఆమె అర్థం చేసుకొన్నారు.

ఇప్పుడు తిరిగి, తమ బ్రతుకుదెరువు కోసం గిరిజనులు పట్టణాలకు వలస వెళ్ళాల్సిన తప్పనిసరి పరిస్థితులను ఆమె గమనించారు. కోల్‌జాతి గిరిజనులు ఒకనాడు తాము కలగన్న ఆజాద్‌నగర్ విముక్తి కల కరిగిపోతున్న విషయాన్ని ఆమె గ్రహించారు.

ఫారెస్టు హక్కుల చట్టానికి సవరణలు చేసి 50,000 ఎకరాల అటవీ భూములను అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట బడా కార్పొరేషన్లకు వేలంపాట ద్వారా దత్తం చేయటాన్ని ఆమె గమనించారు. అటవీ భూములపై తమకు గల స్వంతదారీ హక్కులను నిరూపించలేకపోయినందుకు, 10 లక్షలమందిని, అటవీ భూముల నుండి తొలగించి, వెళ్ళగొట్టాలని 2019 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పును ఆమె తెల్సుకొన్నారు.

ఇవన్నీ గమనించిన లారా టి. మర్ఫీ చేసిన యీ వ్యాఖ్య ఎంతో లోతైన అర్థంతో కూడుకొని, మన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ యొక్క మౌలిక స్వభావాన్ని వెల్లడి చేస్తుంది : **1950లో షెడ్యూల్డు కులాలవారి మధ్య నాయకుడిగా లేదా దళితుల నాయకుడిగా వున్న బి.ఆర్. అంబేద్కర్‌చే ఎక్కువమేరకు రచింపబడ్డ భారతదేశపు రాజ్యాంగం కట్టుబానిసత్వాన్ని రద్దుచేసింది, కానీ గిరిజనుల నుండి అపహరింపబడ్డ భూములను, తిరిగి వారికి యివ్వటానికి బదులు రాజ్యం యొక్క స్వాధీనంలో పెట్టింది. తిరిగి రాజ్యం ఆ భూముల్లో జమీందారులూ, భూస్వాములూ వ్యవసాయం చేసుకోవటానికి అనుమతినిచ్చింది. అంబేద్కర్ షెడ్యూల్డు కులాలవారి హక్కుల కోసం పోరాడారు. కానీ యిప్పటికీ షెడ్యూల్డు జాతులకు చెందినవారు ఆదిమ అనాగరిక స్థితిలోనే మిగిలి వున్నారనీ' అందువలన వారు స్వయం పరిపాలనకు, స్వయం ప్రాతినిధ్యానికీ అసమర్థులనే, నిలకడైన అభిప్రాయంలో అంబేద్కర్ వున్నారు.**

నిజాయితీతో, చిత్తశుద్ధితో నిష్పక్షపాతంగా ప్రస్తుత భారత వ్యవస్థను పరిశీలిస్తే వారు ఏ రాజకీయ అభిప్రాయానికీ కట్టుబడి వున్నవారు కానప్పటికీ, దేశంలోని మౌలిక సమస్య అయిన భూసమస్యను పరిష్కరించకుండా, యీ సమస్యకు పునాదిగా వున్న అర్ధఫ్యూడల్ వ్యవస్థను మార్చకుండా, నిజమైన అర్థంలో అణచివేయబడ్డ ప్రజానీకానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించటమన్నది కల్ల అనే స్పష్టమయిన నిర్ధారణకు వస్తారు. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవటానికి, యీ పుస్తకం దోహదపడుతుంది.

వెల : **రూ. 299/-;** పేజీలు : **160;**
దొరుకుచోటు : **హార్పర్ కాలిన్స్ డాట్ కో డాట్ ఇన్.**

# అస్సామీ కవి నీలమణి ఫుకాన్ మరణం



**2020లో** జ్ఞానపీఠ్ బహుమతి గ్రహీత, నీలమణి ఫుకాన్ తన 90వ యేట 19-1-2023న మరణించారు. ఆయన అస్సాంలోని గోలాఘాట్ జిల్లాలోని దేరా గాంవ్‌లో 10-9-1933న జన్మించారు.

గౌహతి విశ్వవిద్యాలయంలో హిస్టరీలో ఎం.ఏ. చేసిన నీలమణి, గౌహతిలోని ఆర్య విద్యాపీఠ్‌లో 1964 నుండి 1992 వరకు చరిత్ర అధ్యాపకులుగా పనిచేశారు. ఆయన 1950లలోనే కవిత్వ రచన ప్రారంభించారు. అస్సామీ కవితలో సరికొత్త భావచిత్రణలు, కొత్త పదాలను సృష్టించడం ఆయన ప్రత్యేకత. ఒక సామాజిక స్పృహతో ఆయన ఈ ప్రయోగాలు చేశారు. ఆయన కవిత్వం సాధారణ ప్రజలకు బాగా చేరువైంది. సంప్రదాయక పద సంపదను ఆధునిక సందర్భాలకు ఉపయోగించడాన్ని యువ కవులు ఆయన కవిత్వం ద్వారా నేర్చుకోగలరు. ఆయన జపనీస్, యూరోపియన్ కవిత్వాన్ని అస్సామీలోకి అనువదించారు.

ఆయన చిత్రకళపై అధ్యయనం చేశారు. చిత్రకళావిమర్శ ద్వారా పలువురు చిత్రకారుల అభివృద్ధికి కృషిచేశారు. వివిధ నూతన కళాప్రక్రియలను ప్రోత్సహించారు.

**సవరణ : ప్రజాస్వామికవాది కాకర్ల నాగేశ్వరరావుకు జోహార్లు చెబుతూ జనవరి 2023 'ప్రజాసాహితి' సంచికలో ప్రచురించిన సంతాప ప్రకటనలో పొరపాటు దొర్లింది. ఆయన 11-12-2022న మరణించారు. 11-12-2012గా ప్రచురితమైంది. గమనించగలరు.**

\- సంపాదకుడు

# అక్రమాలు బయటపెట్టిన అధ్యాపకులు, విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టిన విశ్వభారతి విశ్వవిద్యాలయం

**శాంతినికేతన్‌కు** అనుబంధంగా వున్న విశ్వభారతి విద్యాలయంలో ఆర్థికశాస్త్ర విభాగ ఆచార్యుడు సుదీప్త భట్టాచార్యను ఉద్యోగం నుండి తొలగిస్తూ విశ్వవిద్యాలయ కార్యాలయం డిసెంబరు 22న ఒక నోటీసు జారీ చేసింది. ఆయన ఆ యూనివర్శిటీ అధ్యాపక సంఘ అధ్యక్షుడు కూడా! అదేరోజు ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేసింది. వీరందరూ ఇప్పటి వైస్‌ఛాన్సలర్ విద్యుత్ చక్రవర్తి అధికారం చేపట్టినప్పటి నుండీ జరిగిన అక్రమాలను బయటపెట్టారు. 2020 నుండీ పలువురు విద్యార్థులను, అధ్యాపకులను సస్పెండ్ చేయడం లేక తొలగించడం కొనసాగుతూ వచ్చింది. దాదాపు 20 మంది అధ్యాపకులపై క్రమశిక్షణా చర్యల పేరుతో సస్పెన్షన్ వేటు వేయగా వారు హైకోర్టునాశ్రయించారు.

నవంబరు 24 నుండి విద్యార్థులకు హాస్టల్ ప్రవేశం ఇవ్వాలనీ, పిహెచ్‌డి, ఎంఫిల్ విద్యార్థుల సిద్ధాంత వ్యాసాల పరిశీలనకు నిర్దిష్ట సమయాన్ని నిర్ధారించాలనీ వైస్ ఛాన్సలర్ నివాసానికి 100 మీటర్ల దూరంలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. డిసెంబర్ 6న వైస్‌ఛాన్సలర్‌ను ఇంటినుండి బయటకు వెళ్ళనీయలేదు. డిసెంబరు 13న వి.సి.పై రాళ్ళతో దాడిచేశారని ఆరోపించగా, వి.సి.యే విద్యార్థులపై దేనినో విసురుతున్నట్లు ఒక వీడియో బయటకు వచ్చింది.

ఆనాటి శాంతినికేతన్ ఈనాడు అశాంతికి కేంద్రమైంది. ●

# ఉత్పల్‌దత్ బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేక నాటకం 'టిటుమీర్' ప్రదర్శనకు నిరాకరించిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా

**ఈ** నెలలో (ఫిబ్రవరి 2023) నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహిస్తున్న 22వ భారత్‌రంగ్ మహోత్సవ్‌లో ఉత్పల్‌దత్ రూపొందించిన నాటకం 'టిటుమీర్' ప్రదర్శనకు ఇచ్చిన అనుమతిని అధికారులు ఉపసంహరించుకోవడం నాటకరంగ ప్రముఖులను ఆశ్చర్యపరచింది.

"స్వాతంత్ర్యోద్యమంలో మరుగునపడిన వీరులు" అన్న అంశంపై జరుగుతున్న ఈ నాటక మహోత్సవాల్లో ప్రదర్శనకై పరివర్తన్ థియేటర్ దర్శకుడు జయరాజ్ భట్టాచార్య ఎన్నికచేసిన మొదటి 9 నాటకాల్లో ఉత్పల్‌దత్ నాటకం ఒకటి.

1831లో బ్రిటీషువారిపై జరిపిన మొదటి సాయుధ నర్కల్‌బరియా తిరుగుబాటు నాయకుడు టిటుమీర్. బెంగాలీ స్వాతంత్ర్య సమరయోధుడు. బ్రిటీషువారి నిరంకుశ పాలననూ, అకృత్యాలను ఎదుర్కొన్నవాడు టిటుమీర్. అయితే ఆయన ముస్లిం మతస్తుడు కావడంచేత నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ప్రభుత్వమూ కలసి దీని ప్రదర్శన ఉపసంహరించారని నాటకరంగ ప్రముఖులు ఆరోపించారు. కాని అధికారుల వివరణ మరోవిధంగా వుంది. మరాఠీలో భద్రకాళి నాటక బృందం, బొంబాయివారి 'సంగీత దేవభాబ్లి' నాటకాన్ని కూడా వారు సకాలంలో నాటక స్క్రిప్టు వీడియో సమీక్షా కమిటీకి అందించ నందుకు తిరస్కరించామనీ, 'టిటుమీర్' బెంగాలీ స్క్రిప్టు, వీడియో కూడా రాలేదనీ అధికారులు వివరణ ఇచ్చారు. నిజానికి 'టిటుమీర్' నాటక బృందం తమ ప్రదర్శనకు అసలు దరఖాస్తు చేయలేదు. డ్రామా స్కూలు అధికారులే దానిని ఎన్నికచేసి ప్రదర్శించమని ఆహ్వానించారు. ఆ తర్వాత ఆ ఆహ్వానాన్ని ఉపసంహరించుకున్నారు.

ఈ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (NSD) 1959లో సంగీత నాటక అకాడమీకి అనుబంధ సంస్థగా ప్రారంభమైంది. 1975లో స్వయం ప్రతిపత్తి గల సంస్థగా రూపొందింది. ఎందరో కళాకారులను తీర్చిదిద్దింది. ఇటీవల దీని ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో మత సంబంధమైన అంశాలు చోటుచేసుకోవడాన్ని నిరసిస్తూ 260 మంది కళాకారులు, రచయితలు, అధ్యాపకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ●

# మనుస్మృతి దహనం రాజస్థాన్‌లో ఒక నేరం

**గత** 95 ఏళ్ళుగా అంబేద్కర్‌వాదులు ప్రతి డిసెంబరు 25న మనుస్మృతి దహన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. దానిలో భాగంగానే రాజస్థాన్‌లోని బర్మేర్ జిల్లాలోని బాభాసర్ ప్రాంతంలో డిసెంబర్ 25న కళాశాల విద్యార్థులు, అంబేద్కరిస్టులు మనుస్మృతి దహన కార్యక్రమం నిర్వహించారు. దీనికై 1924లో అంబేద్కర్ స్థాపించిన సమతా సైనిక్‌దళ్ నాయకత్వం వహించింది.

అయితే పవిత్రమైన గ్రంథాలను తగలబెడ్తున్నారనీ, వాటిని అపవిత్రం చేస్తున్నారన్న నేరారోపణ చేసి రాజస్థాన్ పోలీసులు నలుగురిని అరెస్టుచేశారు. 'మనుస్మృతి' పుస్తకం స్థానంలో ఎవరో భగవద్గీతను చొప్పించి ఈ నేరాన్ని ఆపాదించారు! ●

# జాధవ్‌పూర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ - నిర్దోషి

**ఆ** ప్రొఫెసర్ పేరు అంభికేశ్ మహాపాత్ర. 10 ఏళ్ళక్రితం మమత బెనర్జీ (ముఖ్యమంత్రి)పై తన ఈ మెయిల్‌కు వచ్చిన ఒక కార్టూన్ (వ్యంగ్యచిత్రం)ను తన మిత్రుల ఈమెయిల్‌కు ఫార్వర్డ్ చేయడమే ఆయన చేసిన మహాపరాధం!

మహిళలను కించపరచడం నాయకులపై అసత్య ప్రచారం అనే ఆరోపణలతో ఆయన్ను ఏప్రిల్ 12, 2012న అరెస్టు చేశారు. మార్చి 23న తాను నివశిస్తున్న హౌసింగ్ సొసైటీలోని సభ్యులకు ఆ కార్టూన్‌ను పంపించాడు.

దీనిపై కోపగించిన తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రౌడీమూక ఆయన ఇంటికి వచ్చి ఆయన్ను కొట్టారు. ఆ తర్వాత పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. జులై 2012లో ఛార్జిషీటు తయారుచేసినా విచారణ చేపట్టలేదు. ఆ కార్టూన్‌లో మమత, దినేశ్ త్రివేది (ఇటీవల తొలగింపబడిన రైల్వేమంత్రి), ముకుల్‌రాయ్ (నేటి రైల్వేమంత్రి) వున్నారు.

పదేళ్ళ తర్వాత కోర్టు ఇప్పుడు అంబికేశ్ మహాపాత్రపై కేసు కొట్టివేసింది. ●

# కన్నడ సాహిత్య సమ్మేళనం విశేషాలు

**గతనెల** అంటే జనవరి 6, 7, 8 తేదీలలో హవేరిలో కన్నడ సాహిత్య పరిషత్తు ఆధ్వర్యాన కన్నడ సాహిత్య సమ్మేళనం జరిగింది. దీనికి ప్రభుత్వం ఆర్థికంగా సహాయపడుతుంటుంది.

అయితే కన్నడంలో రచిస్తున్న ముస్లిం రచయితలకు తగినంత ప్రాతినిధ్యం ఇచ్చి, వారిని ఆహ్వానించలేదని ఆరోపిస్తూ దీనికి నిరసనగా జనవరి 8న జనసాహిత్య సమ్మేళన్‌ను ప్రత్యామ్నాయంగా బెంగుళూరులో కె.ఆర్. సర్కిల్‌లోని అల్యుమినిహాల్‌లో నిర్వహించారు.

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళన నిర్వహణలో ముస్లిమ్ రచయితలకు తగినంత ప్రాముఖ్యత ఇవ్వక పోవడాన్ని నిరసిస్తూ హెచ్.ఆర్. సుజాత ఆ సమ్మేళనంలో పాల్గోవడం లేదని ప్రకటించారు. ఆహ్వానింపబడిన ఎన్.ఎస్. చాంద్‌పాషా సమ్మేళనాన్ని బహిష్కరించారు. రమేశ్ అరోలి అనే కవి కూడా నిరసనగా హాజరుకాలేదు.

సాహిత్య సమ్మేళనాల్లో కొందరు రచయితలను దూరంగా వుంచు తున్నారని కన్నడ పండితుడు, ప్రొఫెసర్ పురుషోత్తమ బలిమలే తన ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. ●

# భారతీయ జనతాపార్టీ వ్యతిరేకి, ప్రముఖ నృత్యకళాకారిణి మల్లికా సారాభాయ్‌కు రామప్ప గుడి ఆవరణలో నృత్య ప్రదర్శనకు అనుమతి నిరాకరణ

**మల్లికా** సారాభాయ్ భరతనాట్యంలోనూ, కూచిపూడి నృత్యంలోనూ ప్రసిద్ధ కళాకారిణి. అహమ్మదాబాద్‌లోని దర్పణ అకాడమీలో వేలాదిమందికి ప్రదర్శన కళల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆమె సామాజిక కార్యకర్తగా వివిధ ప్రజానుకూల కార్యక్రమాలలో పాల్గొనడమేగాక సామాజిక సమస్యలపై నృత్యరూపకాలు తయారుచేసి తన బృందంతో ప్రదర్శిస్తున్నారు. భారత ప్రభుత్వం ఆమెకు పద్మభూషణ్ ఇచ్చి సత్కరించింది. మల్లిక తల్లి మృణాళినీ సారాభాయ్ కూడా నృత్య కళాకారిణే. తండ్రి విక్రమ్ సారాభాయ్ ప్రముఖ అంతరిక్ష శాస్త్రజ్ఞుడు.

తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలోని పాలంపేట గ్రామంలో వున్న రామప్పగుడిని యునెస్కో జులై 2021లో ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా గుర్తించినట్లు ప్రకటించింది. ఆ గుడి రుద్రేశ్వర ఆలయం. అంటే శివాలయం అక్కడి మల్లిక రూపొందించిన 'శివశక్తి' రూపక ప్రదర్శనను కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఏర్పాటుచేసింది. అయితే కేంద్ర ప్రభుత్వపు సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి సంరక్షణలో వున్న రామప్పగుడిలో ప్రదర్శనకు వారి అనుమతి తప్పనిసరి.

నృత్యప్రదర్శన ఇస్తున్నది మల్లికా సారాభాయ్ బృందమే గనుక ఐతే, అనుమతించేదే లేదని ఆర్కియాజికల్ శాఖవారు జవాబు ఇచ్చారు. దానికి కారణం అందరికీ తెలుసు. మల్లిక 2009లో జరిగిన ఎన్నికలలో ఎల్.కె. అద్వానీకి పోటీగా స్వతంత్ర అభ్యర్థిగా గాంధీనగర్ నియోజకవర్గంలో నిలబడి, డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. అంతకుముందే 2002లో గుజరాత్‌లో ముస్లిములపై జరిగిన మారణకాండకు పోలీసులూ, ఆనాటి ముఖ్యమంత్రి మోదీ బాధ్యులని ప్రకటించారు. సుప్రీంకోర్టు వరకూ వెళ్ళారు. ప్రస్తుతం ఆమె ఆమ్‌ఆద్మీ పార్టీలో వున్నారు.

మధ్యప్రదేశ్‌లోని ఖజురహో, ఒరిస్సాలోని కోణార్కలలో ఏటా జరుగుతున్న నృత్యోత్సవాలుగా రామప్ప గుడిలో కూడా మూడు రోజుల పాటు చేద్దామనుకున్న కాకతీయ హెరిటేజ్ సంస్థవారి కార్యక్రమం – అదేరోజున జనవరి 21న హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం సమీపాన గల హయగ్రీవాచారి మైదానం (కుడా గ్రౌండ్)లో నిర్వహించగా వేలాదిమంది ఆ నృత్య ప్రదర్శనను ప్రశంసించారు. అత్యున్నత స్థాయిలో వున్న దేశ పాలకులు ప్రదర్శిస్తున్న సంకుచిత మనస్తత్వాన్ని ప్రజలు గర్హించారు. ●

వ్యాసం

ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ దినం సందర్భంగా

# భావవాదం - భౌతికవాదం

- డా॥ ఆర్కే

**పదార్థం** ప్రధానమైనది. చైతన్యం పదార్థ జనితం అనేవారు భౌతికవాదులు.

చైతన్యం ప్రధానమైనది, అది పదార్థాన్ని సృష్టించింది అనేవారు భావవాదులు.

తత్త్వశాస్త్రంలో భావ, భౌతికవాదాల దారులు ఏనాడో వేరయినాయి. ఈ రెండు ప్రాపంచిక దృక్పథాలు నిరంతరం ఘర్షణ పడుతుంటాయి. ఈ ఘర్షణ పరిణామవాదంలో కూడా ప్రతిబింబించింది.

భావవాదం ఇలా చెబుతుంది :

ఆదియందు "వాక్యం" వుండెను. వాక్యం దేవుడై వుండెను.

"ఓం"కారనాదంతో సృష్టి ప్రారంభమాయెను అంటే ఆదిలో పదార్థం ఏదీ లేదు. చైతన్యం మాత్రమే వుంది. అదే పరమాత్మ. పరాశక్తి. లేదా అఖండభావం (Absolute Idea). ఏ పేరుతో పిలిచినా ఒక్కటే. ఆ దైవసంకల్పం వల్లనే ఈ జగత్తు సృష్టింపబడింది.

అందువల్ల భావవాదం పదార్థాన్ని ప్రాథమికమైనదిగా అంగీకరించదు. చైతన్యం వల్లనే పదార్థం అస్థిత్వంలో వున్నదని చెబుతుంది.

'పంచదార తీయన' అంటే దాని గుణాన్ని గ్రహించటం బట్టిగాదు, నీ మనస్సులోని భావం వల్లనే.

నీ శరీరం ఉనికిలో వుందీ అంటే ఆత్మవల్లనే.

ఈ ప్రపంచం కూడ అంతే. అది కేవలం కల. మానసిక కల్పన. ఎండమావి. చీకట్లో తాడును చూచి పాము అని భ్రాంతి పడినట్లుగా ఈ ప్రపంచం వాస్తవమని భ్రమిస్తున్నావు. షడ్గుణాలనే అడ్డుతెరలు నీకంటికి కనబడినాయి. వాటిని తొలగించి జ్ఞాననేత్రం తెరువు. విశ్వరూపం సాక్షాత్కరిస్తుంది. సర్వసృష్టిని ఆ భగవానుడిలోనే దర్శించగలవు. ఏది జరిగినా దానికి కారణం ఈ ప్రపంచంలో లేదు. చీమ కుట్టాలన్నా శివుడాజ్ఞ రావాలి. ఇంక ఈ అనంత విశ్వం, సమస్త జీవుల పరిణామం గురించి వేరే చెప్పాలా?

కనుక ప్రకృతి మిధ్య, జ్ఞానం మిధ్య. ప్రకృతిపై మానవుడి ఆధిపత్యం కూడా మిధ్యే. ప్రకృతి సూత్రాలను మానవ మాత్రులు తెలుసుకోలేరు. అది సైన్సు కంతుపట్టని అగమ్యగోచరం.

ఈ కారణంగానే భావవాదం గ్రహాల పుట్టుక, జీవపరిణామం గురించిన శాస్త్రీయ సిద్ధాంతాలను తిరస్కరిస్తుంది.

ఇందుకు విరుద్ధంగా భౌతికవాదం ఇలా చెబుతుంది :

పదార్థం మినహా మరేమీలేదు. లోకాతీతమైన దైవశక్తి లేనేలేదు. సృష్టించేవాడు లేడు. నాశనం చేసేవాడు లేడు.

ఆది, అంతములేని ఈ అనంత విశ్వం లక్షల, కోట్ల సంవత్సరాలుగా పదార్థ పరిణామ ఫలితం. దీనిలో భాగంగానే జీవజాతులు పుట్టాయి. మానవుడు పుట్టాడు.

మరి చైతన్యం ఏమిటి?

నిర్జీవ పదార్థం నుండి జీవపదార్థం, దాని నుండి ఆలోచించే పదార్థం ఉద్భవించింది. అత్యున్నతమూ, అతి సంక్లిష్టమైన ఆ పదార్థ రూపం మానవుడి మెదడు. అది ఆలోచించే అంగం.

ఆలోచించే అంగం నుండి ఆలోచనల్ని విడదీయలేం. మెదడుకు దెబ్బ తగిలినా, జబ్బుపడినా, మనిషి చైతన్యాన్ని కోల్పోతాడు. కనుక చైతన్యం మెదడు ధర్మం.

అయితే మెదడు ఆలోచిస్తుందేగాని ఆలోచనలకు మూలంగాదు.

'పంచదార తీయన' అంటున్నాం ఎలా? అది నాలుకకు తగలగానే ప్రేరణలు (Stimuli) ఏర్పడి నరాల ద్వారా మెదడులోని రుచిని తెలిపే సెంటర్‌కి రవాణా చేయబడతాయి. అప్పుడా అనుభూతి ఉత్పన్నమవుతుంది. పంచదార లేకుండా దాని గుణాన్ని గ్రహించలేం.

అలాగే ఆత్మ కూడ. శరీరం లేకుండా ఆత్మను వూహించలేము.

కనుక భావాలు శూన్యం నుండి పుట్టుకురావు. బుర్రలోంచి ఊడిపడవు. అవి బాహ్యప్రకృతికి ప్రతిరూపాలు. వస్తువులతో, పరిణామాలతో విడివడని విధంగా ముడిపడి వుంటాయి. పంచేంద్రియాల ద్వారా గ్రహింపబడి మెదడులో ప్రతిబింబిస్తాయి. భౌతిక ప్రపంచానికి ఆలోచనారూపాలుగా మార్చబడతాయి.

బయటి ప్రపంచంతో సంబంధాలు త్రెంచుకున్న మెదడు కట్టెతో సమానం. దానిలో చైతన్యజ్వాల రగలదు.

ఎంతటి మేధస్సు అయినా ప్రకృతికతీతమైన దానిని ఊహించలేదు. రూపకల్పన చేయలేదు. లోకాతీత శక్తులనబడే దేవుడు, దయ్యాలను గూడ మనం ఏదో పదార్థ రూపంలో పూజిస్తున్నాం. మహాశివుడనే దేవుడిని జంతుచర్మం కప్పుకొని, విబూది రాసుకొని, పామును హారంగా ధరించిన మానవాకారంగానే చూస్తున్నాం.

అందువల్ల చైతన్యం ప్రాథమికమైనదికాదు, స్వతంత్రమైనది కాదు, పదార్థేతరమైన శక్తి ఎక్కడాలేదు. ఈ ప్రపంచమే వాస్తవం. ఏది జరిగినా దానికి మూలం ఈ ప్రపంచంలోనే వుంది.

ఈ కారణంగానే భౌతికవాదం ప్రకృతి సూత్రాలను తెలుసుకోగలమంటుంది.

ప్రకృతిపై మానవుడి ఆధిపత్యాన్ని గుర్తించుతుంది. అతడి జ్ఞానాన్ని ప్రామాణికంగా తీసుకొంటుంది. పరిణామవాదం గురించిన శాస్త్రీయ సిద్ధాంతాలను ఆధారం చేసుకొని దైవసృష్టిని తిరస్కరిస్తుంది.

భావ, భౌతికవాదాల మధ్య ఘర్షణలో భావవాదం కేవలం కుతర్కానికీ, మూఢనమ్మకానికీ అంకితమైంది.

ఎంత భావవాదియైనా పదార్థాన్ని విశ్వసించక తప్పదు. ఎదురుగా గోడ వుంటే అంతా మిధ్యేనని ఢీ కొంటాడా? ఆత్మ నిత్యం, శరీరం నీటిబుడగ లాంటిదనే భావవాది ఆ శరీరాన్ని గాలికి వదిలివేస్తున్నాడా? ఆత్మను నిలుపుకోటానికైనా జీవితావసరాలను సంపాదించుకొంటున్నాడు.

శంకరాచార్యులంతటివాడికే పదార్థాన్ని గుర్తించక తప్పలేదు. దేశ పర్యటనచేస్తూ ఆయన కేరళ వెళ్ళాడట. ఓ రాజుగారు ఏనుగులతో సహా ఎదురేగి సాదరంగా స్వాగతం చెప్పాడు. ఒక ఏనుగుకు తిక్కరేగిందేమో ఆయన బృందంపై విరుచుకుపడింది. శిష్యులతో శంకరాచార్యులవారు పలాయనం చిత్తగించారు. ఆనాటి సాయంత్రం సభలో ఒక శిష్యుడు లేచి 'ఆచార్యా! జగం మిధ్య అనే మీరు గజంకు భీతిల్లి పారిపోనేల?' అన్నాడట. తర్కంలో తెలివిగలవాడుగదా! 'నాయనా! గజం మిధ్య! పలాయనం మిధ్య' అని తప్పించుకున్నాడు. ఇలా వుంటుంది భావవాదం. దానికి ఆర్గ్యుమెంట్లు, అప్పీల్సు లేవు.

ఆదిమకాలంలో మానవుల అజ్ఞానాంధకారం నుండి పుట్టిన భావవాదం క్రమేపీ మతరూపం ధరించింది. ప్రజల పాలిట మత్తుమందుగా, పాలకవర్గాలకు దోపిడీ సాధనంగా తయారైంది. రకరకాల రూపాలలో భావవాదాన్ని వెదజల్లి ప్రజల్ని జోకొట్టటానికి దోపిడీవర్గాలు ప్రయత్నించాయి. తమ సిద్ధాంత పునాదులను కూలగొట్టే శాస్త్రీయ పరిశోధనలు ప్రపంచానికి వెల్లడికాకుండా నిరోధించాయి. శాస్త్రజ్ఞులను చిత్రహింసలకు గురిచేశాయి! దారుణ హత్యలకు ఒడిగట్టాయి.

భౌతికవాదం విశ్వాసానికి సంబంధించిన సిద్ధాంతమేగాదు. పండితుల చర్చలకు, సైంటిస్టులకు పరిశోధనలకు పరిమితమైనదేగాదు. నిత్యజీవితంలో దైనందిన పనులలో మనందర్ని వెన్నాడుతూనే వుంటుంది. జీవితావసరాలను సంపాదించుకొనటంలో మనం పదార్థాన్నే నమ్ముకున్నాం. తిండి, బట్ట, ఇల్లు తదితరమైనవి సమకూర్చుకోవటంలో భౌతికవాద దృక్పథాన్నే అనుసరించాలి. అందుకే ఓ కొంటెస్వాములోరు భిక్షాటన చేస్తూ 'అన్నమైతేనేమిరా, సున్నమైతేనేమిరా' (అంతా బ్రహ్మపదార్థమేనంటూ) – అన్నమే పెట్టు' అన్నాడట.


ఒక గొప్ప సైంటిస్టు భౌతికవాదాన్ని తన ప్రాపంచిక దృక్పథంగా అంగీకరించకపోవచ్చు. కాని తన పరిశోధనా ఫలితాలలో విజయాన్ని సాధించాలంటే భౌతికవాదాన్ని కాదనలేడు.

ఒక క్రియకు అంతే బలం గల ప్రతిక్రియ వుంటుందనే న్యూటన్ సూత్రం పదార్థధర్మాన్ని చక్కగా బహిర్గతం చేసింది. భౌతికవాదం ఇమిడి వుంది గనుకనే ఈనాటికీ అది విశ్వజనీన సత్యం.

అదే న్యూటన్ వార్ధక్యంలో మతవిశ్వాసాలవైపు మొగ్గాడు. గడియారానికి కీ యిచ్చినట్టు ఈ విశ్వానికి తొలిలో 'ఎవరో' ఊపు యిచ్చారని అప్పటి నుండి అది చలనంలో వుందని సైన్సులో ఆధ్యాత్మిక వాదానికి చోటిచ్చాడు. సైన్సుపరంగా దానికి విలువ లేకపోయింది. ఇచ్ఛానుసారం జీవులు శరీరావయవాలను సంపాదించుకొంటాయనే లామార్క్ సిద్ధాంతంలో భావవాదం వుంది. అది వీగిపోయింది.

అందువల్ల మానవ సమాజ మనుగడకు పురోగతికి భౌతికవాదం తప్పనిసరి. నిర్బంధాలతో, నిషేధాలతో దానిని అణచలేరు. శాస్త్రీయ పరిశోధనలపై, మానవుడి కార్యాచరణపై, ప్రకృతి రహస్యాలను ఛేదించటంపై భౌతికవాదం ఆధారపడింది. శాస్త్రీయ విజ్ఞానం వికసించినకొలదీ మరింత పరిపూర్ణతను సంతరించుకొంది. నూతన స్థాయికి అభివృద్ధి చెందింది. అజేయంగా నిలిచింది.

– డా॥ ఆర్కే రాసిన 'పరిణామశాస్త్రం-ప్రథమ పాఠాలు' పుస్తకం నుండి ●






అంతర్జాతీయ మాతృభాషాదినం : ఫిబ్రవరి 21

# అమ్మనుడిపై నాలుగు తెలుగు పుస్తకాలు

- కొత్తపల్లి రవిబాబు

**1999** అగస్టు 21, 22 తేదీలలో హైదరాబాదులో జనసాహితి తన 9వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 'ప్రజల భాషలో విద్య – పరిపాలన' అనే అంశంపై తయారుచేసిన ఒక అవగాహనాపత్రం ఆధారంగా ఒక సదస్సును నిర్వహించింది. ఆ అంశంపై వావిలాల గోపాలకృష్ణయ్య తన ప్రారంభోపన్యాసంలో అధికార భాషాసంఘం అధ్యక్షునిగా తెలుగు పరిపాలనా భాషగా వాడటానికి తాము చేసిన కృషిని వివరించి, ఆ కృషి వెనుకపట్టు పట్టడాన్ని విమర్శించారు. ఆ తరువాత మూడు నెలలకు 1999 నవంబరు 17న యునెస్కో 30వ సాధారణ మహాసభ, 2000 నుంచీ ప్రతి ఏడాదీ ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషాదినంగా పాటించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. 1952లో నేటి బంగ్లాదేశ్ తూర్పు పాకిస్తాన్‌గా వున్న కాలంలో తమ మాతృభాషైన బెంగాలీకి అనుకూలంగా, తమపై రుద్దిన ఉర్దూకు వ్యతిరేకంగా నిర్వహించిన భాషోద్యమ ప్రదర్శనపై 1952 ఫిబ్రవరి 21న జరిపిన పోలీసు కాల్పులలో ఎనిమిదిమంది భాషాకార్యకర్తలు మరణించారు. ప్రపంచ దేశాలలో భాష కోసం జరిపిన ఈ ఏకైక పోరాటాన్ని దృష్టిలో వుంచుకుని యునెస్కో ఆ తేదీని మాతృభాషాదినంగా ప్రకటించింది. బంగ్లాదేశ్ ఏర్పడిన నాటినుండి ఆ రోజును జాతీయ అమరవీరులదినంగా ఆ దేశం జరుపుకుంటోంది.

కనుమరుగౌతున్న అనేక భాషల గురించి యునెస్కో దృష్టి సారించింది. జనసాహితి తన ప్రణాళికలో (1978) మాతృభాషలో విద్య–పరిపాలన సాధించడం ఒక లక్ష్యంగా పేర్కొంది. నిరాదరణకు గురౌతున్న తెలుగు గురించి ప్రసంగాల ద్వారా, వ్యాసాల ద్వారా, పుస్తకాల ద్వారా జనసాహితి చేస్తున్న ప్రచారం 1997 నుంచీ మరింత ఉధృతం చేసింది. తన అధికార మాసపత్రిక 'ప్రజాసాహితి'లో 'మన తెలుగును రక్షించుకుందాం' అనే శీర్షికలో 20వ శతాబ్దపు ప్రారంభం నుండీ తెలుగు భాష పరిరక్షణ గురించి ప్రముఖులు రాసిన వ్యాసాలు, ప్రసంగాలేగాక, వర్తమాన రచయితల రచనలను ప్రతి సంచికలో ప్రచురించింది. 2018 నవంబరు 30న గురజాడ 103వ వర్ధంతి సందర్భంగా సావనీరు సైజులో 450 పుటలతో 'ప్రజాసాహితి'లో మాతృభాషపై ప్రచురించిన రచనలనన్నిటినీ ఒక మహాసంపుటిగా ప్రచురించింది. అది మాతృభాషా ఉద్యమంలో పనిచేసేవారికి ఒక ఆకర గ్రంథంగా వుంది. దాని కాపీలు జనసాహితి కార్యాలయంలోనూ, మైత్రీబుక్‌హౌస్‌లోనూ లభిస్తాయి.

ఆ తరువాత 'అమ్మనుడి'గా పేరుమార్చుకున్న 'నడుస్తున్న చరిత్ర'లో సంపాదకుడు సామల రమేశ్‌బాబు తెలుగుభాష ఉనికిపై కేంద్రీకరించి వ్యాసాలు, కథలు, కార్టూన్లు, నవలలు ప్రచురించారు. ప్రస్తుతం కేవలం తెలుగుభాష పరిరక్షణ కోసమై అంకితమైన పత్రికగా తెలుగుజాతి ట్రస్టు తరఫున 'అమ్మనుడి' మాసపత్రికను ప్రచురిస్తున్నారు. వాసమూర్తి (తెలుగు కూటమి) అట్లూరి పురుషోత్తం, సింగమనేని నారాయణ, స.వెం. రమేశ్, నూర్‌బాషా రహంతుల్లా, జి.వి. పూర్ణచందు తదితరులు ఈ అంశంపై పుస్తకాలు ప్రచురించారు.


విదేశాలలో, ఇతర రాష్ట్రాలలో తెలుగు నేర్పే సంస్థలు వెలిశాయి. గొప్ప కృషి చేస్తున్నాయి. కానీ రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రం మాతృభాష స్థానంలో ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీషు నేర్పే విధానానికి పాలకులు మొగ్గు చూపారు. ఇది అశాస్త్రీయ విధానమని ఎందరు విద్యావేత్తలు, భాషావేత్తలు మొత్తుకున్నా బడుగువర్గాల ఓట్ల కోసం ఇంగ్లీషును వారిపై రుద్ది, వారిని పనికిరానివారిగా మారుస్తున్నారు. కొఠారి కమిషన్ సూచించినట్లు కామన్ స్కూలు విధానం అవలంబించడం బదులు ప్రైవేటు స్కూళ్ళకు దీటుగా ఇంగ్లీషు మాధ్యమంలో ప్రభుత్వ విద్యాలయాల్లో విద్య గరుపుతామనీ, ఇది పేదల కోసం చేస్తున్నామనీ మోసం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమంలో బోధన ఎంత దయనీయంగా వుందో ఏ భాషా రానివారిగా పిల్లలు ఎలా మిగిలిపోతున్నారో ఏ పాఠశాలకైనా వెళ్ళి చూడవచ్చు.

బడుగువర్గాల పిల్లలు పలువురు పాలకులు అవలంబిస్తున్న భాషా విధానాల వల్ల అయోమయ స్థితిలో చదువు మానుకొని డ్రాప్‌అవుట్స్ అవుతున్నారు. మరోవైపు మాతృభాషోద్యమం కొనసాగుతోంది. మాతృభాషోద్యమ సమాఖ్య సమావేశాలు జరుపుతోంది. అలంకార ప్రాయంగా, రాజకీయ పునరావాస కేంద్రంగా వున్న అధికార భాషాసంఘం, తెలుగు అకాడమీ, సాహిత్య అకాడమీలు మన్నుతిన్న పాముల్లాగ పడి వున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల స్థాయిలో తెలుగులో చదువుకొని ఆ తర్వాత వివిధ ఉన్నత ఉద్యోగాలు చేసినవారు మాతృభాష విద్యాబోధన అవసరాన్ని గుర్తింపుచేస్తూ పుస్తకాలు, వ్యాసాలు రాస్తున్నారు. కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. వాట్సప్‌లోనూ, ఫేస్‌బుక్‌లోనూ, బ్లాగుల్లోనూ భాషా పరిరక్షణ గురించి పదేపదే హెచ్చరికలు చేస్తున్నారు. జూమ్ సమావేశాలు క్రమబద్ధంగా నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో నాలుగు పుస్తకాలను 'ప్రజాసాహితి' పాఠకులకు పరిచయం చేస్తున్నాను.

మొదటి పుస్తకం తెలుగు భాషకు, తెలుగువారికి అంకితమై అపారమైన సాహిత్య, భాషావిషయక పరిశోధన, కృషిచేస్తున్న స.వెం.రమేశ్ వివిధ పత్రికలలో తెలుగుపై రాసిన వ్యాసాల సంపుటి. **'ఎల్లలు లేని తెలుగు'.** ఇది 2015 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంనాడు విడుదలైంది.

తెలుగుపైనా, తెలుగువారిపైనా, ఇతర రాష్ట్రాలలో తెలుగువారిపైనా 'నడుస్తున్న చరిత్ర', 'ఆంధ్రజ్యోతి', 'సాక్షి' పత్రికలలో రమేశ్ రాసిన 50 కట్టురాల (వ్యాసాల) సంపుటి ఇది. అత్యధికమైన వ్యాసాలు 'నడుస్తున్న చరిత్ర'లో ప్రచురించి రమేశ్‌ను తెలుగు ఉద్యమకారులకు సామల రమేశ్‌బాబు పరిచయం చేశారు. ఇవన్నీ 2001 – 2013 సంవత్సరాలలో రాసిన వ్యాసాలు.




స.వెం. రమేశ్ ఆంత్రోపాలజీ (మానవశాస్త్రం) విద్యార్థి. నేడు తమిళనాడుగా వున్న ప్రాంతంలో పుట్టి పెరిగారు. తెలుగువారు తమ ఉనికిని ఇతర రాష్ట్రాలలో కోల్పోతున్న పరిస్థితులను ఆకళింపు చేసుకున్నారు. తమిళనాట హోసూరు ప్రాంతంలో తెలుగు నుడినీ, సాహిత్యాన్నీ, సంస్కృతినీ కాపాడుతూ – 'తెలుగువాణి' ట్రస్టు ద్వారా 2004 నుంచీ, వేలూరు జిల్లాలోనూ, కోయంబత్తూరు ప్రాంతంలోని అనేక గ్రామాల్లోనూ తెలుగు మరచిపోయిన తెలుగువారికి తెలుగునుడి నేర్పుతున్న కార్యక్రమంలో తలమునకలుగా కృషి చేస్తున్నారు. వారికోసం ఒక వాచకాన్ని కూడా ఆయన తయారుచేశారు.


తమిళనాడును దక్షిణాంధ్ర రాష్ట్రం అని పిలవడం సబబని మొదటి వ్యాసంలో వివరించి, తమిళనాడులో వివిధ జిల్లాలలో తెలుగుభాష మాట్లాడుతున్న వివిధ తెగలవారి గురించీ, ధర్మపురి జిల్లాలో తెలుగు ప్రచారయాత్ర గురించీ, కర్నాటక రాష్ట్రంలోని మాండ్య ప్రాంతంలో యక్షగాన ప్రదర్శనలో వేమన పద్యాలను వినడం గురించీ, రెండువేల ఏండ్ల తెలుగు గురించీ, సంగ సాహిత్యంలో కనిపించిన తెలుగు మూలాల గురించీ, శ్రీలంకలో తెలుగువారి తపన గురించీ, మొరసునాడు, రొండనాడు, కొంగునాడుల గురించీ – ఇలా ఎన్నెన్నో తన క్షేత్ర పర్యటన ద్వారా స్వయంగా సేకరించిన సమాచారాన్నంతా కుమ్మరించి పాఠకులకు ఆశ్చర్యంలోనూ, ఆనందంలోనూ ముంచెత్తారు.

సరస్వతి సమ్మాన్ అందుకున్న తమిళ రచయిత మణివాణన్ రాతనుడి తమిళమే అయినా ఆయన నోటినుడి తెలుగు అని, ఆయన పెన్నేటిగట్టున దుత్తలూరు వంశంలో పుట్టారని రమేశ్ తెలియచేశారు.

స.వెం. రమేశ్ వ్యాసాలలో శైలి ఆహ్లాదకరంగా మనం మరచిపోయిన తెలుగు పదాలతో నిండి వుంటుంది. ఆయన రాసిన 'ప్రళయ కావేరి' కథలు ఒక కొత్త శైలిలో వుంటాయి. మొత్తంమీద తెలుగుభాషకు ఎల్లలు లేని తనాన్ని తన క్షేత్ర పరిశోధన ద్వారా రమేశ్ నిరూపిస్తున్నారు.

రెండవ పుస్తకం 2019 ఏప్రిల్ 15న విడుదలైన **"తెలుగే గొప్ప భాష.... కాని కనుమరుగౌతున్నది".** దీని రచయిత పారుపల్లి కోదండరామయ్య, హైదరాబాదు విద్యుత్ పంపిణీ సంస్థలో చీఫ్ ఇంజనీరుగా పనిచేశారు. ఈ పుస్తకానికి ముందుమాటలు డా॥ అద్దంకి శ్రీనివాస్, చెన్నూరు ఆంజనేయరెడ్డి, జయధీర్ తిరుమలరావు, వంగూరి చిట్టెన్‌రాజు రాశారు. ఈ పుస్తకం శీర్షిక 'తెలుగే గొప్ప భాష...' అనడంలో 'మిగిలిన భాషలు గొప్పవి కావు' అనే అర్థం వస్తుంది. కనుక ఆ శీర్షికను చిట్టెన్‌రాజు తప్పుపట్టడం సవ్యంగానే వుంది.

తెలుగు భాషోద్యమకారులకు ఈ పుస్తకం కరదీపిక. ఎన్నో రంగాలలో, ఎన్నో రకాలుగా, ఎన్నో దేశాలలో వ్యాపించి ఖ్యాతి పొందిన తెలుగు గురించి అనేక వివరాలు దీనిలో వున్నాయి. వాక్య నిర్మాణం గురించీ, బంధువుల పేర్ల గురించీ, అందంగా తెలుగులో మాట్లాడటం గురించీ, లిపి గురించీ, తెలుగులోని పద్యాలు, శతకాలు, అష్టావధానాలు, ద్వర్థి, త్ర్యర్థి, చతుర్వర్థి కావ్యాల గురించీ ఇలా ఎన్నెన్నో విశ్లేషణలున్నాయి.




"క్రీస్తుకు ముందు 2000 ఏండ్లనాటికే మనిషి తన జీవితంలో వాడటానికి సరిపోనుగా పూర్తిగా పెరిగిన నుడి తెలుగు" అన్నారు రచయిత. ప్రశ్నోత్తరాలంకారం తెలుగులోనే వుందని వివరించారు. ఒక తెలుగు క్రియావాచక పదం నుండి కొన్ని పదుల వేల మాటలను పుట్టించవచ్చు అని ఉదాహరణలు ఇచ్చారు. ఇతర భాషల నుండి తెలుగులో ప్రవేశించిన పదాలను పరిచయం చేశారు. సంస్కృత పదాలు లేకుండా కేవలం తెలుగులోనే వున్న 81 పుస్తకాల వివరాలు ఇచ్చారు. సంస్కృతం మాటలు వాడితేనే గొప్ప అనుకోవడం మానివేయాలన్నారు.


మన రోజువారీ కార్యక్రమాలలో, ఉద్యోగాలలో తెలుగును బహుళంగా ప్రచారం చేయడానికి మనం ఏంచేయాలో 23 కార్యక్రమాలు ఇచ్చారు.

'సంస్కృతం' బదులు 'సంస్కురుతం', 'సంస్కురుతి' అని ఎందుకు వాడారో వివరించలేదు. కథారచయిత చలం, ఇటీవల మరణించిన

రచయిత ఎం.వి. రమణారెడ్డి, రంగనాయకమ్మ స.వెం. రమేశ్ మొదలగువారు కూడా తెలుగులోని కొన్ని పదాలను, వాడుకలో వున్న పద్ధతిలోగాక వేరేవిధంగా వాడిన సందర్భాలున్నాయి.

విద్యుత్‌శాఖలో పనిచేస్తూ, విద్యుత్తు రంగంలో ఈనాటికీ కొత్త ఆవిష్కరణలు చేస్తున్న కోదండ రామయ్య ప్రతినెలా రెండవ, నాల్గవ శనివారాల్లో తెలుగుభాష గురించి 'రచ్చబండ' అనే కార్యక్రమాన్ని జూమ్‌లో నిర్వహిస్తున్నారు.

మూడవ పుస్తకం – **"ఒక తెలుగు కథ – తెలుగు తక్కువ ప్రపంచంలో"**. దీని రచయిత విశ్రాంత ఐ.ఎ.ఎస్. అధికారి నంది




వెలుగు ముక్తేశ్వరరావు. ఇంగ్లీషు అక్షరాలపైన 'మా ఇంగ్లీషు తల్లికి లిల్లి పూదండ' అనే జెండా ఎగరేస్తున్న బాలుడి భావస్ఫోరకమైన ముఖచిత్రంతో 2020లో ఇది వెలువడింది. రచయిత బహు భాషావేత్త – నల్లగొండ జిల్లా కలక్టరుగా జిల్లా అంతా తెలుగులో పాలనా వ్యవహారాలు నడిపిన తెలుగు ప్రేమికుడు. వున్న చట్టాలను ఉపయోగించుకుని పరిపాలన తెలుగులో చేసి, ప్రజలకు చేరువు కావచ్చని తన కార్యాచరణ ద్వారా ఆదర్శనీయమైన కృషిని కలక్టరుగా వీరు చేశారు.

ఒక జాతి సంస్కృతి సంక్షోభంలో పడుతున్నప్పుడు విద్యాధికుల మౌనం ఒక నేరం గనుక ఆయన మౌనం వీడారు. భాష సంస్కృతిలో ఒక ముఖ్యభాగం : అది నశిస్తే సంస్కృతే నశించినట్లు ఈ విషయాన్ని రచయిత చాల బలంగా చెప్పారు. ఈనాటి నాయకులకు, అధికారవర్గానికి కళాసాహిత్య సాంస్కృతికరంగాలలో కనీస ప్రవేశం, స్పృహలేదనీ, కనుకనే ప్రభుత్వాలు ఒక స్పష్టమైన భాషావిధానం, సాంస్కృతిక విధానం రూపొందించి అమలుచేయడం లేదని సరిగ్గా విమర్శించారు. అధికారభాషా సంఘం కూడా అనేక అకాడమీలు, కార్పొరేషన్లు లాగా ఒక రాజకీయ పునరావాస కేంద్రం మాత్రమేనన్నారు.


ముక్తేశ్వరరావు ఈనాటి ఇంగ్లీషు భాషాబోధన ఎంత లోపభూయిష్టంగా వుందో వివరించారు. ఇంగ్లీషే కాదు – అన్ని సబ్జెక్టులలోనూ పిల్లలు భట్టీయం మాత్రమే చేస్తున్నారు. విషయం అర్థం చేసుకుని సొంతంగా రాయలేని పరిస్థితి ఈనాడు విద్యార్థులలో ఏర్పడింది. మనం మాతృభాష గురించీ, ఇంగ్లీషు వ్యామోహం గురించీ మాట్లాడుతున్నాం గనుక ఇంగ్లీషు భాషా బోధన సరిచేయాలన్నారు. స్పష్టంగా, సరళంగా భావాన్ని వ్యక్తీకరించడానికి సరిపడ ఇంగ్లీషును నేర్పే పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ విషయమై తాను కలక్టరుగా నల్లగొండ జిల్లాలో 12 మాడ్యూల్స్‌తో ఇంగ్లీషు శిక్షణా కార్యక్రమం 3 రోజులపాటు 750 మందికి నిర్వహించిన ఫలితాలను పొందుపరిచారు. ఇంగ్లీషును డిస్కోర్స్ మెథడ్‌లో బోధించే పద్ధతిని ఫలితాలు వివరించారు. ఈనాడు పాఠశాలల్లో అనుసరిస్తున్న ఇంగ్లీషు బోధన పరమ అశాస్త్రీయంగా, కంగాళీగా వుండటం వల్లనే రెండవ భాషగా ఇంగ్లీషు వున్నా అది రావడంలేదని ఋజువు చేశారు. ఇంగ్లీషు రావాలంటే అది బోధనా మాధ్యమంగా వుండనక్కర్లేదన్నారు. మనకు King's English, Queen's English అక్కర్లేదు. అతి సాధారణ ఇంగ్లీషు చాలు. దానిని అవసరమైనప్పుడు 5, 6 నెలల్లో నేర్పే టోఫెల్, జిఆర్ఇ, ఐ.ఈ.ఎల్.టి.ఎస్. కోర్సులు వున్నాయని గుర్తుచేశారు.

ఇంగ్లీషు వ్యామోహాన్ని తగ్గించాలంటే దానికిచ్చే ప్రాధాన్యాన్ని తగ్గించాలి. ఉద్యోగాలిచ్చేటప్పుడు ఇంగ్లీషుకు ఇచ్చే ప్రముఖ స్థానాన్ని మాతృభాషకు ఇవ్వాలి. 15 శాతంగా వున్న ఆర్థిక శిష్టవర్గం ఈ విషయమై సమాజాన్ని శాసిస్తూ, ఉన్నత ఉద్యోగ సంపాదనకు ఇంగ్లీషు అత్యవసరమనే భావాన్ని వ్యాప్తిచేస్తోందన్నారు.

అసలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(ఎ); ఆర్టికల్ 350(ఎ) ప్రకారం ప్రాంతీయ భాషల్లోనే ముఖ్యంగా స్థానిక భాషల్లోనే విద్యాబోధన చేయాలనీ, ఈనాడు ప్రాథమిక స్థాయినుండి ఇంగ్లీషు మాధ్యమం అమలుచేయడం ఎలా చట్టవిరుద్ధమో వివరించారు. ఇంగ్లీషును మనపై రుద్దటం ద్వారా మన సంస్కృతిని, మన ఆత్మగౌరవాన్ని, ఎలా పోగొట్టుకుంటామో లార్డ్ మెకాలే 1835 ఫిబ్రవరి 2న బ్రిటీషు పార్లమెంటులో ఇచ్చిన ప్రకటనను ఆఖరి పుటలో ఇచ్చి మనలను కళ్ళుతెరవమని చెప్పారు.

మాతృభాష అవసరాన్ని గుర్తింపచేస్తూ 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఆరు వ్యాసాల ఫొటోస్టాట్‌లను అనుబంధంగా ఇచ్చారు. భాషాసమస్యపై వచ్చిన మూడు నాలుగు కార్టూన్లు కూడా ఈ పుస్తకంలో అందించారు.

నాల్గవ పుస్తకం **'విశ్వభాష తెలుగు – వినురవేమా'** దీని రచయిత ఆయుర్వేద వైద్యంలో ఆచార్యులుగా పనిచేసిన డా॥ పొత్తూరు రంగనాయకులు. ఇది డిసెంబరు 2020లో విడుదలైంది. రంగనాయకులు ప్రపంచభాష ఎస్పరాంటోలో బాగా కృషిచేశారు. ఈ పుస్తకం చివరిభాగంలో ఎస్పరాంటో భాష ప్రపంచంలోని అన్ని దేశాలవారికీ ఎలా ఉపయోగ పడుతుందో వివరించారు.




"పరాయిభాషలో విద్యా బోధన పూర్తిగా అసహజం – మరీ ముఖ్యంగా బాల్యంలో" అంటూ పదవ తరగతి

వరకూ మాతృభాషా మాధ్యమంలో బోధన వుండాలని చెప్పారు. పరాయిభాష మన నాడీ మండలాన్నే దెబ్బతీయడం మొదలుపెడుతుందని వైద్యునిగా చెప్పారు. 'భాష పరిస్థితి బాగాలేదు అంటే ఆ భాషను మాట్లాడేవారి పరిస్థితి బాగోలేదు అని అర్థం అన్నారు. 5 వేల సంవత్సరాల క్రితమే భాషను అక్షరాల రూపంలో నిక్షిప్తం చేయడం ప్రారంభమైందనీ, దేశంలో నిజమైన అభివృద్ధి మాతృభాష ద్వారానే జరుగుతుందనీ, శిశు విద్యాలయాల నుంచి స్నాతకోత్తర విద్య వరకూ తెలుగులో చదువుకొనేలా అవకాశాలు కల్పించడం అవసరమనీ వివరించారు. 1980లలో తెలుగు అకాడమీ స్థాపించి గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి వరకు కొన్ని కోర్సులు తెలుగులో బోధించిన చరిత్ర మనముందు వుంది. వాటికవసరమైన పాఠ్య గ్రంథాలు కూడా ముద్రించారు. కాని క్రమంగా మరల వెనక్కి వెళ్ళి ఆంగ్ల మాధ్యమంలోకి ప్రవేశించాం.

ఇప్పటికే తెలుగులో ప్రవేశించి, ప్రచారంలో వున్న ఇతర భాషా పదాలను కొనసాగిస్తూనే, కొత్త పదాలు అవసరమైనపుడు ద్రవిడ పదకోశాలపై ఆధారపడదామని సరైన పద్ధతి సూచించారు. తెలుగు బదులుగా హిందీ మన దేశభాష అని దాన్ని నేర్చుకోవడం మొదలుపెడితే మరో వలసపాలనలో కూరుకుపోవడం ఖాయం అని హెచ్చరించారు.

యు.జి.సి. (విశ్వవిద్యాలయాల విరాళాల కమిషన్) కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకులకు లక్షల్లో జీతాలు ఇస్తోంది. వారు తమ జీతంలో కనీసం 5 శాతం తమ తమ విషయాలకు సంబంధించిన కొత్త పుస్తకాలు కొనుక్కొని విద్యార్థులకు నిత్యనూతనంగా బోధించాలి. కాని అది జరగడంలేదు.

రంగనాయకులు మరో ముఖ్య విషయం చెప్పారు. సొంత భాషలో విద్య అందకపోతే జ్ఞానం విజ్ఞానంగా మారదు అన్నారు. విజ్ఞానం ప్రజల భాషల్లోనే వికసించిందనీ, గెలీలియో లాటిన్ అనే ప్రాచీన భాషలో కాకుండా తన ఇటాలియన్‌లోనే రచించాడనీ వివరించారు.

పరాయి భాషలో బట్టీ వేయించడం ద్వారా మన దేశంలో అక్షరాస్యులైన అవిద్యావంతులు తయారౌతున్నారు. అభివృద్ధి పరభాష ద్వారా సిద్ధించదు – సొంత భాష ద్వారానే ఎదుగుదల సాధ్యమని చెప్పారు.

తెలుగులో సాధారణ నిఘంటువులు, వైద్య, సాంకేతిక నిఘంటువులను తయారుచేసుకోవడంపై కొన్ని సూచనలిచ్చారు. ప్రజల భాషలో పాలన వుండటం సంక్షేమ రాజ్యం మొదటి లక్షణం. కాని అధికారభాషలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు, ఉర్దూ గుర్తింపబడినా పరిపాలనలో ఇంగ్లీషే కొనసాగుతోంది. అధికారులు తెలుగే వాడేట్లు ఉద్యమకారులు కృషిచేయాలంటూ, 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం లేదు, భాషా నిర్లక్ష్యమే వుంది' అని తేల్చి చెప్పారు.

చివరి అధ్యాయంలో ప్రపంచ భాషగా తెలుగు గుర్తింపబడాలంటే విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా, పరిపాలన ఇలా అన్నిరంగాల్లో అది సుసంపన్నం కావాలి. అన్ని మాండలీకాలను సజీవంగా వాడాలి. స్వయం ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయాలు మాతృభాష పట్ల కేంద్రీకరించాలి. విద్య ప్రభుత్వ నిర్వహణలో వుండి, ప్రజల భాషలో పరిపాలన సాగుతుండాలి అంటూ రంగనాయకులు ముగించారు.

**1. 'ఎల్లలు లేని తెలుగు' :** 254 పుటలు. వెల : రూ. 200/– ప్రతులకు : తెలుగుజాతి ట్రస్టు, జి–2 వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కాలేజీ వీధి, మాచవరం, విజయవాడ – 520004. ఫోన్ : 94840 16136.

**2. తెలుగే గొప్ప భాష :** 112 పుటలు. వెల : రూ. 80/– ప్రతులకు : jyothivalaboji@gmail.com ఫోన్ : 80963 10140.

**3. ఒక తెలుగు కథ – తెలుగు తక్కువ ప్రపంచంలో :** 82 పుటలు. వెల : రూ. 25/– ప్రతులకు : మండలి ఫౌండేషన్, గాంధీక్షేత్రం, అవనిగడ్డ – 521121. కృష్ణాజిల్లా.

**4. 'విశ్వభాష తెలుగు – వినురవేమ' :** 126 పుటలు. వెల : రూ. 100/– ప్రతులకు : పల్లవి పబ్లికేషన్స్, 59–1–23/2, అశోక్‌నగర్, విజయవాడ – 520010. ఫోన్ : 95661 15655.

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

ఈనాడు
రాజకీయ అనిశ్చితి అక్కర్లేదు
విధాన నిర్ణయాలు వెదజల్లితే చాలు
వైఫల్యాల్నిన అంగీకరించటమంటే
కందువాకి వేలాడటమే కదా
కోరి కోరి మెడపై కత్తి ఎందుకు పెట్టుకుంటారు
భ్రమలో నైనా ఆశావాదులు గానే ఉండాలి
అందుకే సభలో ధ్వనించే జేజేలనూ
శృతిలేకున్నా అపస్వరాలు ధ్వనించినా
గుండెల్లో దాచుకుని మురవక తప్పదు
పవనాలు ఎటునుంచి వీస్తేనేం
శరీరాన్ని చల్లగా తాకితే చాలు
దాడి కట్టిన వందిమాగధుల కోలాహలం
చేదు నిజాన్ని మింగనివ్వదు కదా
ఇప్పుడు
ఎన్నికలంటే ప్రజాభిప్రాయం కాదు కదా
గెలుపోటములు నిర్ణయించేది చేతికంటిన తడే
ఎంత నోట్లధార కురిపిస్తే అంత బలగం
నిజాయితీ ఎప్పుడో మనసు ముడుచుకుని
మూడుకోతులతో పాటూ నాల్గో కోతైకూర్చుంది
జనాదరణ ఉందనేది నీటిరాతే
చెయ్యి తడవకపోతే
బాలెట్ బాక్సులు నోరెళ్ళబెట్టాల్సిందే
స్థానబలిమి ఉందని విర్రవీగితే
కాళ్ళకింద నేల జారుడుబండే
ఎంత కుమ్మరిస్తే అంత దిగుబడి
ఎంత వరద పారిస్తే అంత రాబడి
అభ్యర్థుల మేధస్సుతో పనిలేదు
వేలిముద్రలగాడైనా పర్లేదు
సిగ్గుఎగ్గుల్ని దులిపేసుకుంటే చాలు
ఓటర్లనాడి పట్టగల్గితే బాగు

(ఇంకావుంది)

# జోహార్లు! కొత్తపల్లి సుధాబాల



జనసాహితి సంస్థకూ, 'ప్రజాసాహితి' పత్రికకూ అత్యంత ఆత్మీయురాలు, 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకులు రవిబాబుగారి జీవన సహచరి కొత్తపల్లి సుధాబాల 31-01-2023 తెల్లవారుజామున తెనాలిలో స్వగృహంలో మరణించారు. ఆమె తుమ్మల తిరుమలరావు, శైలసుతాదేవి దంపతులకు మొదటి సంతానంగా 1946 నవంబరు 30న తెనాలి దగ్గర కూచిపూడిలో జన్మించారు.

తెనాలి JMJ కళాశాలలో PUC చదివారు. 1966లో రవిబాబు, సుధాబాలగార్ల వివాహం జరిగింది. మంచి చదువరి, జనసాహితి సంస్థతో రవిబాబుగారి ప్రయాణమంతటా ఆమె చేదోడువాదోడుగా వున్నారు. సంస్థనే కుటుంబంగా చూసుకుంటూ, వారి కుటుంబంలో వచ్చిన అన్ని ఒడిదుడుకులను సామాజిక స్పృహతో అధిగమించారు. జనసాహితి సంస్థ సభ్యులను, కార్యకర్తలనేగాక ప్రజాసాహిత్యాభిమానులందరినీ ఆప్యాయంగా, ఆత్మీయంగా ఆదరించేవారు.

కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సంతాపం.

సుధమ్మకు జోహార్లు!!

జనసాహితి

(2వ అట్ట తరువాయి....)

మహారాజు ముందు ఉలిక్కిపడ్డాడు. తరువాత తేరుకుని "అరే ఈ విషయం మరచేపోయాను. పక్షిని చూడాలనే ఆలోచనే రాలేదు" అన్నాడు.

వెనక్కి తిరిగివచ్చి రాజు పండితులతో "పక్షికి మీరు ఏమేమీ నేర్పిస్తున్నారో, ఎలా నేర్పిస్తున్నారో చూడాలని కోరికగా ఉంది" అన్నాడు.

రాజుగారి కోరిక మేరకు అన్నీ చూపించారు. వాటిని చూసి రాజు అలవికాని ఆనందం పొందాడు. పక్షికి నేర్పించే ఏర్పాట్లు ఎంత ఎక్కువగా ఉన్నాయంటే దానిలో పక్షే కనబడడంలేదు. రాజు పక్షిని చూడాల్సిన అవసరం లేదనుకున్నాడు. రాజు తెలివిగలవాడు. ఏర్పాట్లలో లోపం ఏమీలేదని గ్రహించాడు.

పంజరంలో దాణాలేదు. నీళ్ళూ లేవు. విద్య మాత్రం చాలా అధికంగా ఉంది. చాలా పుస్తకాలు, వాటిలో చాలా పుటలు. వాటిని చించి కలం పాళీతో దాని నోట్లో కూరుతున్నారు. చిలుక పాటలయితే ఆగిపోయాయి. అరచి గోలచేసే ఆనవాళ్ళే లేవు. చూడగానే గగుర్పాటుతో రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

ఈసారి రాజు ఏనుగునెక్కుతూ "చెవి మెలిపెట్టే" సైనికాధికారితో ఈవిధమైన ఆదేశం ఇచ్చాడు : "విమర్శకుల చెవి బాగా మెలిపెట్టండి."

ఈ చదువుకున్న వాళ్ళ వ్యవహారంతో పక్షి పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోయింది. ప్రగతి చాలా ఆశాజనకంగా వుందని ప్రజలు అనుకున్నారు. పక్షి అలవాట్లు పక్షికి ఉంటాయి. పక్షి తూర్పున వున్న సూర్యకాంతివైపు చూస్తూ నిర్భయంగా రెక్కలు కొట్టుకుంటూ ఉంది. అంతేకాదు ఒక్కోసారి పక్షి తన ముక్కుతో అమూల్యమైన పంజరం కడ్డీలు కొరుకుతూ, కొడుతూ కనపడుతూ వుంటుంది.

కాపలాదారుడు ఇది చూసి భృకుటి ముడిచి "ఎంత అహంకారం దీనికి?" అంటూ అరిచాడు.

అపుడు విద్యాశాలలోకి సమ్మెట - శానం తీసుకుని కమ్మరి వచ్చాడు. ఇంకేముంది. మళ్ళీ రణగొణ ధ్వనులు. ధమ ధమ చప్పుళ్ళు. చూస్తుండగానే పక్షి రెక్కలు కత్తిరించబడ్డాయి.

రాజుగారి దూరపు బంధువులు నోరు పెద్దది చేసుకుని తలతిప్పుతూ యిలా అన్నారు : "ఈ రాజ్యాంగంలో పక్షుల గురించి అడగవద్దు. తెలివి అసలు లేనేలేదు. దానికితోడు ఇప్పుడు కృతజ్ఞత కూడా లేకపోయింది."

రోజురోజుకీ కమ్మరి ఆదాయం పెరిగి ఆయన భార్య శరీరం మీద బంగారు నగలు ప్రత్యక్షమయ్యాయి. పర్యవేక్షకుడి తెలివికి సంతోషించిన రాజు అతనికి పెద్ద బహుమతి ఇచ్చాడు.

పక్షి చనిపోయింది. ఎప్పుడు చనిపోయిందనే తిథి నక్షత్రాల గురించి ఏ చరిత్రకారుడు చెప్పలేకపోయాడు. పనీ పాటాలేని విమర్శకులు పక్షి చనిపోయిందనే ప్రచారం మొదలుపెట్టారు.

రాజు పెద్ద మేనల్లుడిని పిలిచి ఇలా అడిగాడు : "కుమారా, నేనేమి వింటున్నాను".

చేతులు జోడించి మేనల్లుడు విన్నవించుకున్నాడు.

"మహారాజా! పక్షి విద్య పూర్తయింది".

రాజు అడిగాడు : "ఇప్పుడు కూడా దుముకుతుందా?"

మేనల్లుడు "లేదు".

"ఎగురుతుందా?"

"లేదు".

"పాడుతుందా?"

"లేదు".

"పక్షిని ఒకసారి తెచ్చి చూపించండి" రాజు ఆజ్ఞాపించాడు.

పక్షి వచ్చింది. దీనివెంట సైనికాధికారి, పదాతిదళాలు, అశ్వికదళాలు వచ్చాయి.


రాజు పక్షిని వేలితో గుచ్చాడు. పక్షి నోటినుండి ఏ శబ్దంగానీ చిన్నపాటి ధ్వనిగానీ రాలేదు. రెక్కలు లేని దాని శరీరం నుండి ప్రతిస్పందన లేదు. దాని పొట్టలో నుండి పుస్తకాల పేజీల చప్పుడు మాత్రం గరగరమంటూ వినపడింది.

బయట నవవసంత దక్షిణదిశ గాలికి మొగ్గలు, పూలు ఓ నిట్టూర్పు విడిచాయి.

PRAJA SAAHITI February 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

శ్రమ ఎవరిదిరో



సిరి ఎవరిదిరో

కార్టూనిస్ట్ టీ.వీ. గీసిన చిత్రం

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI